
శతారుణ గీతాంజలి
రూ॥ 180/-
పేజీలు: 180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మోదీ అండదండలతో విశ్వాస ద్రోహం


డిల్లీలో కాకుండా మరెక్కడ చేయాలి?

'ఉపా' కేసులో ముగ్గురి అరెస్టు..

07



సంపుటి 09, సంచిక: 223 | సోమవారం | 13-07-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఏడిపిస్తున్న ఎల్‌నినో

## ముందుకు సాగని వ్యవసాయం

- 26 జిల్లాల్లో లోటు వర్షపాతం
- నాలుగు నెలల వర్షాకాలంలో నలభై రోజులు వృథా
- జూన్ చివరి నాటికి 14.78 లక్షల ఎకరాల్లోనే సాగు
- వట్టిపోయిన సాగునీటి ప్రాజెక్టులు
- పాతాళానికి భూగర్భ జలాలు
- తీవ్ర సంక్షోభంలో ఖరీఫ్ సాగు
- వర్షాలు లేక బిక్కు బిక్కుమంటున్న రైతాంగం
- పశువుల మేతకు తీవ్ర కటకట

ప్రజాపక్షం/హైదరాబాద్/ ఖమ్మం

రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై సూపర్ ఎల్‌నినో ప్రభావం చాలా తీవ్రంగా కనిపిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం వల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడి, రాష్ట్రం లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్ సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. వానాకాలం ప్రారంభమై దాదాపు 40 రోజులు గడిచినా రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటలు వేసేందుకు రైతులు జంకుతున్నారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో జూన్ నెలలో సాధారణం కంటే 22 శాతం తక్కువ వర్షపాతంనమోదు కాగా, జులై రెండో వారం నాటికి రాష్ట్ర సగటు వర్షపాత లోటు 13 శాతం నుండి 16.5 శాతం వరకు నమోదైంది. సాధారణంగా ఈ సమయానికి 177.9 మి.మీ. కురవాల్సి ఉండగా, కేవలం 154.9 మి.మీ మాత్రమే నమోదు కావడంతో పంటలసాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ఎల్‌నినో సృష్టించిన వర్షపాత లోటు రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తోంది. దాదాపు 17 నుండి 26 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ (లోటు) వర్షపాతం నమోదైంది. వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లోని పలు మండలాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. కొన్ని దక్షిణ, పశ్చిమ జిల్లాల్లో ఈ లోటు మరింత ఎక్కువగా ఉంది. మొత్తం 1.32 కోట్ల ఎకరాల సాగు భూమి ఉండగా వర్షపాత లోటు కారణంగా రాష్ట్రంలో జులై మొదటి వారం ముగిసేసరికి కేవలం 14.78 లక్షల (11.2 శాతం) ఎకరాల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సమయానికి గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు సగానికి పైగా తక్కువ ఉంది. రాష్ట్రంలో వరి సాధారణ సాగు విస్తీర్ణ లక్ష్యం దాదాపు 65.97 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 4.22 తరువాయి 8లో



## ఒమన్ తీరం వద్ద

# వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి

## భారతీయుడు గల్లంతు : పది మంది సురక్షితం

- ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలు సహా 140 లక్ష్యాలపై సెంట్‌కామ్ దాడులు
- సర్వత్రా క్షిపణి హెచ్చరిక మోతలు
- ఎనిమిది ఇరాన్ నగరాల్లో పేలుళ్ళు
- గల్ఫ్ అరబ్ దేశాలపై విరుచుకుపడిన ఇరాన్
- మేం మళ్ళీ చెప్పేవరకూ హోర్ముజ్ తెరుచుకోదు : ఐఆర్‌జిసి

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో సైప్రస్ జెండాతో వెళుతున్న మరో భారత సిబ్బంది వాణిజ్య నౌక ఎం/వి జిఎఫ్ఎస్ గెలాక్సీపై దాడి జరిగింది. ఒమన్‌కు తూర్పుతీరంలో ఉన్న జలాల్లో దాడికి గురైన నౌక నుండి పదిమంది నావికులు,పౌరులు సురక్షితంగా లైఫ్‌బోటులోకి వెళ్ళారు. ఐతే ఒక భారతీయుడి జాడ తెలియడంలేదు. అతడికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకూ హోర్ముజ్ జలసంధి తెరుచుకోదని స్పష్టం చేస్తూ హెచ్చరిక కాల్పులు జరిపిన కొద్ది గంటలకే అమెరికా దాడులు ప్రారంభమయ్యాయి. హోర్ముజ్‌లో ప్రధాన జలమార్గంలో వెళుతున్న వాణిజ్య నౌకపై దాడి చేసినందుకే తాము దాడులు చేశామని సెంట్‌కామ్ ప్రకటించింది. ఈ నౌక సైప్రస్ జెండాతో వెళుతోందని పేర్కొంది. ఈ నౌకపై ఇరాన్ దాడులు చేసిందని అమెరికా సైన్యం సెంట్‌కామ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో అమెరికా తన మూడో విడత దాడులకు భారత్ సిబ్బంది ఉన్న నౌకనే కారణంగా చూపించినట్లయింది. సైప్రస్ జెండాతో వెళుతున్న ఈ నౌకలో 11 మంది భారతీయులు ఉన్నారని విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఈ ప్రాంతంలో దాడులు తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. ఈ ప్రాంతంలో నావికులకు రక్షణ ఉండాలని, వాణిజ్య నౌకలు,పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు ముగిసిపోవాలని కూడా డిమాండ్ చేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో స్వేచ్ఛాయుత, నిరాటంక నౌకారాకపోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కోరింది. కాగా, భారత వాణిజ్యనౌక జిఎఫ్ఎస్ గెలాక్సీ ఇంజిన్ రూమ్‌పై ఇరాన్ తరువాయి 8లో

## భారత్ ఖండన

### దాడులు ఆపి సురక్షిత నౌకాయానానికి భరోసా ఇవ్వాలి : విదేశీమంత్రిత్వశాఖ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఒమన్ తీరంలో సైప్రస్ జెండాతో వెళుతున్న వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఈ నౌకలో 11 మంది భారత సిబ్బంది, పౌరులు ఉన్నారని, వీరిలో ఒకరు గల్లంతయ్యారని ఆందోళన వ్యక్తం చేసింది. గల్లంతైన నావికుడికోసం తీవ్రంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితులను ఎప్పటికప్పుడు భారత్ కనిపెట్టుకుని పర్యవేక్షిస్తోందని భారత విదేశీమంత్రిత్వశాఖ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. పదిమంది భారతీయ సిబ్బంది,పౌరులు మాత్రం సురక్షితంగా లైఫ్‌బోటులోకి ఎక్కారని వారు క్షేమంగా ఉన్నారని కూడా ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో పదే పదే నావికులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. పశ్చిమాసియాలోని హోర్ముజ్ జలసంధిలో అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి యుద్ధ పరిస్థితులు చెలరేగుతున్న తరుణంలో ఈ ఉద్రిక్తతలను తక్షణం తొలగించాలని భారత్ డిమాండ్ చేసింది. హోర్ముజ్ తరువాయి 8లో



## తల్లిదండ్రుల 'సర్' వివరాలు తప్పనిసరి

### కొత్త అభ్యర్థుల ధరఖాస్తులపై ఇసి సూచనలు

**అయోధ్య :** గతంలో జరిగిన ఓటరు ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో చేర్చబడని ప్రస్తుత ఓటర్లు మాత్రమే కాకుండా, ఓటర్ల జాబితాలో చేరడానికి దరఖాస్తు చేసుకునే కొత్త అభ్యర్థులు కూడా తమ తల్లిదండ్రుల సర్ వివరాలను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం (ఇసి) అధికారులు తెలిపారు. ఎన్నికల జాబితాలో చేరడం కోసం ఫారం 6 నింపే కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రుల 'సర్' వివరాలను జతచేయడాన్ని తప్పనిసరి చేస్తూ ఎన్నికల సంఘం (ఇసి) తరువాయి 12లో



## క్షీణిస్తున్న సోనమ్ ఆరోగ్యం

- తగ్గుతున్న రక్తపోటు
- 7.8 కిలోలు తగ్గిన వాంగ్‌చుక్
- 15 రోజులుగా కొనసాగుతున్న నిరవదిక నిరాహార దీక్ష

**న్యూఢిల్లీ :** పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 15వ రోజుకు చేరుకోగా, ఆదివారం ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. రక్తపోటు తగ్గడంతో పాటు, దీక్ష ప్రారంభమైనప్పటి నుండి మొత్తం 7.8 కిలోల బరువు తగ్గినట్లు వైద్యులు తెలిపారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) చేపట్టిన నిరసన ఆదివారంతో 23వ రోజుకు చేరుకుంది. ఆ సంస్థ అందించిన ఆరోగ్య సమాచారం ప్రకారం... వాంగ్‌చుక్ రక్తపోటు 104/66 ఎంఎం హెచ్‌జికి పడిపోయింది, అలాగే దీక్ష మొదలైనప్పటి నుండి ఆయన బరువు మొత్తం 7.8 కిలోలు తగ్గింది. అంతేకాకుండా, ఈ ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు పలువురు రాజకీయ నాయకులు, మేధావులు నిరసన స్థలాన్ని సందర్శించినట్లు తరువాయి 8లో



## 'బొగత' పరవళ్లు సందర్శకుల సందడి

- జలపాతం వద్ద కిక్కిరిసిన పర్యాటకులు

ప్రజాపక్షం/వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం బొగత జలపాతం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలతో జలపాతంలో నీటి ప్రవాహం పెరగడంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు వరంగల్, ఖమ్మం, తరువాయి 12లో

## 'తెలంగాణ రక్షణ సేన'కు గుర్తింపు ఇవ్వండి..

- ఆ అభ్యంతరాలు మాకు ఇవ్వండి...
- కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ రక్షణ సేన' అనే పేరుతో దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని, ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలిలేదని, అందుకే తమ పార్టీకి (తెలంగాణ రక్షణ సేన ) గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ కింద ప్రతిపాదిత 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ గుర్తింపు కోసం తాము చేసుకున్న దరఖాస్తును పరిశీలించి, ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క తరువాయి 12లో




# జల జగడాలొద్దు

- రైతులకు సాగు నీరివ్వాలి
- నీచ రాజకీయాలు, బూతు పురాణం సరికాదు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ వ్యాఖ్యల తీరును ఖండిస్తున్నాం
- పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్

రాష్ట్రంలో రాజకీయ జగడాలు మాని సాగు జలాలను అందించేందుకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ ఉమ్మడి జిల్లా మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి కూనంనేని అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెంపల్లి రిజర్వాయర్ నింపి నీళ్లు ఇవ్వాలని హరీష్ రావు, కెటిఆర్, నింపితే తెగి కొట్టుకుపోయి నష్టం జరుగుతుందని సిఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని దీనిపై నీచ రాజకీయాలు, బూతు పురాణం సరికాదని, సంయమనం పాటించాలని సూచించారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ వ్యాఖ్యలను తీరును సిపిఐ ఖండిస్తోందన్నారు. మూడేళ్ల క్రితం కాళేశ్వరం ఫిల్లర్లు కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిశీలించి సిడబ్ల్యుసికి నివేదిక పంపినా ఇంతవరకు సిడబ్ల్యుసి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. కాళేశ్వ రం విషయంలో రాజకీయ నిర్ణయాలు సరికాదని సిడబ్ల్యుసి నివేదిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం తెలంగాణ ఏ ప్రాజెక్టుకు ఇంతవరకు జాతీయ హోదా ఇవ్వలేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండు చేశారు. ఆంధ్రకు పోలవరానికి జాతీయ హోదా కల్పిస్తేనే పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, కెఎల్ఐ, నెట్టెంపాడు, బీమా కోయిల్‌సాగర్, తదితర ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఐదు, ఆరు లక్షల కోట్లు ఖర్చు పెడితే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు దాటిందని ప్రజల పక్షాన నిటారుగా నిలబడి రాజీలేని పోరాటం చేస్తోందని, సమరశీల పోరాటాల ద్వారా ఎర్రజెండా మరింత ఎరుపెక్కిందన్నారు. కమ్యూనిస్టు పార్టీపై కారుకూతలు కూసేవారు ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా బతికితే దాని తరువాయి 12లో

# 22 కొత్త రేడియల్ రోడ్లు

- హెచ్ఎండిఎ మాస్టర్ ప్లాన్ - 2031లో ప్రతిపాదనలు
- 24 నుంచి 60 మీటర్ల వెడల్పుతో అభివృద్ధికి ప్రణాళిక
- హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వేగవంతమైన అనుసంధానమే లక్ష్యం



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని హెచ్ఎండిఏ మాస్టర్‌ప్లాన్–2031లో 22 రేడియల్ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 'ఫ్యూచర్ సిటీ' విజన్‌కు అనుగుణంగా, మాస్టర్ ప్లాన్2031 పరిధిలో 22 కీలక రోడ్ల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), కోర్ సిటీ, అభివృద్ధి చెందుతున్న ఐటి, ఇండస్ట్రియల్ కారిడార్లను కలుపుతూ 22 ప్రధాన రహదారులను విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇరుకు గా మారి, బాటిల్‌నెక్‌గా పరిణమించిన ఈ 22 మార్గాలను ట్రాఫిక్ సాంద్రతను బట్టి 24,30,45,60 మీటర్ల వెడల్పుతో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న తరువాయి 8లో



# 'ఆరోగ్యశ్రీ'పై అసహనం

- నిర్మల్ జిల్లాలో అమలు తీరుపై సర్వత్రా విమర్శలు
- ప్రభుత్వ పథకాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ప్రైవేట్ వైద్యశాలలు
- రోగుల నుంచి అదనంగా వసూళ్లు

ప్రజాపక్షం/నిర్మల్

ప్రభుత్వం నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని విస్తరించి, ఆర్థిక పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచింది. అయితే నిర్మల్ జిల్లాలో ఈ పథకం అమలు తీరుపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఉద్దేశాలు ఎంత గొప్పగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలులో ఉన్న లోపాలు పథకం ప్రయోజనాలను పూర్తిగా ప్రజలకు చేరకుండా చేస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ తదితర ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ వైద్యశాలలు ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆదాయ మార్గంగా మార్చుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచితంగా అందించాల్సిన చికిత్సలు, శస్త్రచికిత్సలు, ఇతర వైద్య సేవల కోసం రోగుల కుటుంబాల నుంచి అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పడకల వినియోగ రుసుము, శస్త్రచికిత్స గది నిర్వహణ వ్యయం, ప్రత్యేక పరీక్షల ఖర్చులు వంటి పేర్లతో వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు తరువాయి 12లో

# కాలంతో పాటు మారేదే సాహిత్యం

సరిగ్గా ఏడాది క్రితం ప్రఖ్యాత కవి, రచయిత, విమర్శకుడు, సాహిత్య చరిత్రకారుడు, పరిశోధకుడు, నవచేతన పబ్లికేషన్స్ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ గారితో జరిపిన 'ముఖాముఖి'. వివిధ కారణాల నేపథ్యంలో, ప్రచురించలేకపోయిన ఇంటర్వ్యూ, ఇప్పుడు ఏటుకూరి గారి అకాల మృతికి సంతాపంప్రకటిస్తూ, 19వ తేదీన ఆయన 'జయంతి' సందర్భంగా ప్రచురించడం సముచితం.. సందర్భోచితం.

**ప్రశ్న: 'ముఖాముఖి'కి అవకాశం ఇచ్చినందుకు, ముందుగా మీకు ధన్యవాదాలు. ఈ సంభాషణను ఒక ప్రాథమిక ప్రశ్నతో ప్రారంభిద్దాం. సాహిత్యం అంటే ఏమిటి? అది కాలానుగుణంగా ఎందుకు మారుతూ ఉంటుంది?**

**ఏటుకూరి:** ధన్యవాదాలు. సాహిత్యం అనేది కేవలం పదాల సమాహారం కాదు. అది ఒక నాగరికతకు సంబంధించిన సామూహిక స్మృతి. మనిషి అనుభవించిన జీవితం, అతని కలలు, భయాలు, విశ్వాసాలు, పోరాటాలు, ఆశలు, నిరాశలు, విజయాలు, వైఫల్యాలు కలగలిసిన జీవన ప్రవాహమే సాహిత్యం. అందుకే అది ఎప్పుడూ స్థిరంగా ఉండదు. సమాజం మారితే సాహిత్యం మారుతుంది. విలువలు మారినప్పుడు కూడా సాహిత్యం కొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. ఒకప్పుడు మనిషి ప్రకృతి శక్తుల ముందు నిస్సహాయుడు. వర్షం ఎందుకు కురుస్తుంది? పిడుగు ఎందుకు పడుతుంది? వంటి అత్యంత సాధారణ ప్రశ్నలకు కూడా అతని వద్ద శాస్త్రీయ సమాధానాలు లేవు. అలాంటి సమయంలో పురాణాలు, ఇతిహాసాలు, దైవకథలు జన్మించాయి. అదే కాలంలో అవి ప్రజలకు జ్ఞానాన్ని, ధైర్యాన్ని, నీతిని అందించే సాధనాలుగా నిలిచాయి. తర్వాత రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజుల ఆధిపత్యం పెరిగింది. యుద్ధాలు, విజయాలు, సామ్రాజ్యాల విస్తరణ సమాజ జీవితంలో ప్రధాన అంశాలయ్యాయి. ఆ ప్రభావం సాహిత్యంపై పడింది. అందుకే ప్రతి యుగానికి తనదైన సాహిత్యం ఉంటుంది. సాహిత్యం చరిత్రను అనుసరించదు. ఎందుకంటే, అది చరిత్రతో కలిసి ప్రయాణిస్తుంది.

**ప్రశ్న: అంటే, సాహిత్యం సమాజానికి అద్దం అని చెప్పడం సరైనది కాదా?**

**ఏటుకూరి:** అది సగం నిజం మాత్రమే. 'సాహిత్యం సమాజానికి అద్దం' అని మనం తరచూ వింటాం. కానీ అద్దం కేవలం ఉన్నదాన్ని మాత్రమే చూపిస్తుంది. సాహిత్యం అంతకంటే గొప్పది. అది దారి కూడా చూపించాలి. చీకటిలో మనిషి చేతిలో ఉండే దివిటీలా ఉండాలి. ఉదాహరణకు బానిసత్వం ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా సాధారణ వ్యవస్థ. ఆ కాలంలో కొంతమంది రచయితలు దానిని సమర్థించారు. కానీ మరికొందరు మానవ గౌరవాన్ని సమర్థిస్తూ రచనలు చేశారు. చరిత్రలో మార్పును తీసుకొచ్చింది ఎవరు? అద్దంలా చూసినవారా? లేక వెలుగులా మార్గం చూపినవారా? సమాధానం స్పష్టంగా కనిపిస్తున్నది. అందుకే, సాహిత్యం వాస్తవాన్ని చూపాలి.. అదే సమయంలో, అంగీకారంకాని వాస్తవాన్ని మార్చే శక్తినీ కలిగి ఉండాలి అంటాను.

**ప్రశ్న: రాజుల కాలంనాటి సాహిత్యంలో ప్రజల జీవితం కనిపించదనే విమర్శలు ఉన్నాయి. వాటిని ఎలా చూడాలి?**


**ఏటుకూరి:** ఆ విమర్శలో కొంత నిజం ఉంది. చాలా వరకూ ఆస్థాన సాహిత్యం రాజుల చుట్టూనే తిరిగింది. రైతు, కూలీ, మహిళ, శిల్పి, సాధారణ ప్రజల జీవితం అందులో తక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే రచయితల జీవితం కూడా రాజసభలకే పరిమితమైంది. అయితే, అదే కాలంలో ప్రజల నోటి మాటగా జానపద సాహిత్యం జీవించింది. జానపద గీతాలు, కథలు, సామెతలు, బుర్రకథలు, యక్షగానాలు, ఒగ్గుకథలు వంటి ప్రక్రియల్లో ప్రజల అసలు జీవితం కనిపిస్తుంది. అందుకే ఒక దేశ సాహిత్య చరిత్రను అర్థం చేసుకోవాలంటే కేవలం గ్రంథాలు మాత్రమేకాదు, జానపద సాహిత్యాన్ని కూడా సమానంగా అధ్యయనం చేయాలి.

**ప్రశ్న:సాహిత్యంలో ఊహాశక్తి పాత్ర ఎంత ముఖ్యమైనది?**

**ఏటుకూరి:** సాహిత్యం పూర్తిగా వాస్తవం మాత్రమే అయితే అది వార్త అవుతుంది. పూర్తిగా ఊహ మాత్రమే అయితే అది కల్పితం అవుతుంది. గొప్ప సాహిత్యం ఈ రెండింటి సమన్వయం. ఊహాశక్తి లేకపోతే కవి కొత్త ప్రపంచాన్ని సృష్టించలేడు. అదే వాస్తవం లేకపోతే ఆ ప్రపంచం పాఠకుడిని తాకదు. అందుకే గొప్ప రచయితలు వాస్తవాన్ని ఊహతో అందంగా తీర్చిదిద్దుతారు.రామాయణం, మహాభారతం, షేక్స్పియర్ నాటకాలు, రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలు, ఇలా అన్నింటిలోనూ ఊహ ఉంది. కానీ ఆ ఊహ చివరకు మనిషి జీవితాన్నే ప్రతిబింబిస్తుంది.

**ప్రశ్న: నేటి యువ రచయితలు ప్రాచీన సాహిత్యాన్ని చదవాలా? లేక ఆధునిక సాహిత్యానికే పరిమితం కావాలా?**

**ఏటుకూరి:** ప్రాచీన సాహిత్యం చదవకుండా ఆధునిక సాహిత్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టం. అలాగే



ఆధునిక సాహిత్యం చదవకుండా ప్రాచీన సాహిత్యాన్ని మాత్రమే చదివితే వర్తమానం అర్థం కాదు. ఒక చెట్టుకు వేర్లు ఎంత ముఖ్యమో, కొత్త కొమ్మలు కూడా అంతే ముఖ్యమైనవి. వేర్లను కోసేస్తే చెట్టు నిలబడదు. కొత్త కొమ్మలు రాకపోతే అది ఎదగదు. సాహిత్యానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

**ప్రశ్న: ఇలాంటి సందర్భాలలో, సాహిత్యాన్ని ఎలా చూడాలంటారు?**

**ఏటుకూరి:** సాహిత్యం ఎప్పుడూ కాలంతో సంభాషిస్తుంది. కాలంతో మమేకమవుతుంది. అది నిన్నటి నుంచి ఈ రోజుకు, ఈరోజు నుంచి రేపటికి ప్రయాణించే సజీవ ప్రక్రియ. అందుకే సాహిత్యాన్ని మ్యూజియంలో పెట్టే వస్తువుగా కాకుండా, నిరంతరం పరిణామం చెందే సజీవ శక్తిగా చూడాలి.

**ప్రశ్న: సాహిత్యంలో కాల్పనికవాదం, రొమాంటిసిజం ఎలా ప్రవేశించాయి?**

**ఏటుకూరి:** పద్దెనిమిదో శతాబ్దం చివరి నుంచి యూరప్‌లో పారిశ్రామిక విప్లవం, శాస్త్రీయ ఆవిష్కరణలు, పట్టణీకరణ వేగంగా పెరిగాయి. యంత్రాలు మనిషి జీవితాన్ని మార్చేశాయి. అయితే ఆ మార్పుల్లో మనిషి ప్రకృతికి, భావోద్వేగాలకు దూరమవుతున్నాడనే భావన రచయితల్లో కలిగింది. దానికి ప్రతిస్పందనగా రొమాంటిసిజం లేదా కాల్పనికవాదం వచ్చింది. విలియం వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్, బైరన్ వంటి కవులు ప్రకృతిని, ప్రేమను, స్వేచ్ఛను, వ్యక్తి అంతర్ముఖ ప్రపంచాన్ని కవిత్వంలో ప్రతిష్ఠించారు. మన తెలుగు సాహిత్యంలోనూ భావకవిత్వం, ప్రకృతి వర్ణనలు, ప్రేమ, వ్యక్తిగత అనుభూతులు ప్రధానంగా నిలిచిన కాలం ఉంది. కాల్పనికవాదం మనిషి హృదయాన్ని అందంగా ఆవిష్కరించింది. కానీ అది సమాజంలోని కఠిన వాస్తవాల నుంచి కొంత దూరంగా వెళ్లిందనే విమర్శ కూడా ఉంది.

**ప్రశ్న: ఈ కాల్పనికవాదం సాహిత్యానికి లోపమా? లేక అవసరమైన దశా?**

**ఏటుకూరి:** అది ఖచ్చితంగా అవసరమైన దశే. మనిషి కేవలం రొట్టెతో మాత్రమే జీవించడు. అతనికి కలలు కావాలి, సంగీతం కావాలి, ప్రేమ కావాలి, ప్రకృతి కావాలి. కాల్పనికవాదం మనిషి మనసును సుసంపన్నం చేసింది. అయితే సమాజంలో ఆకలి, దోపిడీ, అసమానతలు పెరిగినప్పుడు కేవలం పూలు, చంద్రుడు, ప్రేమ గురించి మాత్రమే రాస్తే అది అసంపూర్ణ సాహిత్యంగా మారుతుంది. అందుకే తరువాతి దశలో సాహిత్యం మళ్లీ మనిషి జీవిత వాస్తవాల వైపు తిరిగింది.

**ప్రశ్న:మానవతావాద సాహిత్యం ఎలా ఆవిర్భవించింది?**

**ఏటుకూరి:** ప్రపంచ యుద్ధాలు, వలస పాలన, పేదరికం, దోపిడీ వంటి అనుభవాలు సహజంగానే 'సాహిత్యం ఎవరి కోసం?' అనే ప్రశ్నను రచయితల ముందు ఉంచాయి. అప్పటి నుంచి సాధారణ మనిషే సాహిత్యానికి కేంద్రబిందువయ్యాడు. టాల్‌స్టాయ్, దోస్తోయెవ్‌స్కీ, చార్లెస్ డికెన్స్, మాక్సిమ్ గోర్కీ వంటి రచయితలు సమాజంలోని సామాన్యుల బాధలను ప్రపంచానికి పరిచయం చేశారు. తెలుగులో గురజాడ అప్పారావు దేశమం 'మట్టికాదోయ్, దేశమం మనుషులోయ్' అంటూ, మానవతావాద సాహిత్యానికి అత్యుత్తమ నిర్వచనమిచ్చారు. అక్కడి నుంచి మనిషే సాహిత్యానికి కొలమానంగా మారాడు. శ్రీశ్రీ వంటి వారు కార్మికులకు పట్టంగట్టి, శ్రామిక వాదాన్ని బలంగా వినిపించారు.

**ప్రశ్న: సాహిత్యం ఎప్పుడు ఈ విధమైన సామాజిక వాస్తవికత వైపు మళ్లింది?**

**ఏటుకూరి:** సమాజంలో అసమానతలు పెరిగినప్పుడు సాహిత్యం కూడా వాటిని ప్రశ్నించడం ప్రారంభించింది. రైతులు, కార్మికులు, కూలీలు, నిరుద్యోగులు, శ్రమజీవుల జీవితాలు సాహిత్యంలో ప్రధానాంశాలయ్యాయి. ఈ దశలో వాస్తవిక సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం బలంగా ఎదిగాయి. తెలుగులో శ్రీశ్రీ, దాశరథి, కాళోజీ, ఆరుద్ర వంటి రచయితలు కవిత్వాన్ని ప్రజల జీవితాలకు దగ్గర చేశారు. ప్రపంచ సాహిత్యంలో పాబ్లో నెరుడా, బెర్టోల్ట్ బ్రెష్ట్ వంటి రచయితలు కూడా ఇదే దిశలో ప్రయాణించారు. సాహిత్యం వినోదం మాత్రమేగాక, సామాజిక చైతన్యానికి ఆయుధంగా కూడా మారింది.

**ప్రశ్న: వామపక్ష సాహిత్యాన్ని చాలా మంది రాజకీయ కోణంలోనే చూస్తారు. దానికి మీ సమాధానం ఏమిటి?**

**ఏటుకూరి:** వామపక్ష సాహిత్యాన్ని కేవలం రాజకీయ కోణంలో చూడడం సరైంది కాదు. దాని ప్రధాన ఆందోళన సామాజిక, ఆర్థిక అసమానత. ప్రపంచంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుంది. లక్షలాది మంది ఆకలి, నిరుద్యోగం, నిరాశ్రయత్వంతో జీవిస్తుం సాహిత్యం మౌనంగా ఉండకూడదు. కార్ల్ మార్క్స్ ఆలోచనలు ప్రపంచ సాహిత్యంపై గాఢమైన ప్రభావం చూపాయి. వర్గపోరాటం, శ్రమ విలువ, దోపిడీ వంటి అంశాలు అనేక రచనలకు ఆధారమయ్యాయి. మన దేశంలో అభ్యుదయ రచయితల ఉద్యమం కూడా ఈ భావజాలం ప్రభావంతోనే బలపడింది. నేటి ప్రపంచాన్ని చూడండి. సాంకేతికత అభివృద్ధి చెందుతోంది. కానీ, అదే సమయంలో ధనికులు మరింత ధనవంతులు, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఇలాంటి సమయంలో అసమానతలను ప్రశ్నించే సాహిత్యం అత్యంత అవసరం. వామపక్ష సాహిత్యం అం ద్వేషాన్ని ప్రచారం చేయడం కాదు; సమానత్వం, న్యాయం, మానవ గౌరవం కోసం నిలబడడం.

**ప్రశ్న: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవితం సాహిత్యంలోకి ఎలా వచ్చింది?**

**ఏటుకూరి:** ఎంతోకాలం సాహిత్యం పాలకుల గొంతుకగా ఉండేది. తర్వాత అది మధ్యతరగతి భావజాలాన్ని ప్రతిబింబించింది. కానీ సమాజంలో అత్యంత అణచివేతకు గురైన వర్గాల అనుభవాలు కనిపించలేదు. ఆ లోటును భర్తీ చేసినవే దళిత, బహుజన, ఆదివాసీ సాహిత్య ఉద్యమాలు. ఈ సాహిత్యం కేవలం బాధలను చెప్పడంతో ఆగలేదు. చరిత్రను మరో కోణంలో చదివించింది. శతాబ్దాలుగా అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన మనుషుల అనుభవాలను సాహిత్య కేంద్రంగా తీసుకొచ్చింది. దళిత సాహిత్యం వల్ల తెలుగు సాహిత్యంలో కొత్త భాష వచ్చింది, కొత్త ప్రతీకలు వచ్చాయి, కొత్త జీవితం ప్రవేశించింది.

**ప్రశ్న: కొందరు దళిత సాహిత్యం ఒక వర్గానికే పరిమితమని అంటుంటారు. మీ అభిప్రాయం?**

**ఏటుకూరి:** అది సరైన అవగాహన కాదు. దళిత సాహిత్యం ఒక వర్గం కోసం మాత్రమే కాదు. అసమానతను ప్రశ్నించే మానవతా సాహిత్యం. ఒక దళితుడి బాధను అర్థం చేసుకోవడమంటే, సమాజంలోని అన్యాయాన్ని అర్థం చేసుకోవడం. మంచి సాహిత్యానికి కులం ఉండదు. కానీ కులవ్యవస్థ వల్ల ఏర్పడిన బాధను మాత్రం అది నిర్లక్ష్యం చేయకూడదు. దళిత సాహిత్యం మన సమాజం దాచిపెట్టిన వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చింది. అదే దాని చారిత్రక ప్రాధాన్యం.

**ప్రశ్న: స్త్రీవాద సాహిత్యం గురించి మీరు ఏమంటారు?**

**ఏటుకూరి:** స్త్రీవాద సాహిత్యాన్ని కొందరు పురుష వ్యతిరేక సాహిత్యంగా అపార్థం చేసుకుంటారు. కానీ అది అసలు సిసలైన అర్థం కాదు. స్త్రీని కూడా సంపూర్ణ మనిషిగా చూడాలని, ఆమెకు సమాన హక్కులు, సమాన అవకాశాలు ఉండాలని చెప్పేదే స్త్రీవాదం. శతాబ్దాలుగా సాహిత్యంలో స్త్రీ పాత్రను ఎక్కువగా పురుష రచయితలే నిర్మించారు. స్త్రీ స్వయంగా తన అనుభవాన్ని చెప్పడం ప్రారంభించినప్పుడు కొత్త ప్రపంచం కనిపించింది. కుటుంబం, వివాహం, మాతృత్వం, ఉద్యోగం, శరీర రాజకీయాలు, స్వేచ్ఛ, వ్యక్తిత్వం వంటి అంశాలు సాహిత్యంలో కొత్త కోణాన్ని తెచ్చాయి. సమాజంలో సగం జనాభా అనుభవాలను ప్రతిబింబించే సాహిత్యం లేకుండా ఏ సాహిత్య చరిత్రా సంపూర్ణం కాదు.

**ప్రశ్న: ఇటీవల 'ఎల్‌జిబిటిక్యు' సాహిత్యం గురించి ఎక్కువగా చర్చ జరుగుతోంది. దీనిని ఎలా చూడాలి?**

**ఏటుకూరి:** సాహిత్యం అంటేనే మనిషి అనుభవాల చరిత్ర. ఆ అనుభవాల్లో లింగ వైవిధ్యం కూడా ఒక భాగం. చాలా కాలం పాటు ఎల్‌జిబిటిక్యు వ్యక్తుల జీవితాలు సాహిత్యంలో కనిపించలేదు. కనిపించినా అపహాస్యంగా లేదా ప్రతికూలంగా చూపించడం జరిగింది. ఇప్పుడు వారు తమ అనుభవాలను తామే రాస్తున్నారు. ఇది సాహిత్య విస్తరణకు సంకేతం. ఒక రచనతో ఏకీభవించవచ్చు, విభేదించవచ్చు. కానీ ఒక వర్గం ఉనికినే నిరాకరించడం సాహిత్య స్వభావం కాదు. సాహిత్యం మనిషిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలేతప్ప, తీర్పు చెప్పడానికి కాదు. అయితే ఏ సాహిత్యమైనా కళాత్మకత, సాహిత్య విలువలను కోల్పోవద్దు. కేవలం నినాదం గొప్ప సాహిత్యాన్ని సృష్టించదు. అనుభవం కళగా మారినప్పుడే అది చిరస్థాయిగా నిలుస్తుంది.

**ప్రశ్న: అంటే సాహిత్యం నిరంతరం విస్తరిస్తూ ఉంటుందా?**

**ఏటుకూరి:** అవును. ప్రారంభంలో చెప్పుకున్నట్టు సాహిత్యం నిరంతరం మారుతూ, అనంతంగా విస్తరిస్తూ ఉంటుంది. ఇదే సాహిత్య సౌందర్యం. ఒకప్పుడు దేవుళ్లు కేంద్రంగా ఉన్నారు. తర్వాత రాజులు వచ్చారు. తరువాత ప్రేమ, ప్రకృతి, ఆపై సామాన్య మనిషి, శ్రమజీవి, మహిళ, దళితుడు, ఆదివాసీ, ఇప్పుడు లింగ వైవిధ్య అనుభవాలు కూడా సాహిత్యంలోకి వచ్చాయి. ఈ మార్పుల వల్ల సాహిత్యం బలహీనపడలేదు. మరింత బలపడింది. మరింత ప్రజాస్వామ్యబద్ధమైన రూపాన్ని సంతరించుకుంది. మంచి సాహిత్యం ఎప్పుడూ కొత్త స్వరాలకు తలుపులు తెరుస్తుంది. ఎందుకంటే, సమాజం నిరంతరం మారుతుంది. మనిషి మారుతాడు. అతని ప్రశ్నలు మారుతాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయాణమే సాహిత్యం. అందుకే సాహిత్యం కాలాన్ని అనుసరించదు. కాలాన్ని ప్రశ్నిస్తుంది, కాలాన్ని ప్రభావితం చేస్తుంది. అదే దాని శాశ్వత శక్తి.

**ప్రశ్న: చివరిగా... మీ దృష్టిలో ఒక గొప్ప సాహిత్య కృతి ఎలా ఉండాలి?**


**ఏటుకూరి:** నా అభిప్రాయం ప్రకారం గొప్ప సాహిత్య కృతి మూడు లక్షణాలను కలిగి ఉండాలి. మొదటిది కళాత్మకత, రెండోది సామాజిక బాధ్యత, మూడోది శాశ్వత మానవీయ విలువలు. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకపోయినా ఆ రచన సంపూర్ణంగా నిలబడదు. చాలామంది సాహిత్యం సమాజానికి అద్దం కావాలని అంటారు. అది నిజమే. కానీ అద్దం కేవలం ఉన్నదాన్ని మాత్రమే చూపిస్తుంది. గొప్ప సాహిత్యం మాత్రం మనిషి ఎలా ఉండాలో కూడా చూపించాలి. అందుకే నేను ఎప్పుడూ చెప్పే మాట ఏమిటంటే, సాహిత్యం దర్పణమే కాదు, దివిటీ కూడా కావాలి. చీకటిలో దారి చూపని వెలుగు ఎంత పనికిరాదో, మార్పును సూచించని సాహిత్యం కూడా అంతే అసంపూర్ణం.


– బిఎల్

## చదవాల్సిన పుస్తకం

### జనం నుంచి జనంలోకి..

కవులు ఉంటారు... రచయితలు ఉంటారు.. సాహితీ విమర్శకులు ఉంటారు... రాశిలో తక్కువ అయినప్పటికీ, సాహిత్య పరిశోధకులు కూడా ఉంటారు. అందరినీ కలిపితే మాత్రం ఏటుకూరి ప్రసాద్ అవుతారు. ఆయన గురించి ప్రస్తావించడం మహాసముద్రాన్ని చిన్న పాత్రలో పట్టించే ప్రయత్నమే. జనం నుంచి వచ్చిన ఆయన, జనం పాటలే రాశారు. కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి పరితపించారు. అసలుసిసలైన కమ్యూనిస్టు కాబట్టి, ఆయన ప్రతి అక్షరంలోనూ ప్రగతిశీల భావాలు ఆవిష్కృతమవుతాయి. ప్రతి పదంలోనూ ఎర్రజెండా రెపరెపలు వినిపిస్తాయి. సాహిత్యాన్ని కాలంతో సంభాషించే వేదికగా మలచిన ఏటుకూరి రాసిన వేలాది పాటల నుంచి కొన్నింటిని ఎంపిక చేసుకొని, పుస్తకరూపంలోకి తీసుకురావడం ఒక సాహసమే. అలాంటి సాహసోపేతమైన కార్యాన్ని సాధ్యం చేసిన ఘనత నవచేతన పబ్లిషింగ్ హౌస్‌కు దక్కుతుంది. 'జనం నుంచి జనంలోకి' పేరుతో వెలువడిన పుస్తకంలో ప్రతి పాటా ఏటుకూరి భావ సౌందర్య ఆత్మను, శ్రామిక సంబంధ బాధ్యతను గుర్తుచేస్తాయి. సాహితీ ప్రపంచంలో విభిన్న పాత్రలను సమన్వయంతో నిర్వహిస్తూ, పాటలను భావోద్వేగాల ప్రపంచంగానూ, ఆలోచనల ప్రజాక్షేత్రంగానూ మలచిన వ్యక్తిగా ఏటుకూరిని తెలుగు సాహిత్యం చిరకాలం గుర్తుంచుకుంటుంది.





'ఇదిరా లోకం ఇది మనలోకం
అందరూ బతికే లోకం
మన అందరి ముందరిలోకం
తల్లో చెల్లో నలిగిపోయినా
ఎవరో భారతనారి
రెక్కలమ్మినా డొక్కలు నిండక
తనువే అమ్మితివా
చావూ తబతుకుల సంఘర్షణలో
బలి కావాలసినదేనా' అంటూ 'లోకం పోకడ'ను
వివరిస్తారు ఒక పాటలో.
చెమటే మేఘాలై చెలరేగే నింగినిండా
శ్రమజీవుల కన్న కలలు
నెలనిండ పండా..
నల్లదొరల దోపిడిపై
లేచే తెలుగు పడికిళ్లు
సోషలిజానికి తెరచును
తెలుగుల వాకిళ్లు' అని
'ఎర్రనవ్వు'తో అంటారు మరో పాటలో.
'ఎర్రజెండా' గొప్పతనాన్ని వివరిస్తూ,
'అమెరికా నడిబొడ్డులోపల
శ్రామికుల పోరాటమందున రక్తధారలో ముంచి ఎత్తగ
రాగ రంజితమైనదేదిరా' అంటూ అరుణ పతాక ఉద్భవాన్ని వివరిస్తారు. 'రేబవళ్లు కష్టపడ్డా, కూలిగించలు దక్కనీక, శ్రమను దోచే వెట్టిచాకిరి'కి ఎదురుతిరగమని ప్రబోధిస్తారు. బాధలను సమస్యలను వల్లెవేయడం కాదు.. 'మార్పుల పంటలు' కూడా పండించారు. వస్తుంది వస్తోందిరోయ్, మంచి రోజు వస్తోంది. మలంచి రోజులొచ్చే ముందొచ్చే ఎర్రెర్ర గాలి వీస్తోంది వీస్తోందిరోయ్' అంటూ ఆశావాదాన్ని వినిపిస్తారు. చెమటచుక్కలన్ని చేరి సింధువుగా మారిపోతాయని, పోరాటం సాగించి దోపిడీ దొంగల దీవులను ముంచెత్తుతాయని ఆశాజన భవిష్యత్తును వివరిస్తారు. శ్రమజీవుల రక్తంతో ఎరుపెక్కిన 'ఎర్రబాట'లో నడవాలని కోరుతారు. సరైన దారి ఏదో కూడా ఒక పాటలో వివరిస్తూ,
'నింగి తాకు చెట్లపైన
నేల వేళ్ల పోరాటం
కలిగినోళ్ల జులుంపైన
తిరుగుబాటు పోరాటం' అంటారు. వేళ్లను ఆధారంగా చేసుకొని ఎదిగే చెట్లు మిడిపోతూ, చివరికి వేళ్లనే చిన్నచూపు చూడడం అనేది శ్రమ జీవుల స్వేదంతో ఎదిగిన కార్పొరేటు దొరలతో పోల్చడం గొప్ప ప్రయోగం. 'నడిమి తరగతి' ప్రజల గురించి ఆలోచించిన అతి తక్కువ మంది కవుల్లో ఏటుకూరి ఒకరు. ఇలా చెప్పూపోతే, అనంతంగా కొనసాగుతునే ఉంటుంది. సూక్ష్మంగా చెప్పాలంటే, ఈ పుస్తకంలోని 93 పాటలు, 13 నృత్య గీతలు, 6 నృత్య నాటికలు వేటికవే ప్రత్యేకం. కార్మిక పక్షపాతుల నుంచి మధ్య తరగతి సామాన్యుల వరకూ.. రైతు నేస్తాల నుంచి వామపక్ష భావజాలాన్ని ప్రేమించవారి వరకూ.. గాయకుల నుంచి నృత్యకారుల వరకూ... ప్రతి ఒక్కరినీ 'జనంనుంచి జనంలోకి' పాటలు అలరిస్తాయి. ఆలోచింప చేస్తాయి. భవిష్యత్తును నిర్ణయించుకునే ధైర్యం నెగళ్లను వెలిగిస్తాయి. అందుకే ఇది చదవాల్సిన పుస్తకం. పాటుకోవాల్సిన పాటల సాగరం.

(ఏటుకూరి ప్రసాద్ గారికి అక్షరాంజలి)

**పుస్తకం పేరు**

**జనం నుంచి జనంలోకి..**

రచయిత : ఏటుకూరి ప్రసాద్ , వెల: రూ. 100/

ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఒక్కరోజులో అద్భుతాలు ఏవీ జరగవు

సాహిత్యం అనేది కాలం రాసిన మనిషి ఆత్మకథ. ఏ ఒక్క రచన లేదా పుస్తకం ఒక్క రోజులో విప్లవాన్ని తీసుకురాదు. మార్పును శాసించదు. కానీ ఒక ఆలోచనను నాటుతుంది. ఆ ఆలోచనే తరువాత ఉద్యమంగా, సంస్కరణగా, చట్టంగా, సామాజిక మార్పుగా రూపాంతరం చెందుతుంది. హ్యారియట్ బీచర్ స్టో రాసిన 'అంకుల్ టామ్స్ కేబిన్' అమెరికాలో బానిసత్వంపై ప్రజల దృష్టిని మలిచింది. రష్యాలో గోర్కీ రచనలు కార్మిక వర్గ చైతన్యానికి బలం చేకూర్చాయి. మన దేశంలో గురజాడ, శ్రీశ్రీ, చలం, కాళోజీ, దాశరథి వంటి రచయితల సాహిత్యం సామాజిక చర్చలకు దారితీసింది. కాబట్టి సాహిత్యం నేరుగా ప్రభుత్వాలను మార్చకపోయినా, మనుషుల మనస్సులను మార్చుతుంది. మనస్సులు మారితే సమాజం కూడా మారుతుంది. ఇకై ప్రస్తుతం ప్రపంచంలో ధనికులు మరింత ధనవంతులు, పేదలు మరింత పేదలవుతున్నారని చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో సాహిత్యం పాత్ర ఏమిటి? అనే అత్యంత కీలకమైన ప్రశ్న తలెత్తుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయి. కొద్దిమంది వద్ద అపార సంపద కేంద్రీకృతమవుతుండగా, కోట్లాది మంది ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాహిత్యం మౌనంగా ఉండకూడదు. అసమానతను ప్రశ్నించడం, శ్రమకు గౌరవం ఇవ్వడం, మనిషి గౌరవప్రదమైన జీవితం గడపాలనే ఆకాంక్షను బలపరచడం సాహిత్యం బాధ్యత. అందుకే అభ్యుదయ, వామపక్ష సాహిత్యం ఇప్పటికీ తన ప్రాసంగికతను కోల్పోలేదు. ఏ భావజాలమైనా ద్వేషాన్ని కాదు, మానవత్వాన్ని పెంపొందించాలి. ఒక సిద్ధాంతం మనిషి కంటే పెద్దదిగా మారితే అది సాహిత్యం కాదు.. ప్రచార పత్రం మాత్రమే అవుతుంది. భావజాలం ఉండాలి. కానీ, అది కళాత్మకతను దెబ్బతీయకూడదు. ఈ విషయాన్ని చాలా మంది రచయితలు మరిచిపోతారు. గొప్ప ఆలోచన ఉండడం మాత్రమే గొప్ప సాహిత్యానికి సరిపోదు. అదే విధంగా కేవలం అందమైన భాష కూడా సరిపోదు. ఈ రెండూ కలిసినప్పుడే గొప్ప రచన పుడుతుంది. ఏదిఏమైనా సాహిత్యం నిరంతరం మార్పులకు లోనవుతునే ఉంటుంది. ఉదాహరణకు, నేటి డిజిటల్ యుగంలో ప్రచండ వేగంతో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజంగా, ప్రతి కొత్త సాంకేతిక మార్పు వచ్చినప్పుడు ఇలాంటి ఆందోళనలు వ్యక్తమవుతాయి. ముద్రణా యంత్రం వచ్చినప్పుడు కూడా ఇలాగే భయపడ్డారు. రేడియో వచ్చినప్పుడు పుస్తకాలు చదవడం తగ్గిపోతుందని అనుకున్నారు. టెలివిజన్ వచ్చినప్పుడు కూడా అదే వాదన వినిపించింది. సోషల్ మీడియా ఒక సాధనం మాత్రమే. దానిని ఎలా ఉపయోగిస్తామన్నదే ముఖ్యం. ఒకవైపు పైపైన చదివే అలవాటు పెరిగిందనేది నిజం. మరోవైపు వేలాది కొత్త రచయితలకు తమ రచనలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కూడా లభించింది. ఇక్కడ, ఒక రచయిత సమాజం కోసం రాయాలా? లేక తన సంతృప్తి కోసం రాయాలా? అనే ప్రశ్న ఉద్భవించక మానదు. కానీ, నిజం చెప్పాలంటే, ఈ రెండూ పరస్పర విరుద్ధాలు కావు. నిజమైన రచయిత తన అంతరంగం నుంచి రాస్తాడు. కానీ ఆ అంతరంగం సమాజంతో విడిపోని సం బంధం కలిగి ఉంటుంది. మనిషి ఒంటరిగా జీవించడు. అందుకే వ్యక్తిగత అనుభవం కూడా చివరికి సామాజిక అనుభవంగానే మారుతుంది. గొప్ప రచయిత తన వ్యక్తిగత బాధను మానవజాతి బాధగా, తన వ్యక్తిగత ఆనందాన్ని మానవజాతి ఆనందంగా మలచగలడు.

## రచయిత చదువరి కావాలి..



రచయిత అనేవాడు ఎక్కువగా చదవాలి. ఒకే భావజాలానికి పరిమితం కాకూడదు. ప్రపంచ సాహిత్యాన్ని చదవాలి. తెలుగు సాహిత్య చరిత్రను తెలుసుకోవాలి. విభిన్న అభిప్రాయాలను వినాలి. విభేదించే వారినీ చదవాలి. జీవితాన్ని పరిశీలించాలి. పుస్తకాల నుంచి మాత్రమే గొప్ప సాహిత్యం పుట్టదు. రైతును చూడాలి. కూలీని కలవాలి. కార్మికుడితో మాట్లాడాలి. మహిళల అనుభవాలను వినాలి. పిల్లల ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి. ప్రకృతిని ఆస్వాదించాలి. సమాజాన్ని గమనించాలి. భాషను ప్రేమించాలి. సరళమైన భాష అం బలహీనమైన భాష కాదు. లోతైన భావాలను కూడా సులభంగా చెప్పగలిగిన రచయితే గొప్ప రచయిత. అంతేకాదు, రచయితకు ఓపిక అవసరం. ఒక రచనతోనే గొప్ప రచయిత కాలేం. రచన ఒక నిరంతర సాధన. ప్రతిరోజూ చదవాలి, రాయాలి, సవరించాలి. రచయితలే చాలా మంది విమర్శకులుగా మారిపోతుంటారు. వర్గాలుగా చీలిపోయి, పరస్పరం నిందించుకోవడం పెరిగిపోతున్నది. మరోవైపు సాహితీ విమర్శకుల పరిస్థితి కూడా దాదాపు ఇదే రీతిలో కొనసాగుతున్నది. విమర్శ అంటే తప్పులను వెతకడమే అన్న భాయం బలపడుతున్నది. కానీ, ఇది నిజం కాదు. విమర్శ అంటే తప్పులు వెతకడం కాదు. మంచి విమర్శ ఒక రచనలోని బలాన్ని, బలహీనతను సమతుల్యంగా విశ్లేషిస్తుంది. విమర్శ లేకపోతే సాహిత్యం ఎదగదు. అలాగే రచయిత విమర్శను శత్రుత్వంగా కాకుండా అభివృద్ధికి అవకాశంగా స్వీకరించాలి. అదే సమయంలో విమర్శకుడికి కూడా బాధ్యత ఉంది. వ్యక్తిని కాదు, రచనను విశ్లేషించాలి. సిద్ధాంతం కాదు, సాహిత్య విలువలను కూడా పరిశీలించాలి. మారుతున్న పరిస్థితులను పరిశలోకి తీసుకోవాలి. ఎందుకంటే, సమాజం నిరంతరం మారుతూ ఉంటుంది. నిన్న నిజం అనుకున్నది నేడు కాకపోవచ్చు. కొత్త ఆలోచనలు... కొత్త సిద్ధాంతాలు వెలుగులోకి రావచ్చు. వర్తమానమే నిరంతరం మారుతున్న తరుణంలో, సాహిత్యం భవిష్యత్తును ఊహించడం అసాధ్యం.కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు, వలసలు, డిజిటల్ జీవితం, లింగ వైవిధ్యం, ప్రపంచ అసమానతలు వంటివన్నీ రేపటి సాహిత్యంలో ప్రధాన అంశాలవుతాయి. మార్పు అనివార్యం. అయితే ఎంత మార్పు వచ్చినా సాహిత్యపు అసలు హృదయం మాత్రం మారదు. మనిషి నవ్వు, కన్నీరు, ప్రేమ, బాధ, న్యాయం కోసం పోరాటం వంటి అంశాలే సాహిత్యానికి శాశ్వత మూలాలు. ఈ అంశాలతో కూడినదే మంచి లేదా ఉత్తమ సాహిత్యంగా చెప్పుకోవచ్చు. కేవలం సమస్యను మాత్రమే చూపదు. ఆశను సజీవంగా ఉంచుకుతుంది. కేవలం చీకటిని వర్ణించడంతో ఆగకుండా, వెలుగువైపు నడిపిస్తుంది. మనిషిని మరింత మానవీయుడిగా, మరింత స్వేచ్ఛావంతుడిగా, మరింత సమానత్వ భావన కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తుంది. అదే సాహిత్య శాశ్వత ధర్మం. అదే రచయితకు ఉన్న అత్యున్నత సామాజిక బాధ్యత.

## ఈ వారం కవితలు

### ఎండగట్టే కాలం !



కరువు ఛాయలతో భూమి
మసకబారిపోనుంది
అరువు దొరకని దీనావస్థలో
సగటు దిగులు కొండెక్కనుంది
ఎల్‌నినో బుసలుతో
సమాజం ఉలిక్కిపడింది
పొడిబారిన నేల తల్లడిల్లుతూ
కడుపు కోతతో తరుక్కుపోయింది

ఊపిరాడని విత్తనం
సంచిలోనే అసువులుబాసింది
దున్నకమే కరువైన నాగలి
మూలకు ఒరిగిపోయింది

చెదిరిపోతున్న వాన మబ్బుల్తో
ఆకాశం ప్రశాంతమైంది
ఉపరితల ఆవర్తన వత్తిడితో
ఉష్ణోగ్రతకు పట్టు దొరికింది

చినుకు తడి లేని చేను
నీరింకిన కళ్లతో దుఃఖాన్ని
లోలోపల దిగమింగుకుంటోంది
మొక్కకు పురుడోసుకోలేని భూమి
రేయింబవళ్ళు అంగలార్చుతోంది
భూమి పగుళ్ల మధ్యలో రైతు గోడు
నలిగిపోతూ ఆవిరైపోతోంది
పంట నమ్మకం కోల్పోయి

ఆకాశం వైపు చూడ్డమే పనైంది

ఎండగట్టే కాలం వస్తుందేమోనని
మనిషి మనిషిలో దిగులు
దెయ్యమై పీడించడం మొదలైంది
కార్తి కర్పూరమై కరిగిపోతున్నాది

అదును అటకెక్కి కూర్చున్నది
తల పైకెత్తి చూసి చూసి
అలసిన బ్రతుకు సొలిసిపోయింది

**నరెద్దుల రాజారెడ్డి**
సెల్ : 9666016636

### మానవత్వమా నువ్వెక్కడ..?



పెరిగిన సాంకేతిక పరిజ్ఞానానికి
ముడి సరుకుగా పెట్టుబడి అయి
పోయిందేమో మానవత్వం...
అందమైన భవంతుల కింద
కనుమరుగైందేమో మానవత్వం...

డబ్బుతో ముడి పడి పోయే
బంధాల తాకిడి మధ్యలో
నలిగి పోయిందేమో మానవత్వం...
మనిషి కష్టం గురించి ఆలోచించే
సమయం లేక సోషల్ మీడియాలో
మానవత్వం వెతుకుతున్న ఈ తరం...
గత చరిత్రలో రాజులు, శ్రీమంతులు

కరువు కాటకాలలో పేదవారికి
తోడ్పాటును అందించి మానవత్వం
చాటుకుంటే వర్తమానంలో
ఈర్ష అసూయలతో మానవత్వం
మరిచి అధిపత్యం చెలాయిస్తున్నారు...

కార్పొరేట్ సంస్థలకు మానవత్వం
అమ్ముడుపోయిందేమో అనే
విధంగా లాభాలకై శ్రమ దోపిడీ...
మానవత్వం మరిచి రాబడికై
కార్మికులను పీడిస్తున్న కంపెనీలు...
మనీమైండ్ సెట్‌తో పిల్లల
పెంపకం చివరికి ఒంటరి అవుతూ

ఆత్మీయ పలుకరింపులకై ఆత్రుతగా
ఎదురు చూస్తున్న వృద్ధ తల్లిదండ్రులు.
మానవత్వమా నువెక్కడని
అడుగుతుంది ఓ ఆత్మీయ స్పర్శ...

**మిద్దె సురేష్**, 9701209355

## బిఆర్‌ఎస్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం: వేముల

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో రైతుల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్ర జలు ఇప్పటికే బిఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి తప్పుడు ప్రచారం మానుకోవాలని వేముల వీరేశం ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. రైతులకు సం కెళ్లు వేసి అవమానిం చారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దౌర్జన్యాలు జరిగాయని, ప్రగతి భవన్‌ను ప్రజలకు దూరం చేశారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని వేముల వీరేశం విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రాథమిక ప్రకటన

**ఫారం-VI**
(చట్టం-30/2013లోని సెక్షన్ 11(1) సబ్ రూల్-1 రూల్ 19 ప్రకారం)
యస్.డి.సి. ఫైల్ నెం. సి/73/2022-1 తేది: 06.07.2026
కలెక్టర్, ఫైల్ నెం. జి2/1500/2022 తేది: 10.07.2026
గెజిట్ నెం. జెఎన్/ఎల్ఎ/37/2026 తేది: 11.07.2026,

ఈ దిగువ నిర్దిష్ట పరచిన జనగాం జిల్లా, కొడకండ్ల మండలము, మొండ్రాయి గ్రామములో ఉన్న భూమి మొత్తం విస్తీర్ణం **ఎ. 16.15 గుంటలు** దేవాదుల ప్రాజెక్ట్‌లో (జె.సి.ఆర్.జి.ఎల్.ఐ.పి) భాగంగా 1 ఎల్ ఆఫ్ 6 ఆర్ డిస్ట్రిబ్యూటరీ ఆఫ్ చెన్నూర్ మెయిన్ కెనాల్ ఆఫ్ చెన్నూర్ ట్యాంక్ **కి. మీ 0.056 నుండి కి. మీ 2.925 వరకు** కెనాల్ నిర్మాణ నిమిత్తం ఈ దిగువన చూపిన భూమి అవసరము అయి ఉన్నందని భావించినందున భూసేకరణ పునరుద్దరణ, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్దమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 30/2013 లోని సెక్షన్ 11 (1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

అంతేకాక, పై నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను న్యాయమైన పరిహారం మరియు పారదర్శక హక్కు, పునరావాసం మరియు పునర్నిర్మాణ చట్టం, 2013 లోని అధ్యాయం-2 (సామాజిక ప్రభావ మదింపు) మరియు అధ్యాయం-3 (ఆహార భద్రతకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు) అమలులో నుండి, తెలంగాణ సవరణ చట్టం, 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ద్వారా చేర్చబడిన సెక్షన్-10ఎ ప్రకారం, జి.ఓ.ఎం.ఎస్. నెం. 63, రెవెన్యూ శాఖ, తేది: 29.07.2017 ప్రకారం మినహాయించబడినందున, ఈ భూసేకరణకు అధ్యాయం-2 మరియు అధ్యాయం-3 నిబంధనలు వర్తించవు.

ఈ భూసేకరణ కారణంగా మొత్తం (1) కుటుంబము మాత్రమే నిర్వాసితులయ్యే అవకాశం ఉన్నందున, ప్రభావిత కుటుంబాల పునరావాసం మరియు పునర్నిర్మాణం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జనగామ గారిని అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు.

అందువల్ల, దిగువ షెడ్యూల్‌లో జనగాం జిల్లా, కొడకండ్ల మండలము, మొండ్రాయి గ్రామములో సుమారు **ఎకరాలు 16.15 గుంటల** భూమిని పై ప్రజాప్రయోజనం కొరకు భూసేకరణ చేయుటకు ఈ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయబడుచున్నది.

**అనుబంధము**
**1 ఎల్ ఆఫ్ 6 ఆర్ డిస్ట్రిబ్యూటరి ఆఫ్ చెన్నూర్ మెయిన్ కెనాల్ ఆఫ్ చెన్నూర్ ట్యాంక్**
గ్రామము: మొండ్రాయి మండలం: కొడకండ్ల జిల్లా: జనగాం

| క్ర. సం. | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం మెట్ట/తరి | భూసేకరణ చేయు విస్తీర్ణము | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 20 | పట్టా | ఖుష్కి | 0.09 | మల్లబోయిన పవన్ కుమార్ తండ్రి సోమ నర్సయ్య | |
| | | మొత్తం | | 0.09 | | |
| 2 | 19 | పట్టా | ఖుష్కి | 0.09 | | |
| 3 | 19 | పట్టా | ఖుష్కి | 0.15 | కనుకు శేకర్ తండ్రి సోమయ్య | |
| 4 | 19 | పట్టా | ఖుష్కి | 0.06 | పరిపెల్లి మహేష్ తండ్రి అయిలయ్య | |
| 5 | 19 | పట్టా | ఖుష్కి | 0.07 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | |
| 6 | 19 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల బాలమల్లు తండ్రి బయ్యాలు | |
| 7 | 19 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | |
| 8 | 19 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల అంజయ్య తండ్రి మారయ్య | |
| | | మొత్తం | | 1.01 | | |
| 9 | 11 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 10 | 11 | పట్టా | ఖుష్కి | 0.03 | మిట్ట సోమయ్య తండ్రి కొండయ్య | |
| 11 | 11 | పట్టా | ఖుష్కి | 0.10 | మిట్ట సాయిలు తండ్రి అబ్బయ్య | |
| 12 | 11 | పట్టా | ఖుష్కి | 0.12 | పోతుగంటి బిక్షం తండ్రి సాయిలు | |
| | | మొత్తం | | 0.26 | | |
| 13 | 12 | పట్టా | ఖుష్కి | 0.04 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| 14 | 12 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | |
| 15 | 12 | పట్టా | ఖుష్కి | 0.05 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| 16 | 12 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | |
| 17 | 12 | పట్టా | ఖుష్కి | 0.05 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | |
| 18 | 12 | పట్టా | ఖుష్కి | 0.11 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | |
| 19 | 12 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు<br>ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు | |
| | | మొత్తం | | 0.30 | | |
| 20 | 18 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబాల అంజయ్య తండ్రి కొమురయ్య | |
| 21 | 18 | పట్టా | ఖుష్కి | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి సోమయ్య | |
| 22 | 18 | పట్టా | ఖుష్కి | 0.01 | చేలివేరు వెంకటయ్య తండ్రి అయిలయ్య | |
| | | మొత్తం | | 0.04 | | |
| 23 | 13 | పట్టా | ఖుష్కి | 0.22 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | |
| | | మొత్తం | | 0.22 | | |
| 24 | 14 | పట్టా | ఖుష్కి | 0.02 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | |
| | | మొత్తం | | 0.02 | | |
| 25 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| 26 | 446 | పట్టా | ఖుష్కి | 0.12 | | |
| 27 | 446 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 28 | 446 | పట్టా | ఖుష్కి | 0.13 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | |
| 29 | 446 | పట్టా | ఖుష్కి | 0.05 | కనుకు అంజయ్య తండ్రి చంద్రయ్య | |
| 30 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | |
| 31 | 446 | పట్టా | ఖుష్కి | 0.02 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | |
| 32 | 446 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 33 | 446 | పట్టా | ఖుష్కి | 0.03 | | |
| | | మొత్తం | | 1.01 | | |
| 34 | 445 | పట్టా | ఖుష్కి | 0.01 | అయిలబోయిన రమేష్ తండ్రి పెద్ద యాకయ్య | |
| | | మొత్తం | | 0.01 | | |
| 35 | 440 | పట్టా | ఖుష్కి | 0.01 | అయిలబోయిన రమేష్ తండ్రి పెద్ద యాకయ్య | |
| 36 | 440 | పట్టా | ఖుష్కి | 0.12 | | |
| 37 | 440 | పట్టా | ఖుష్కి | 0.01 | ఐలబోయిన అంజయ్య తండ్రి శివరాములు | |
| 38 | 440 | పట్టా | ఖుష్కి | 0.04 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | |
| 39 | 440 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 40 | 440 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| | | మొత్తం | | 0.26 | | |
| 41 | 451 | పట్టా | ఖుష్కి | 0.08 | | |
| 42 | 451 | పట్టా | ఖుష్కి | 0.10 | కొమ్ము అంజయ్య తండ్రి యాదగిరి | |
| 43 | 451 | పట్టా | ఖుష్కి | 0.10 | | |
| 44 | 451 | పట్టా | ఖుష్కి | 0.09 | | |
| | | మొత్తం | | 0.37 | | |
| 45 | 450 | పట్టా | ఖుష్కి | 0.01 | ననుబోతు మల్లయ్య తండ్రి సోమనర్సయ్య | |
| | | మొత్తం | | 0.01 | | |
| 46 | 452 | పట్టా | ఖుష్కి | 0.06 | కొమ్ము యాదగిరి తండ్రి సోమల్లు | |
| | | మొత్తం | | 0.06 | | |
| 47 | 428 | పట్టా | ఖుష్కి | 0.01 | మరగాని ఉపేందర్ తండ్రి యాకయ్య | |
| 48 | 428 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| | | మొత్తం | | 0.02 | | |
| 49 | 453 | పట్టా | ఖుష్కి | 1.06 | కోల అంజయ్య తండ్రి సోమయ్య | |
| | | మొత్తం | | 1.06 | | |
| 50 | 414 | పట్టా | ఖుష్కి | 0.07 | ననుబాల నరేష్ తండ్రి సోమ్మల్లు | |
| 51 | 414 | పట్టా | ఖుష్కి | 0.06 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | |
| 52 | 414 | పట్టా | ఖుష్కి | 0.05 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| | | మొత్తం | | 0.18 | | |
| 53 | 454 | పట్టా | ఖుష్కి | 0.04 | బొబ్బల శ్రీనివాస్ తండ్రి రాములు | |
| 54 | 454 | పట్టా | ఖుష్కి | 0.13 | బొబ్బల వెంకటేష్ తండ్రి యాదగిరి | |
| | | మొత్తం | | 0.17 | | |
| 55 | 412 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 56 | 412 | పట్టా | ఖుష్కి | 0.04 | | |
| 57 | 412 | పట్టా | ఖుష్కి | 0.11 | | |
| 58 | 412 | పట్టా | ఖుష్కి | 0.03 | | |
| | | మొత్తం | | 0.24 | | |
| 59 | 287 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 60 | 287 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| 61 | 287 | పట్టా | ఖుష్కి | 0.04 | | |
| 62 | 287 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 63 | 287 | పట్టా | ఖుష్కి | 0.02 | రోడ్డు | |
| 64 | 287 | పట్టా | ఖుష్కి | 0.10 | | |
| | | మొత్తం | | 0.25 | | |
| 65 | 288 | పట్టా | ఖుష్కి | 0.30 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న<br>వంగరి రాజశేకర్ తండ్రి రాజమౌళి | |
| | | మొత్తం | | 0.30 | | |
| 66 | 397 | పట్టా | ఖుష్కి | 0.10 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| 67 | 397 | పట్టా | ఖుష్కి | 0.01 | పెరుమాండ్ల పర్వయ్య తండ్రి అంతయ్య | |
| 68 | 397 | పట్టా | ఖుష్కి | 0.24 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | |
| 69 | 397 | పట్టా | ఖుష్కి | 0.10 | తోట సోమయ్య తండ్రి నారాయణ | |
| 70 | 397 | పట్టా | ఖుష్కి | 0.08 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | |
| 71 | 397 | పట్టా | ఖుష్కి | 0.15 | తోట నరేందర్ తండ్రి సీతారాములు | |
| 72 | 397 | పట్టా | ఖుష్కి | 0.18 | తోట కమలాకర్ తండ్రి రాములు | |
| 73 | 397 | పట్టా | ఖుష్కి | 0.03 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి రాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| | | మొత్తం | | 2.09 | | |
| 74 | 396 | పట్టా | ఖుష్కి | 0.12 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | |
| | | మొత్తం | | 0.12 | | |
| 75 | 395 | పట్టా | ఖుష్కి | 0.05 | తోట నరేందర్ తండ్రి సీతా రాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతా రాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతా రాములు | |
| 76 | 395 | పట్టా | ఖుష్కి | 0.09 | తోట నరేందర్ తండ్రి సీతారాములు | |
| 77 | 395 | పట్టా | ఖుష్కి | 0.01 | | |
| 78 | 395 | పట్టా | ఖుష్కి | 0.11 | తోట మహేందర్ తండ్రి నారాయణ | |
| | | మొత్తం | | 0.26 | | |
| 79 | 394 | పట్టా | ఖుష్కి | 0.02 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| 80 | 394 | పట్టా | ఖుష్కి | 0.05 | తోట కమలాకర్ తండ్రి సీతారాములు | |
| 81 | 394 | పట్టా | ఖుష్కి | 0.04 | తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | |
| 82 | 394 | పట్టా | ఖుష్కి | 0.15 | గోనెల్ల చక్రపాణి తండ్రి దశరథ | |
| 83 | 394 | పట్టా | ఖుష్కి | 0.01 | తోట కమలాకర్ తండ్రి సీతారాములు | |
| | | మొత్తం | | 0.27 | | |
| 84 | 400 | పట్టా | ఖుష్కి | 0.02 | | |
| | | మొత్తం | | 0.02 | | |
| 85 | 391 | పట్టా | ఖుష్కి | 0.23 | కసోజు గోవర్ధర్ తండ్రి యాదగిరి<br>కసోజు శ్రీనివాస్ తండ్రి యాదగిరి<br>కసోజు కమలాకర్ తండ్రి యాదగిరి | |
| 86 | 391 | పట్టా | ఖుష్కి | 0.01 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న | |
| 87 | 391 | పట్టా | ఖుష్కి | 0.06 | కసోజు సోమరాములు తండ్రి నాదం | |
| | | మొత్తం | | 0.30 | | |
| 88 | 390 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| 89 | 390 | పట్టా | ఖుష్కి | 0.23 | | |
| 90 | 390 | పట్టా | ఖుష్కి | 0.06 | | |
| | | మొత్తం | | 0.35 | | |
| 91 | 389 | పట్టా | ఖుష్కి | 0.13 | | |
| 92 | 389 | పట్టా | ఖుష్కి | 0.13 | బెల్లం సరిత భర్త రవీందర్ | |
| | | మొత్తం | | 0.26 | | |
| | | పూర్తి మొత్తం | | 16.15 | | |

**వృక్షములు/నిర్మాణములు**
గ్రామము: మొండ్రాయి మండలం: కొడకండ్ల జిల్లా: జనగాం

| వ. నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | ఆసక్తి కలిగియున్న వ్యక్తుల పేరు మరియు చిరునామా | వృక్షములు రకము | వృక్షములు సంఖ్య | నిర్మాణములు రకం | నిర్మాణములు కొలతలు/సంఖ్య | రిమార్కులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 20 | 0.09 | మల్లబోయిన సోమనర్సయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 2 | 19 | 0.09 | | వేప చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 3 | 19 | 0.15 | కనుకు షేకర్ తండ్రి సోమయ్య | తాటి చెట్టు | 1 | | 1 | |
| 4 | 19 | 0.06 | పరిపెల్లి మహేష్ తండ్రి అయిలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 5 | 19 | 0.07 | ననుబాల ఉప్పలయ్య తండ్రి ఎల్లయ్య | తాటి చెట్టు<br>వేప చెట్టు | 1<br>1 | | | |
| 6 | 19 | 0.02 | ననుబాల బాలమల్లు తండ్రి బయ్యాలు | తాటి చెట్టు<br>వేప చెట్టు | 3<br>1 | పైప్‌లైన్ | 1 | |
| 7 | 19 | 0.01 | ననుబాల ఉప్పలయ్య తండ్రి మల్లయ్య | తాటి చెట్టు<br>అల్లనేరేడు చెట్టు<br>జామ చెట్టు<br>టేకు చెట్టు<br>చింత చెట్టు<br>జామాయిల్ చెట్టు<br>వేప చెట్టు | 1<br>1<br>2<br>1<br>1<br>1<br>3 | పైప్‌లైన్ | 2 | |
| 8 | 11 | 0.01 | | | | పైప్‌లైన్ | 1 | |
| 9 | 11 | 0.03 | మిట్ట సోమయ్య తండ్రి కొండయ్య | తాటి చెట్లు | 7 | పైప్‌లైన్ | 1 | |
| 10 | 11 | 0.12 | పోతుగంటి బిక్షం తండ్రి సాయిలు | | | పైప్‌లైన్ | 1 | |
| 11 | 11 | 0.02 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 12 | 12 | 0.05 | ననుబాల యాకయ్య తండ్రి బాలయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 13 | 12 | 0.11 | ననుబాల నాగరాజు తండ్రి కొమురయ్య | తాటి చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 14 | 12 | 0.01 | ననుబాల నరేశ్ తండ్రి సోమ్మల్లు<br>ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | తుమ్మ చెట్టు<br>వేప చెట్టు<br>నమిలినార చెట్టు | 1<br>1<br>1 | | | |
| 15 | 18 | 0.01 | చేలివేరు వెంకటయ్య తండ్రి అయిలయ్య | వేప చెట్టు | 1 | పైప్‌లైన్ | 1 | |
| 16 | 13 | 0.22 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | వేప చెట్టు<br>సండ్ర చెట్టు | 1<br>1 | పైప్‌లైన్ | 200 మీటర్లు | |
| 17 | 14 | 0.02 | చేలివేరు పరమేష్ తండ్రి వెంకన్న<br>చేలివేరు ప్రవీణ్ కుమార్ తండ్రి వెంకన్న | వేప చెట్టు | 4 | పైప్‌లైన్ | 1 | |
| 18 | 446 | 0.13 | కొమ్ము మల్లయ్య తండ్రి బాలమల్లు | తుమ్మ చెట్టు | 1 | | | |
| 19 | 446 | 0.02 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 20 | 446 | 0.01 | | | | పైప్‌లైన్ | 1 | |
| 21 | 440 | 0.01 | అయిలబోయిన అంజయ్య తండ్రి శివరాములు | | | బోరు | 1 | |
| 22 | 440 | 0.04 | కొమ్ము ముత్తయ్య తండ్రి వీరయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 23 | 440 | 0.06 | | | | పైప్‌లైన్<br>బోరు | 1<br>1 | |
| 24 | 440 | 0.02 | | | | పైప్‌లైన్ | 1 | |
| 25 | 451 | 0.08 | | | | పైప్‌లైన్ | 1 | |
| 26 | 451 | 0.10 | కొమ్ము అంజయ్య తండ్రి యాదగిరి | | | పైప్‌లైన్<br>బోరు | 1<br>1 | |
| 27 | 451 | 0.09 | | తాటి చెట్టు | 1 | | | |
| 28 | 452 | 0.06 | కొమ్ము యాదగిరి తండ్రి కొమురయ్య | | | పైప్‌లైన్ | 1 | |
| 29 | 428 | 0.01 | | సీమ చింత చెట్టు | 1 | | | |
| 30 | 453 | 1.06 | కోల అంజయ్య తండ్రి సోమయ్య | టేకు చెట్లు<br>వేప చెట్లు<br>తుమ్మ చెట్టు | 75<br>3<br>1 | | | |
| 31 | 414 | 0.06 | ననుబాల వెంకన్న తండ్రి సోమ్మల్లు | తాటి చెట్టు | 1 | | | |
| 32 | 412 | 0.11 | | తుమ్మ చెట్టు | 1 | | | |
| 33 | 412 | 0.03 | | వేప చెట్టు | 1 | | | |
| 34 | 287 | 0.02 | | కొబ్బరి చెట్లు<br>మునగ చెట్టు | 5<br>1 | రేకుల ఇల్లు | 1 | |
| 35 | 288 | 0.30 | కసోజు నాగలక్ష్మి భర్త వెంకన్న<br>వంగరి రాజశేకర్ తండ్రి రాజమౌళి | తాటి చెట్టు | 1 | ఫెన్సింగ్ | 1 | |
| 36 | 397 | 0.10 | పెరుమాండ్ల సోమయ్య తండ్రి రామస్వామి | | | పైప్‌లైన్ | 1 | |
| 37 | 397 | 0.24 | తోట సుధాకర్ తండ్రి దామోదర్ | | | పైప్‌లైన్ | 1 | |
| 38 | 397 | 0.10 | తోట సోమయ్య తండ్రి నారాయణ | టేకు చెట్లు<br>మామిడి చెట్లు<br>తాటి చెట్టు | 30<br>15<br>1 | పైప్‌లైన్ | 1 | |
| 39 | 397 | 0.03 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | చింత చెట్లు<br>వేప చెట్లు<br>సండ్ర చెట్లు | 2<br>4<br>10 | | | |
| 40 | 395 | 0.05 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | వేప చెట్టు | 2 | | | |
| 41 | 394 | 0.02 | తోట నరేందర్ తండ్రి సీతారాములు<br>తోట కల్యాకర్ తండ్రి సీతారాములు<br>తోట కమలాకర్ తండ్రి సీతారాములు<br>తోట కరుణాకర్ తండ్రి సీతారాములు | వేప చెట్లు | 4 | | | |
| 42 | 391 | 0.23 | కసోజు గోవర్దన్ తండ్రి యాదగిరి<br>కసోజు శ్రీనివాస్ తండ్రి యాదగిరి<br>కసోజు కమలాకర్ తండ్రి యాదగిరి | వేప చెట్టు | 1 | | | |
| 43 | 390 | 0.06 | కసోజు సోమరాములు తండ్రి నాదం | తుమ్మ చెట్టు | 1 | | | |
| 44 | 390 | 0.23 | | తాటి చెట్టు | 1 | | | |
| 45 | 389 | 0.13 | బెల్లం సరిత భర్త రవీందర్ | తాటి చెట్టు | 2 | | | |

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం. 30/2013) లోని నియమాలలోని సెక్షన్ 11 (1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరిగిన భూ నష్టపరిహారం చెల్లించడానికి నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, జనగాం మరియు భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, యల్.ఎ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, జనగాం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ యల్.ఎ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలోని ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టుటకు అనుమతించనైనది.

సెక్షన్ 11(4) భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, జనగాం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి కొనుగోలు చేసిన అమ్మకం తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు. భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులకు ఏమైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్/భూ సేకరణ అధికారి యల్ ఎ. ఆర్ & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, జనగాం గార్లకు ఇట్టి ప్రకటన జారిచేసిన (60) దినముల లోపల వారి అభ్యంతరములు లిఖితపూర్వకంగా తెలియజేయవలసినది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ, యల్.ఎ.ఆర్. & ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్ | సం/- అదనపు కలెక్టర్ జనగాం | సం/- జిల్లా కలెక్టర్ జనగాం

DIPR R.O. NO. 462/LA-PP-Advt/PUB/2026-27

# యువజన ఉద్యమాలను బలోపేతం చేద్దాం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి
సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో
యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ మహాసభలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని మాజీ యువజన నాయకులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశం ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరగగా, ఈ మహాసభలను చారిత్రాత్మక విజయంగా నిర్వహించేందుకు ఆహ్వాన సంఘ సమావేశంను స్థానిక గుండ్లపల్లిలోని కెఎం గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ యువజన నాయకులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి, విస్తృత కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘ విస్తరణ, ప్రచార కార్యక్రమాలు, నిధుల సేకరణ, వసతిభోజన ఏర్పాట్లు, స్వచ్ఛంద కార్యకర్తల బాధ్యతలు, మహాసభల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణ వంటి కీలక అంశాలపై చర్చించి బాధ్యతలను కేటాయిస్తామని తెలిపారు. ప్రతి జిల్లా, మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహాసభలను ప్రజల మహాసభలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అదే విధంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఇటి నర్సింహా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం, విద్యా సమస్యలు, మాదకద్రవ్యాల వ్యాప్తి, కాంట్రాక్టీకరణ ఔట్‌సోర్సింగ్, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, మహిళల భద్రత, యువత ఉపాధి వంటి ప్రజా సమస్యలపై ఎఐవైఎఫ్ ఉద్యమాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మహాసభలు కీలక నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యువతను సంఘటితం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలను మరింత విస్తరించడమే మహాసభల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అదే విధంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శాసనసభ్యుడు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ యువజన సమస్యల పరిష్కారానికి ఎఐవైఎఫ్ వంటి అభ్యుదయ యువజన సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువతలో సామాజిక చైతన్యం, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు మహాసభలు దోహదపడాలని పేర్కొన్నారు. రాష్ట్ర 3వ మహాసభలను ఉద్య మ స్ఫూర్తికి ప్రతీకగా, యువత ఆకాంక్షలకు వేదికగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త మహాసభల విజయాన్ని తన బాధ్యతగా భావించి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పేరబోయిన మహేందర్, వెంకటేశ్వర్లు, సత్య ప్రసాద్, యుగంధర్, కొండల్, బాలకృష్ణ, సల్మాన్ బేగ్, ప్రవీణ్, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ కొల్లూరి రాజయ్య, ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, బచ్చన గోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, ఏషాల అశోక్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఉప్పల శాంతి కుమార్, పేర బోయిన బంగారి, గాదెగాని మాణిక్యం, అన్యమైన వెంకటేష్, పేరబోయిన పెంటయ్య, ఆరే పుష్ప గోపగాని రాజు, గుండు వెంకటేష్, అనంతుల నరసింహా, సంగి అరవింద్, పేర బోయిన రాజేష్‌తో పాటు యువజన, పార్టీ నాయకులు పాల్గొన్నారు.







## భూదాన్ భూములకు ప్రత్యేక డిజిటల్ రికార్డులు

33 జిల్లాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలి
తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు
ఆర్.శంకర్ నాయక్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని భూదాన్ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, గ్రామం, సర్వే నంబర్, విస్తీర్ణం, హద్దులు, ప్రస్తుత స్థితి, జియోట్యాగింగ్ తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాలను తెలంగాణ ఆన్‌లైన్ భూ రికార్డుల్లో ప్రత్యేక 'భూదాన్' కేటగిరీగా నమోదు చేస్తే అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలను సమర్థంగా అడ్డుకోవచ్చుని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం నిర్వహించిన సర్వోదయ మండలి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో భూదాన్ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అనేక భూదాన్ భూములు ఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, అక్రమ లావాదేవీలు, అసంపూర్ణ రెవె న్యూ రికార్డుల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అధికారులు, గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది భాగస్వామ్యంతో సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. సర్వేలో అక్రమాలు వెలుగులోకి వచ్చిన చోట ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి భూములను స్వాధీనపరుచుకోవాలని, భూదాన్ భూముల పరిరక్షణ కోసం రాష్ట్రస్థాయి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూదాన్ ఉద్యమానికి తెలంగాణ జన్మభూమి కావడంతో ఈ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా భూదాన్ యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి, అర్హులైన పేదలకు భూదాన్ భూములని పంపిణీ చేయాలని ఆర్.శంకర్ నాయక్ కోరారు.

**రంగారెడ్డి జిల్లా తెలంగాణ సర్వోదయ మండలి నూతన కార్యవర్గం ఎన్నిక:** తెలంగాణ సర్వోదయ మండలి రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా సాంబ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా దాసరి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా వి.బాలు నాయక్, సహాయ కార్యదర్శిగా ఎస్.కొండాలయ్య, కోశాధికారిగా పి.సూర్యం, ప్రతినిధిగా రఘు ఎన్నికయ్యారు. మండలి మహిళా విభాగం అధ్యక్షురాలుగా నాగజ్యోతి, ఉపాధ్యక్షురాలుగా ఏ.రాధా, యువజన విభాగం అధ్యక్షులు దయానంద్ కుమార్, కార్యదర్శిగా కె.శివకుమార్‌లను ఎన్నుకున్నట్లు ఆర్.శంకర్ నాయక్ ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. గిరిప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.యాదమ్మ, ఉపాధ్యక్షురాలు విజయ, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నీళ్లు ఇవ్వాలి

కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎంకు తమ రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తామని, కానీ రైతులకు నీళ్లు ఇవ్వాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. రక్తదాహం తీర్చుకుని ఎండుతున్న పొలాలకు జలదాహం తీర్చాలన్నారు. ఈ మేరకు కెటిఆర్ తన ట్విట్టర్( ఎక్స్)లో పోస్ట్ చేశారు. పేగులు తెగే వరకు రాష్ట్రం కోసం పోరాడిన వాళ్లమని, రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తామనడం కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే తమ నెత్తురును ధారపోస్తామన్నారు. నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా అని చెబుతావా రక్తపిశాచి? అని కెటిఆర్ పేర్కొన్నారు. ఇంకా రక్తదాహం తీరలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలన్నారు. 1952లో ఏడుగురు యువకులను కాల్చి చంపారని,1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు 'మీరు' అని అన్నారు.

## పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తకపోతే
# విద్యుత్ ఉత్పత్తి నిలిచి రాష్ట్రం అంధకారం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం పంతాలకు పోయి పంప్‌హౌజ్‌ల నుంచి నీటిని ఎత్తకపోతే విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయి రాష్ట్రం అంధకారమవుతుందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుతం నదిలో లక్ష క్యూసెక్కుల వరద ప్రవహిస్తుందని, కన్నెపల్లి మోటార్లు 93.5 మీటర్ల ఎత్తులో నడు స్తాయని , నీటిమట్టం 97.5 మీటర్ల ఎత్తులో ఉన్నదని, గేట్లు మూయాల్సిన అవసరమే లేదన్నారు. ముఖ్యమంత్రి మాటలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని, ఆయనది సైకోమనస్తత్వమని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎ.జీవన్‌రెడ్డి,సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎంఎల్‌ఎ కాలేరు వెంకటేశ్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తక్షణమే కన్నెపల్లి, దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో ఆన్‌చేసి రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడాలని, ఈ క్రెడిట్ మొత్తం సిఎం తీసుకోవచ్చని సూచించారు. రిటైర్డ్ ఇంజనీర్లు నీళ్లు ఎత్తాలని ప్రభుత్వానికి సూచిస్తే, వారిని జైలులో పెడుతామని సిఎం బెదిరిస్తున్నారన్నారు. ఏనాడు కూడా రిటైర్డ్ ఇంజనీర్లు మేడిగడ్డ ఫీజబుల్ కాదని చెప్పలేదన్నారు. నీటిపారుదల శాఖకు చెందిన అధికారులు కూడా కేవలం రూ. 8.5 కోట్ల ఖర్చుతో ఒక కాఫర్ డ్యామ్ నిర్మించి, ఆ నీటిని ఎల్లంపల్లికి తీసుకువెళ్లొచ్చని ప్రభుత్వానికి లేఖ రాసినట్టు హరీశ్‌రావు వివరించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 ఏళ్ల క్రితమే కాంగ్రెస్ కట్టిందనేది పచ్చి అబద్ధమన్నారు. 2004లో ఆ ప్రాజెక్టు శంకుస్థాపన శిలాఫలకంపైన మంత్రిగా తన పేరు కూడా ఉన్నదన్నారు. 2016 సంవత్సరం తర్వాతనే ఆ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో 20 టిఎంసి వినియోగంలోకి వచ్చిందన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీళ్లు ఆపితే భద్రాచలం మునిగిపోతుందనడం శుద్ధ అబద్ధమన్నారు. అన్నారంలో 5 టిఎంసిలు, సుందిళ్లలో 3.8 టిఎంసిలు మొత్తం 8.8 టిఎంసిలు నిలిపితే, ఒకవేళ రెండు బ్యారేజీలకు ఒకే సారి ఇబ్బంది వచ్చినా కిందకు వెళ్లేది కేవలం 1.10 లక్షల క్యూసెక్కుల నీరు మాత్రమేనని, ఈ నీటితో భద్రచలంకు ఎటువంటి ప్రమాదం ఉండబోదన్నారు. దేవాదుల లో పది మోటర్లు ఉంటే కేవలం నాలుగు మాత్రమే ఎందుకు ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు. ఎక్స్‌పర్ట్స్‌ను, ఆర్మీ ఇంజనీర్లను తీసుకొచ్చామని గొప్పలు చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డికి ఏ సీజన్‌లో పనులు చేయాలో కూడా తెలియదన్నారు. రాష్ట్రంలో కరువు చాయలు అలుముకుంటున్నాయన్నారు. ఎండిన ప్రతి పంటకు, రాలిన రైతు కన్నీరు చుక్కకు, ఆగిన ప్రతి గుండెకు, ప్రజల కష్టాలకు సిఎంను తెలంగాణ స మాజం దోషిగా నిలబెడుతుందని హెచ్చరించారు. హింసను ప్రేరేపించే విధంగా సిఎం మాట్లాడారని, హిట్లర్ తరహా హం తక భాష మాట్లాడుతున్న సిఎంకు హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందన్నారు.విషయంలేనివారు, ఫ్రస్టేషన్‌లో ఉన్నవారే ఇలా మాట్లాడుతారని, జారుడు బండ నుంచి జారుతున్నారన్నారు. నీటమైన వ్యాఖ్యలు చేసిన సిఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈటల రాజేందర్‌ను తాను కలువక నెలలు, సంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఈటల మంత్రిగా పని చేశారని, ఆ యనకు ఉన్న అవగాహనతో మాట్లాడారని హరీశ్‌రావు అ న్నారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి సూచనలు చేసిన రిటైర్డ్ ఇంజనీర్లను జైలులో పెడుతామని సిఎం బెదిరిస్తున్నారన్నారు. ఇది వరకు 290 టిఎంసిల వరద వచ్చినా భద్రాచలంకు ఏం కాలేదన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మళ్లీ ప్రారంభించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పవర్ బిల్లులు దండగా అనడం కొందరు దేశద్రోహులు, మరి కొందరు మూర్ఖపు అధికారులు చెబుతున్న మాట అని అన్నారు. శాసనసభ సమావేశాల్లో తమను చూసే ప్రభుత్వం పారిపోతుందని, ఇక కెసిఆర్ వస్తే తట్టుకుంటారా? అని ప్రశ్నించారు.

## కాళేశ్వరం అంశంపై..
# హరీశ్‌రావుది తప్పుడు ప్రచారం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వరుసగా అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టమైన వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ, బిఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్ర యత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్న తర్వాత రాష్ట్ర రైతులకు క్షమాపణ చెప్పడానికి బదులుగా బిఆర్‌ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలు చే యడం బాధాకరమన్నారు. చదువుకున్నది పాలిటెక్నిక్ అయినప్పటికీ పెద్ద ఇంజనీర్‌లా హరీశ్‌రావు మాట్లాడుతున్నారని ఎద్దేవా చే శారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2004 జూలై 28న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, 2004–2009 మధ్య బ్యారేజ్‌తో పాటు ప్రధాన కాలువల నిర్మాణం పూర్తయిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ఎల్లంపల్లి నిర్మాణాన్ని కూడా తమ ఘనతగా చెప్పుకునేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించాలంటే ముందుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటి నిల్వ ఉండాల్సిందేనని ఆది శ్రీనివాస్ తెలిపారు. బిఆర్‌ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయ త్నం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం నిలిపివేయాలని హరీశ్‌రావుకు సూచించారు.

## రిటైర్డ్ ఇంజినీర్ల వ్యాఖ్యల వెనుక హరీష్ ప్రోత్సాహం

టిపిసిసి జనరల్ సెక్రటరీ
చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ అంశాలపై కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చేస్తున్న వ్యాఖ్యల వెనుక హరీష్ రా వు ప్రోత్సాహం ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కాళేశ్వరం అంశంపై గత 30 నెలలుగా మౌనంగా ఉన్న రిటైర్డ్ ఇంజినీర్లు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రా వు కసబ్ లాంటి వ్యక్తి అని ఆరోపించారు. బావబామ్మర్దులు కెటిఆర్, హరీష్‌రావు ఇద్దరు కలిసి బట్టలు లేకుండా జపం చేసిన బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో మళ్లీ అధికారంలోకి రాలేదని అన్నారు. పదవి, డబ్బు కోసం ఏదైనా చేసే వ్యక్తిగా హరీష్ రావు వ్యవహరించారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న సమయంలో తన, మన అనే తేడా లే కుండా వ్యవహరించారని, మానవత్వం లే కుండా పాలన సాగించారని వి మర్శించారు.

హరీష్ రావు వ్యాఖ్యలు అబద్ధాలు, నిరాధార ఆరోపణలతో నిండి ఉన్నాయని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అ న్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీయడంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఎం త బాధ్యులో హరీష్ రావు కూడా అంతే బాధ్యులని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు చేసే హరీష్ రావుకు సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు. ఇకనైనా హరీష్ రావు చిల్లర వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలకు స్వస్తి చెప్పి నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని మెట్టు సాయికుమార్ సూచించారు



## వేగంగా ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 29, 35, 36, 42 వార్డులో సర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి రోజు కనీసం 2,500 ఫారాల లక్ష్యంతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్లు సకాలంలో ఫారాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బిఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఫారం నింపాలని చెప్పారు. ఓటర్ల సంతకాలను చెక్ చేసుకోవాలని, మ్యాపింగ్ కరెక్ట్‌గా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహశీల్దార్ సాయి గౌడ్ పాల్గొన్నారు.

## కరాటేలో గిన్నిస్ రికార్డు అభినందనీయం

ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేటకు చెందిన కరాటే విద్యార్థులు, మాస్టర్లు పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఇటీవల గచ్చిబౌలిలో విజన్ మార్షల్ ఆర్ట్స్, జెఆర్ అకాడమీ ఆధ్వర్యంలో 10 రాష్ట్రాల నుంచి 1500 మంది కరాటే మాస్టర్లతో నిర్వహించిన కరాటే ప్రదర్శనలో సూర్యాపేటకు చెందిన 16 మంది ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, మాస్టర్లకు పంపించిన సర్టిఫికెట్స్, బెల్టులను ఆదివారం స్థానిక బేబిమూన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని అందజేసి మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినీలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరాటే మాస్టర్ చిన్న తమ విద్యార్థులను ప్రపంచస్థాయి వేదికలకు పరిచయం చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, చిలుముల శ్రీనివాస్ రెడ్డి, ధరావత్ వీరన్న నాయక్, కరాటే మాస్టర్లు జెవి రమణ (చిన్నా), ఆర్ సంతోష, నిఖిల్, రిషి, ప్రశాంత్, వినయ్, యోగానంద్, అక్షర పాల్గొన్నారు.

## నకిరేకల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

రూ.30 లక్షలతో పద్మశాలీ కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ వీరేశం శంకుస్థాపన



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని పద్మశాలీ సంఘం సభ్యులకు ఉపయోగపడేలా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన కమ్యూనిటీ భవనం,డైనింగ్ హాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం,సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పద్మశాలి సంఘం సభ్యులు సామాజిక, సాంస్కృతిక,కుటుంబ కార్యక్రమాలను ఒకే చోట నిర్వహించుకునేందుకు ఈకమ్యూనిటీ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు,ఎం కృష్ణమూర్తి ,సందానందం, చంద్రయ్య,గోలి పద్మ,రావిరాల మల్లయ్య , కిషన్,రావిరాల యాదగిరి,బోనగిరి యాదగిరి,చిలుకూరి లక్ష్మీ నరసయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపుపై అప్రమత్తం

**ప్రజాపక్షం/నూతనకల్ :** దేశంలో సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఓట్ల తొలగింపు కుట్రపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి లక్షల మంది ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక ఓటరు నమోదు పేరుతో ఇప్పటికే బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించారన్నారు. వెంకట్‌రెడ్డి, నారాయణ, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రాములయ్య, సైదులు పాల్గొన్నారు.

## బుచ్చయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి:** నల్గొండ జిల్లా డిండి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కామ్రేడ్ తాటికొండ బుచ్చయ్య అంత్యక్రియల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి పాల్గొని ఆయన పార్థివదేహంపై సిపిఐ జెండాను కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తూం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తాటికొండ బుచ్చయ్య మరణం చాలా బాధాకరం అని నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పార్టీ ప్రతి కార్యక్రమంలో పాల్గొనే వారని ఆయన మరణం పార్టీకి తీవ్ర నష్టం అని అన్నారు. నివాళులర్పించిన వారిలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు శైలేష్, విజేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, లచ్చయ్య, గ్రామశాఖ కార్యదర్శి జంగయ్య, శ్రీను, జాన్సీరాం, శ్రీను, పెద్దజంగయ్య, శ్రీను ఉన్నారు.

# రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

భువనగిరి, చిట్యాల నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేటలో స్టేజ్1, ప్యాకేజ్2/7లో భాగంగా రూ.339.59 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 109.3 కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భువనగిరి నుండి చిట్యాల వరకు రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి,చిట్యాల నాలుగు లేన్ల రహదారి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని, రహదారి పూర్తయితే జిల్లాలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దశాబ్దాలుగా ఈ రహదారి విస్తరణ కోసం ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా ప్రభుత్వం ఆ కోరికను నెరవేరుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, రహదారి భద్రత మెరుగుపడి, రవాణా సౌకర్యాలు విస్తరించి, ప్రాంతీయ వాణిజ్యం, వ్యవసాయం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు లభించనుంది. అలాగే వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదవ్వాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు తప్పకుండా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని 18, 36, 37 వార్డుల్లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేరు మార్పులు, చిరునామా మార్పులు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలను పరిశీలించారు. బూత్‌ల వద్ద ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కార్యక్రమం పారదర్శకంగా కొనసాగాలని, అర్హత కలిగిన ఓటరు ఎవరూ జాబితాకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంచి ప్రతి కుటుంబాన్ని సంప్రదిస్తూ ఓటరు వివరాల సవరణ చేపట్టాలని బూత్ స్థాయి సిబ్బందికి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైందని, ఓటరు జాబితా ఖచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు బలమని పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెలగని వీధి దీపాలు

నిద్రమత్తులో పాలకులు



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ వెనుకాల ఉన్న కాలనీలో వెలగని వీధి దీపాల సమస్యతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వల్ల దొంగతనాలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని సామాజిక కార్యకర్త మేళ్లచెరువు సికిందర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో సమస్య జఠిలమై వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు భయంతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ కాలనీ మహాసిమెంట్ పరిశ్రమకు పోవడానికి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుందని, దీంతో చిన్న పిల్లలు ఆయన వృద్ధులు, ఆయన రాత్రి వేళాల్లో బయటకు వస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉటుందని స్థానికులు అంటున్నారు. అందులోనూ ఆ వీధి చుట్టుపక్కల పొలాలు ఉండటం వల్ల రాత్రి వేళల్లో చల్లని గాలికి పాములు, తేళ్లు బయటకు వచ్చి ప్రజల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే అక్కడ ప్రజలు జంకుతున్నారు. గత కొద్ది రోజులుగాఈ సమస్య నెలకొని ఉన్నా అధికారులు, పాలకుల దృష్టికి తీసుకపోయినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వేయటంలో చూపించే శ్రద్ధ పాలనలోనూ, ప్రజల సమస్యలపైన పాలకుఉల కొంత పెడితే బాగుంటుందని అనుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

## యజమానులు ఐకమత్యంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట హోటల్ యజమానులు ఐక్యమత్యంతో పనిచేస్తూ అసోసియేషన్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలంగా ఉన్నప్పుడే హోటల్ యజమానుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని కోరారు. పట్టణ హోటల్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా పానుగంటి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చీర్యాల నరేష్, కోశాధికారిగా వనం మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా రమేష్ శెట్టి, లతీఫ్, ప్రచార కార్యదర్శులుగా రాము, దయాకర్, గిరి, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షులు జానకిరాములు అధ్యక్షతన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రామమూర్తి, కమిటి సభ్యులుగా సాంబయ్య, ప్రవీణ్, బాబా, పవన్, సుధా కిషోర్, వెంకటేశ్వర్లు, సాయి, లక్ష్మణ్, లింగం, రాఘవశెట్టి, సైదులు, హరిప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం పట్టణంలోని 16వ వార్డులో కౌన్సిలర్ షేక్ జహీర్ ఆధ్వర్యంలో ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. సమాజ సేవ దృక్పదంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్, ఆసుపత్రి నిర్వాహకులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు షేక్ జహీర్, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాయకులు ధరావత్ వీరన్న నాయక్, ఎలిమినేటి అభినయ్ నాయుడు, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, జావేద్ బేగ్, అరుణ్ కుమార్, వెన్న మధుకర్ రెడ్డి, నాగు నాయక్, అనిల్ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/తిరుమలగిరిసాగర్** : మండలానికి నూతనంగా మంజూరు అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణాని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులలోని కోటి 43 లక్షల అంచనా వ్యయం తో ఈ పిఎస్ సి భవనం నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. మండలానికి అవసరమైన పూర్తి వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే సబ్ మార్కెట్ యార్డ్‌లోని నాలుగు ఎకరాల భూమిలో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పి వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి.మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్,హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ పాల్గొన్నారు.

## పల్లా వెంకట్‌రెడ్డిని కలిసిన సిపిఐ పల్లెపహాడ్ బృందం



**ప్రజాపక్షం/ నార్కట్‌పల్లి :** ఇటీవల జరిగిన చేనేత సహకార ఎన్నికలలో మునిపంపుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వనం వాసుదేవులు ఆదివారం నార్కట్‌పల్లిలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి కలిశారు. సిపిఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, సిపిఐ నార్కట్ పల్లి మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య, సిపిఐ చిట్యాల మండల కార్యదర్శి అక్బర్, ఏఐకేఎస్ మండల అధ్యక్షులు వెంపటి శ్రీనివాస్, పల్లెపహాడ్ గ్రామ సర్పంచి సంగిశెట్టి రాణమ్మ శ్రీనివాసులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వనం వాసుదేవులును పల్లా వెంకట్ రెడ్డి ప్రోత్సహించారు. అదే విధంగా ప్రతినిధి బృందం పల్లా వెంకట్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు నారాయణరావు వర్ధంతి సభ



**ప్రజాపక్షం/చింతపల్లి** : దేవరకొండ తాలుకా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, మాజీ శాసనసభ్యులు ఉజ్జిని నారాయణరావు పదవ వర్ధంతి సభ నేడు మండల కేంద్రంలోని సాయిసుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు తెలిపారు. నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితులై కమ్యూనిస్టు పార్టీలో చేరి చివరి వరకు కొనసాగిన మహనీయులు ఉజ్జిని నారాయణరావు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైన ఉన్నది. నారాయణరావు ఉద్యమ చరిత్రను స్మరిస్తూ నేడు ఉదయం 10 గంటలకు సొంత గ్రామం ఘడియగౌరారం గ్రామంలో నారాయణరావు స్థూపం వద్ద సిపిఐ శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. తదనంతరం మండల కేంద్రంలోని సాయిసుమంగళి ఫంక్షన్ హాల్‌లో వర్ధంతి సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నారు. ఈ వర్ధంతి సభ సందర్భంగా మండల కేంద్రంలో సిపిఐ శ్రేణులు ఎర్రని జెండాలతో అలంకరణ చేశారు. సిపిఐ శ్రేణులు, అభిమానులు సకాలంలో హాజరై ఈ సభను జయప్రదం చేయాలని యాదగిరిరావు కోరారు.



## సమర్థవంతంగా 'సర్' ప్రక్రియ

హుజూర్‌నగర్ ఆర్‌డిఓ శ్రీనివాసులు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నేరేడుచర్ల మున్సిపాలిటిలోని రామాపురం 34, 35 పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ దరఖాస్తుల స్వీకరణ అంశాలను తహసిల్దార్ సైదులుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రీయను బిఎల్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటు నమోదు ప్రక్రీయ మార్పులు చేర్పులు తొలగింపులు ప్రక్రీయను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రీయను వేగవంతంచేసి, నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసిల్దార్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, అధికారులు, ప్రజాప్రతినిధులు, బిల్‌వోలు పాల్గొన్నారు.

## ఉచిత ఎముకల వైద్య శిబిరం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** బోధిధర్మ యోగా అండ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఆదివారం బోధిధర్మ యోగ అండ్ అసోసియేషన్ అధ్యక్షులు సీత భాస్కర్, సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్మెస్ విశ్వనాథ్ రాజేశ్వరి నర్సింగ్ హోమ్ సౌజన్యంతో నిర్వహించిన ఈశిబిరంలో 200 మంది పట్టణ, మండల ప్రజలకు ఉచిత పరీక్ష నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఫిజియోథెరపీ డాక్టర్. ప్రదీప్ ఫిజియోథెరపీకి సంబంధించిన సూచనలు చేశారు. ఉపాధ్యక్షులు కడవేరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ, సహాయ కార్యదర్శులు దోర్నాల బాలరత్నం, రణం రాజశేకర్, కోశాధికారి కొండమడుగు మల్లేష్, సంస్కృతిక కార్యదర్శి వనం వెంకటేష్, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజు, బావండ్ల రాజు, వీడెం విష్ణు, గౌరవ సలహాదారులు ఈపూరి ముత్యాలు, కర్నాటి బాలరాజు పాల్గొన్నారు.



## లోపాలు ఉండొద్దు

**ప్రజాపక్షం / తిప్పర్తి:** తిప్పర్తి మండలంలోని గోదారిగూడెం, ఆరేగూడెం గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లలో నల్లగొండ ఆర్‌డిఓ అశోక్ రెడ్డి ఆదివారం ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని, అర్హత గల ప్రతి ఓటరుకు అవకాశం కల్పించాలని అధికారులను సూచించారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ రాజకొండ రామకృష్ణ, ఆర్.ఐ ప్రసాద్ రెడ్డి, బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయలు, టమాటాల పంపిణీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని స్థానిక హౌసింగ్ బోర్డులో సుమన్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతి వారం శిక్షణ పొందుతున్న కరాటే విద్యార్థిని విద్యార్థులకు వారి ప్రతిభను బట్టి బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వారం ప్రత్యేకంగా కరాటే నేర్చుకుంటున్న 80 మంది విద్యార్థిని విద్యార్థులకు కూరగాయలు, టమాటాలను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి హాజరై కరాటే విద్యార్థులకు కూరగాయలను అందజేశారు. కరాటే అకాడమీ జాతీయ అధ్యక్షులు బూడిద సైదులు, నాలుగో వార్డు కౌన్సిలర్ పుట్టపాక శీను, బీఎస్ఎన్ఎల్ శీను, ఆర్గనైజర్ చీఫ్ జాతీయ జనరల్ సెక్రటరీ సీనియర్ కరాటే మాస్టర్ బందవత్ రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



## యంగ్ ఇండియా ప్రవేశ పరీక్ష ప్రశాంతం



ప్రజాపక్షం/ వెల్దండ : యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఎక్సలెన్స్(వైఐఐఈ) 6వ తరగతి కోసం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం మండల కేంద్రంలోని కస్తూరాబాగాంధీ పాఠశాలలో ప్రశాంతంగా జరిగిందని మండల విద్యాధికారి చంద్రుడు తెలిపారు. జిల్లాలోని 17 కస్తూరాబా గాంధీ పాఠశాల నుంచి 99 మంది విద్యార్థినిలను కేటాయించగా అందులో 81మంది విద్యార్థినిలు హాజరయ్యారు.ప్రవేశ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థినిలకు హాస్టల్‌లో వసతితో పాటు నాణ్యమైన విద్యను అందించేలా అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రత్యేకాధికారి స్రవంతి తెలిపారు.ఈ పరీక్షను చీఫ్ సూపరింటెండెంట్ బాలీశ్వరయ్య, డిపార్ట్ మెంటల్ అధికారి శ్రవణ్‌కుమార్, పరిశీలకులు మండల విధ్యాధికారి చంద్రుడుల ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ పట్టివేత



ప్రజాపక్షం/కల్వకుర్తి: ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామ దుందుభి నది నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట గ్రామం రామగిరి వద్ద పట్టుకోని పోలీస్ స్టేషన్ తరలించి టిప్పర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు చేయడం జరిగిందని ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## 28న గ్రామ దేవత గజాలమ్మ అవ్వ జాతర




ప్రజాపక్షం/ధన్వాడ: ఆదివారం ధన్వాడ మండలంలో గ్రామ దేవత గజాలమ్మ అవ్వ ఆలయం దగ్గర అఖిలపక్ష నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు ప్రతినిధులు సమావేశంలో నాయకులు పాల్గొన్నారు. గ్రామ దేవత గజాలమ్మ అవ్వ జాతర 28 తేదీన బోనాలతో పూజలు చేయాలని నిర్వహించారు. పంట పొలాలు కి వర్షాలు పడి పంటలు బాగా పండాలని గ్రామ దేవత గజాలమ్మ అవ్వని జాతర రూపంలో దైవ భక్తితో నిర్వహించేందుకు ఏర్పాట్లకు సమావేశంలో గ్రామ పెద్దలు చర్చించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంగా చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

## చేనేత డైరెక్టర్లకు సన్మానం



ప్రజాపక్షం/గట్టు: మండలం లోని మాచర్ల గ్రామంలో ఈనెల 10వ తేదీన జరిగిన చేనేత సహకార సంఘం పాలక వర్గ ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లకు ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు సంఘం కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లను శాలువాలతో, పూల దండలతో సన్మానించారు. డైరెక్టర్లను ఆయన అభినందిస్తూ, సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామికి పూజలు



ప్రజాపక్షం/నల్లకుంట: పాదయాత్రలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తిరుమలనగర్‌లోని కాలభైరవ స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు యువ ప్రవీణ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వేదవ్యాస్ చిన్ని, ఉపాధ్యక్షుడు బి. దీపక్ కుమార్,హై కోర్ట్ న్యాయవాది అనిత లక్ష్మి కేంద్రమంత్రికి ఆలయ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జైహింద్ ప్రవీణ్, బాబు, ప్రశాంత్ దుబే, పప్పీ, ఎక్కాల కన్నా పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో సేవాసమితి ఎన్నికలు



ప్రజాపక్షం/అంబర్‌పేట్: మహంకాళి బోనాల జాతరను ఘనంగా నిర్వహించాలని అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి సర్వసభ్య సమావేశం తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం గౌడ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో పెద్ద సంఖ్యలో దేవస్థాన సేవా సమితి సభ్యులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దేవస్థాన సేవాసమితికి సంబంధించిన వివరాలను కమిటీ సభ్యులు వెల్లడించారు. దేవస్థాన సేవాసమితి కార్యవర్గానికి రానున్న డిసెంబర్ నెలలో ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, కె.దుర్గప్రసాద్ రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్ గౌడ్, పంజాల గిరిధర్‌గౌడ్, రంగంపల్లి రాజు, బిందె మల్లికార్జున్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చెంగలి సుధాకర్, దొమకొండ కిషోర్, మోర పాండు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ రోడ్లకు మహర్దశ



**రూ.320 కోట్లతో హ్యామ్ రోడ్లు**

**నేడు మక్తల్‌కు మంత్రులు కోమటిరెడ్డి, దామోదర, జూపల్లి కృష్ణారావు**

**పైలాన్‌ను ఆవిష్కరించనున్న మంత్రులు**

ప్రజాపక్షం/మక్తల్: హ్యామ్ రోడ్లతో మక్తల్ రోడ్లకు మహర్దశ పట్టనుందని రూ.320 కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్‌లో హ్యామ్ రోడ్ల శంకుస్థాపనకు మంత్రుల రాక సందర్భంగా ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం మక్తల్‌కు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు రానున్నారని ఆయన తెలిపారు. పైలాన్‌ను ఆవిష్కరించి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రూ.320 కోట్లతో మక్తల్ నియోజకవర్గంలో హ్యామ్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్క మక్తల్–నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డుకే రూ.237 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదే విధంగా మరికల్ –మినాస్‌పూర్ లింగంపల్లి రోడ్డుకు రూ.49.57 కోట్లు, ఆత్మకూరు–మరికల్ రోడ్డుకు రూ.22.47కోట్లు, మాగనూరు మండలం నల్లగట్టు–హిందూపూర్ రోడ్డుకు రూ.10.49 కోట్లతో రోడ్లు వేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ పనులన్నీ కేవలం ఏడాది లోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హ్యామ్ రోడ్లకు సంబంధించి సోమవారం మంత్రులు పైలాన్‌ను ఆవిష్కరిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. అనంతరం ఐలిన్ స్కూల్ వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, బోయ రవికుమార్, కావాలి శ్రీహరి, వాకిటి హన్మంతు, శ్రీనివాస్ గౌడ్, శివరాంరెడ్డి, ఆనంద్ గౌడ్, విజయ్ గౌడ్, గోవర్ధన్, కావాలి తాయప్ప, శివరాజ్, గుర్లపల్లి భీమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం



ప్రజాపక్షం/అయిజ: ఏఐసీసీ కార్యదర్శి ఛత్తీస్‌గఢ్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే డా.ఎస్.ఎ.సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అయిజ మున్సిపాలిటీలో 1వ వార్డులో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తెలుగు శారద జమ్మన్న ఆహ్వానం మేరకు నిర్వహించిన నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి, ఆచారి, సింగిల్ విండో ఛైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి, 1వ వార్డు ఇంచార్జి తెలుగు తాయప్ప, కలిసి గృహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.మద్దిలేటి, మైనర్ బాబు, రాధ చిన్ని, కృష్ణ, యుగేందర్, 6వ వార్డు ఇంచార్జి తుప్పత్రాల కురువ లింగన్న, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాల మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి బసవరాజు, డాన్ వీరన్న, రఘు గౌడ్, పానంపల్లి రాముడు , తెలుగు ఈరన్న, రైటర్ కొండ, కురువ బీచుపల్లి, తెలుగు రామకృష్ణ, రిపోర్టర్ శ్రీకాంత్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల పర్యటన దృష్ట్యా పటిష్ట బందోబస్తు

**డిఎస్‌పి నల్లపు లింగయ్య**



ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట్ జిల్లా మక్తల్ మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డిఎస్‌పి నల్లపు లింగయ్య తెలిపారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మక్తల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు చేయనున్న సందర్భంగా బహిరంగా సభలో ఉన్న నేపథ్యంలో సూమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తిప్రస్పల్లి నుండి మక్తల్ వరకు, అలాగే కచ్వర్ నుండి మక్తల్ వరకు బైక్ ర్యాలీ సందర్భంగా ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో హైలాండ్ స్కూల్ సమీపంలో బహిరంగా సభ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. బందోబసు పర్యవేక్షణలో డిఎస్‌పి నల్లపు లింగయ్యతో పాటు మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

**మంత్రి వాకిటి శ్రీహరికి తపస్ వినతి**



ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో 250 మంది విద్యా వాలంటీర్లను నియమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మంత్రి డా.వాకిటి శ్రీహరిని కోరారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తపస్ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. విధుల సర్దుబాటులో భాగంగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పీటీలను ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా వాలంటీర్ల నియామక అంశంపై ముఖ్య మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శేర్ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ, జిల్లా కార్యదర్శి బి.రవీందర్, మక్తల్ మండల అధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి రాకేష్ కుమార్, జిల్లా నాయకులు వి.భీమ్ రెడ్డి, నాగార్జున, వెంకట్రాములు, రాము, రాజాంజనేయులు, ప్రవర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, రవీందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పట్టింపేదీ...?

**రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



ప్రజాపక్షం/ వెల్దండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి పాలనలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్రఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన నేతలతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, కల్వకుర్తి నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో 10 రోజుల నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారుల్లో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మిషన్ భగీరథలో పని చేస్తున్న ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు రావడం లేదని, జీతాలు రాకపోవడం వల్ల వారి కుటుంబాలు ఎలా జీవనం సాగిస్తారని పేర్కొన్నారు. పెండింగ్‌లో జీతాలను తక్షణమే విడుదల చేసి ఉద్యోగులకు ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అమలవుతున్న 'సర్' ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాన కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం లేక ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, బిఎల్ఒలకు తగిన శిక్షణ లేకుండానే బాధ్యతలు అప్పగించడం వల్ల క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొని ప్రజలు కార్యాలయాల చుట్టు తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీఎల్‌వోలకు సమగ్ర శిక్షణతో పాటు ప్రజలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వెల్దండ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, మాజీ ఎంపిటీసీ హన్మంతు, మాజీ సర్పంచులు శేఖర్‌నాయక్, సజ్యానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుడుముల శ్రీనివాస్‌రెడ్డి,హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాలు రాయడంలో ప్రత్యేక శ్రద్ధ: ఆర్‌డిఒ బన్సీలాల్



ప్రజాపక్షం/వీపనగండ్ల: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అందజేస్తున్న ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసే విషయంలో బూత్ లెవెల్ అధికారులు బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొల్లాపూర్ ఆర్‌డిఒ బన్సీలాల్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేస్తున్న విధానాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ, ప్రతి ఓటరుకు పత్రాలు సక్రంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అవసరమైన వివరాలు స్పష్టంగా తెలియజేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయించే బాధ్యత బీఎల్వోలదేనని పేర్కొన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమం నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతీ ఓటరును జాబితాలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఖాజా మైనుద్దీన్ పాల్గొని, ఎస్ఐఆర్ కార్యక్రమంలో అమలు తీరును ఆర్‌డిఒకు వివరించారు.

## పెబ్బేరులో 'సర్'పై అవగాహన రథం ప్రారంభం



ప్రజాపక్షం/పెబ్బేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్‌పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెబ్బేరు మున్సిపాలిటీలో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైన ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకునేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతీ ఒక్కరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, తాటికొండ కృష్ణ, పర్వీన్ షకీల్, మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రణధీర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర రామన్ గౌడు, సత్యనారాయణ, నరసింహనాయుడు, మల్లేష్ యాదవ్, వడ్డె అంజి, మాజీ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక వర్గ పోరాటాలు ఉధృతం



ప్రజాపక్షం/వంగూర్: దేశంలో పెరుగుతున్న సామాజిక అణిచివేతలపై, దోపిడీలపై, సామాజిక వర్గ పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌లో గత రెండు రోజుల నుండి జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా రాజకీయాల శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో దళితుల, బలహీన వర్గాలపై దాడులు చేస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తుందని వారు మండిపడ్డారు. పెట్టుబడుదారులకు అండగా ఉంటూ సామాన్య ప్రజలను విస్మరిస్తుందని వారు మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, మండల కార్యదర్శి బాలస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## విజయ టైప్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని సాయిప్రియ స్టేట్ టాపర్



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల మండల కేంద్రంలోని విజయ టైప్ ఇన్‌స్టిట్యూట్ కు చెందిన విద్యార్థిని కుమారి సాయి ప్రియ రాష్ట్ర స్థాయి టైప్ రైటింగ్ పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా నిలిచి సంస్థకు, మండలానికి కీర్తి తీసుకొచ్చింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని బుధవారం ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్స్ భూమిక, గోపి ఆధ్వర్యంలో సాయి ప్రియను ఘనంగా సన్మానించారు. పూలమాల, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాయి ప్రియ కృషి, పట్టుదల, క్రమశిక్షణకు ఇది నిదర్శనం. ఆమె లాగే మిగతా విద్యార్థులు కూడా కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. ఇన్‌స్టిట్యూట్ నుండి స్టేట్ టాపర్ రావడం తమకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో మరెంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ స్టాఫ్, విద్యార్థులు, సాయి ప్రియ ,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

**పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు డి.శారద**



ప్రజాపక్షం/మక్తల్: రాజస్థాన్‌లోని గంగానగర్ (శ్రీగంగానగర్) లో వెలుగు చూసిన దారుణమైన అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు డి.శారద డిమాండు చేశారు. ఆదివారం స్థానిక టియూసిఐ కార్యాలంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ గంగానగర్ ప్రాంతానికి చెందిన ఒక 13 ఏళ్ల మైనర్ బాలికల తన స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఒక ఈ రీక్షా డ్రైవర్ ఆమెను కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత ఆమెను వేర్వేరు ప్రాంతాలకు ముఖ్యంగా స్థానిక హోటళ్లకు తరలించి సుమారు 5 రోజుల పాటు నిర్బంధించారు. దాదాపు 30 మందికి పైగా మృగాళ్లు ఆమెపై వరుసగా సామూహిక అత్యాచారానికి (గ్యాంగ్ రేప్) పాల్పడడం క్రూరత్వం అన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి, రిక్షా డ్రైవర్‌తో పాటు నిందితులకు సహకరించిన హోటల్ మేనేజర్లు, యజమానులను పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ మహిళా కమిషన్ (యన్‌సిడబ్ల్యూయు) జోక్యం చేసుకోని విచారణ జరిపి తగిన శిక్ష పడేవిధంగా అక్కడి ప్రభుత్వాలని ఆదేశించాలని కోరారు. విచారణ తదుపరి మరణశిక్ష విధించాలని డిమాండు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా రాజస్థాన్ ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఇలాంటి ఘటనలు దేశంలో అనేకంగా జరుగుతున్నప్పటికీ వాటికి పూర్తి పరిష్కారం చూపడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందనే అన్నారు. సమాజంలో వస్తున్నటువంటి అనేక రుగ్మతలను అరికట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గటమలకు కారణం కారణమైన మద్యం, కొకెన్ ఇలాంటి మాదకద్రవ్యాలు, అశ్లీ వెబ్‌సైట్లు రద్దు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మాధవి, సంధ్య, పద్మమ్మ, ఉషా, మంజుల, కేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు సకాలంలో అందజేయాలి

**మాజీ జడ్పీవైస్ చైర్మన్ డా.కోడుగల్ యాదయ్య**



ప్రజాపక్షం/జడ్చర్ల: గడువులోపే ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో గడువులోపు అధికారులు సహకరించాలని మాజీ జడ్పీవైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య సూచించారు. ఆదివారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు మండలంలోని స్టేషన్ తండా గోల్లపల్లి, ఈర్లపల్లి, నల్లరాళ్లగడ్డ తండా, చౌటగడ్డతండా గ్రామాలలో ఉన్న బిఎల్‌వో లను కలవడం జరిగింది. ప్రతి గ్రామంలో ఉన్న బిఎల్‌వో లు ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి బూత్‌లెవల్ ఆఫీసర్‌కు సకాలంలో అందజేయాలని బూత్‌లెవల్ ఏజెంట్‌లకు తెలియజేసిన మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డా.కొడుగల్ యాదయ్య రఘుపతి రెడ్డి, శివలింగం, రాందాస్, శ్రీను నాయక్, శ్రీపతి గౌడ్, పురుషోత్తం, రాజేందర్‌రెడ్డి, కోటేష్, బిఎల్‌వో లకు సూచించారు.

## తెలంగాణ రక్షణ సేన జెండావిష్కరణ



ప్రజాపక్షం/లాల్‌దర్వాజా: తెలంగాణ రక్షణ సమితిని బలోపేతం చేయడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు టిఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు చార్మినార్ నియోజకవర్గంలోని హరిబౌలి, లాల్ దర్వాజా మోడ్ ఎక్స్‌రోడ్ కూడలిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ పండుగ చార్మినార్ ఇన్చార్జి రాధా కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ టిఆర్ఎస్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్‌పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు దయానంద్ ఆర్యా, అమూల్ ముదిరాజ్, చంద్ర మోహన్ చారీ, భరత్ తదితరులు రాధాకృష్ణ, ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్ సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో యాకుత్‌పురా అబ్జర్వర్ జ్యోతి కులకర్ణి, మీనా చౌహాన్, హరిబోలి డివిజన్ అధ్యక్షుడు పంకజ్ షిండే, మణికొండ విజయ్ కుమార్, పురానాపూర్ డివిజన్ అధ్యక్షుడు భాను గంగపుత్ర, వికాస్, సంతోష్, శారద పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యం

### శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నాణ్యతమైన వైద్యంతో పాటు మెరుగైన సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బి. ఎన్. రెడ్డి నగర్ డివిజన్ చైతన్య నగర్‌లో ఆరుద్ర ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీందర్‌కుమార్ నాయక్, బిజెపి నాయకులు సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, కొప్పుల నరసింహారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ ధీటుగా వైద్యం అందిచాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి చైర్మన్ జిట్టా జింతేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల మొత్తం ఎలాంటి ఫీజు లేకుండా రాయితి ఉంటదని, ల్యాబ్ టెస్ట్‌లో 30 శాతం రాయితి కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆసుపత్రి యజమాన్యం ఉపేందర్‌రెడ్డి, సునీల్, గణేష్, నవీన్‌రెడ్డి, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సహారా స్టేట్స్ అభివృద్ధిలో అండగా ఉంటా

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా స్టేట్స్ కాలనీ అభివృద్ధి సంక్షేమంలో అండగా ఉంటానని మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి అన్నారు.ఆదివారం సహారా స్టేట్స్ నూతన కార్యవర్గ సభ్యుడుమాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాస్మోపాలిటన్ కాలనీలోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం , కాలనీల అభివృద్ధే తన లక్ష్యమని,సహారా స్టేట్స్ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ప్రజల సహకారం,కాలనీ సంఘాల సమన్వయంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు.

# అపదలో ఉన్నవారికి అండగా ఎన్‌ఎన్‌అర్ ఫౌండేషన్..

**ప్రజాపక్షం/యాచారం :** అపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు నవీన్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలో కంబాలపల్లి మాధవిని అటో ఢికొట్టడంతో కాలుకు తీవ్రగాయమై అసుపత్రిలో చికిత్స పోందుతుంది. ఈవిషయం తెలుసుకున్న నవిన్‌రెడ్డి తన ఫౌండేషన్ సభ్యులను ఇంటికి పంపి కుటుంబ సభ్యులను ఓదార్చి ,10 వేల రూపాయల అర్థిక సహాయం అంద జేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎన్ అర్ టీం సభ్యులు , వార్డుమేంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి సింగరేణి భరోసా యాత్ర


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నేతృత్వంలో బిజెపి సింగరేణి భరోసా యాత్ర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావుతో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు ఈ యాత్రలో పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయం నుండి నాయకులు కొత్తగూడెంకు తిరుగుపయనం కానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కిషన్ రెడ్డి వివిధ బొగ్గు గనులను సందర్శించడంతో పాటు, కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో, పార్టీ శ్రేణుల సమావేశాల్లో పా ల్గొంటారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో సాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమంలో భాగంగా, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ,డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి (డిఇఒ), జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాంపల్లి (63), చాంద్రాయణగుట్ట (67), బహదూర్పురా (69) అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆయన విస్తృతంగా పర్యటించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీల్లో కమిషనర్ క్షేత్రస్థాయి సిబ్బంది అయిన సహాయ నియోజకవర్గ ఎన్నికల అధికారులు (ఎఇఆర్ఒలు), బిఎల్ఒ సూపర్ వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో (బిఎల్ఒలు) మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి. కేంద్ర ఎన్నికల స ంఘం (ఇసిఐ) నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం, ఎలాంటి తప్పులు లే కుండా అత్యంత ఖచ్చితత్వంతో, నాణ్యతతో నిర్ణీత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేయాలి.' అని కర్ణన్ ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎవరూ అలసత్వం వహించకూడదని, గడువులోగాలక్ష్యాలనుచేరుకోవాలనిఈ సందర్భంగా కర్ణన్ స్పష్టం చేశారు.

# జిఎస్‌టి వివాదాల పరిష్కారానికి తోడ్పడండి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండు తెలుగు రాష్ట్రాల్లో జిఎస్‌టి సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ఛార్టర్డ్ అకౌంటెంట్లు, టాక్స్ న్యాయవాదులు తోడ్పడాలని జిఎస్‌టి అప్పీలేట్ ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ న్యాయమూర్తి సుశీల్ కుమార్ శర్మ కోరారు. హైదరాబాద్ జిఎస్‌టి భవన్‌లో ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అవదేశ్ ప్రసాద్ దహిమ, కార్యదర్శి పి.వి.నారాయణ రా వు, మాజీ అధ్యక్షుడు సి.ఎ.వేముల చంద్రశేఖర్, సిఏ హితేష్ జైన్ తదితరులు జిఎస్‌టి అప్పీలేట్ ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ ఉపాధ్యక్షున్యాయమూర్తి సుశీల్ కుమార్ శర్మ, న్యాయ సభ్యుడు ఎ. పి.రవి, సాంకేతిక సభ్యుడు డాక్టర్ డి. కె.శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, అసోసియేషన్ తాజాగా ప్రచురించిన మెంబర్స్ డైరెక్టరీ–2026, వార్షిక నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా సుశీల్ కుమార్ శర్మ మాట్లాడుతూ భారత జాతి నిర్మాణాన్ని ముందుకు నడిపిస్తున్న జిఎస్‌టిలో పన్ను న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు అధీకృత ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారని, ప్రధానంగా వ్యాజ్య వ్యూహం, అప్పీల్ ముసాయిదా, కేసు ప్రాతినిధ్యాన్ని పారదర్శకంగా నిర్వహిస్తూ, చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను న్యాయవాదులు మారుతున్న చట్టాలకు అనుగుణంగా ఆర్థిక, అకౌంటింగ్ వివాదాలలో, సంక్లిష్టమైన చట్టపరమైన వాదనలలో నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు

# 'ఆరుగురి హత్య' మండిపడిన ప్రజాప్రతినిధులు



**ప్రజాపక్షం/షాబాద్:** ఆరుగురిని హత్య చేసిని కిరాతకుని వెంటనే శిక్షించాలని ప్రభుత్వ చఫీవిప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని మృతుల కుటుంబాలను చేవెళ్ల ఇన్‌చార్జ్ పామెన భీంభరత్, స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.హత్యకు పాల్పడిన హంతకుని వెంటనే రిమాండ్ చేయాలన్నారు.

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**
**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బాధితులను కలిసి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ 1 లక్ష రూపాయాలు నగదు అందజేశారు. హత్య ఘటనకు పాల్పడిన హంతకుని వెంటనే శిక్షించాలని పేర్కొన్నారు. హంతకునికి సహకారించిన పోలీస్ అధికారులపై తప్పకుండ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**బాధిత కుటుంబాలకు కోటి రూపాయాలు డిపాజిట్ చేయాలి: మాజీ హోంమంత్రి సబితాఇంద్రారెడ్డి**



బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయాలు డి పాజిట్ చేయాలని మాజీ హోం మంత్రి సబితాఇంద్రా రె డ్డి అన్నారు. ఆదివారం షాబాద్‌లోని హత్యకు గురి అ యిన బాధిత కుంటుబాలను కొండగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీజెడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డిలతో కలిసి పరామర్శించారు. అనంతరం మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు అర్థిక సహాయం అందజేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లక్ష్యం కా రాణంగా రాష్టంలో హత్యఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని పేర్కొన్నారు. ఆరు హత్య లు జరిగి రోజు గడుస్తూన్న ఇప్పటి వరకు నిందితుని పట్టుకోలేని పరిస్థితికి ప్రభు త్వం దిగజారిందని పేర్కొన్నారు. నిందితుని వెంటనే పటుకోని శిక్షించాలన్నారు.

**మృత్యుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**



మృత్యుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. దైవాలగూడలోని హత్యఘటనలో మృతి చెందిన బాధిత కుంటుబాన్ని పరామర్శించారు.హత్య ఘటనకు పాల్పడిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. 50 లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామస్వామి, ప్రభులింగం, సత్యనారాయణ, శ్రీశైలం, ఆనందం, మధు, నారాయణ, రఘురాం పాల్గొన్నారు.

# నిందితుడి కోసం 12 బృందాలు గాలింపు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లాలో ఆరుగురిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిని పట్టుకోవడానికి తెలంగాణ పోలీసులు 12 బృందాలను ఏర్పాటు చేసి విస్తృత గాలింపు చర్యలు చేపట్టారని ఒక సీనియర్ పోలీసు అధికారి ఆదివారం తెలిపారు. షాబాద్ మండలంలో ఒక మైనర్ బాలికను వేధించినందుకు తమ కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఆ బాలిక కుటుంబానికి చెందిన ముగ్గురితో పాటు తన భార్య, ఇద్దరు పిల్లలను, మొత్తం ఆరుగురిని శుక్రవారం అర్ధరాత్రి పి. రాజ్‌కుమార్ (35) హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతను గతంలో ఒక పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు.

సాంకేతిక సమాచారం, ఇతర ఆధారాలు, అతని స్నేహితులు, బంధువుల నుండి సేకరించిన వివరాల ఆధారంగా పోలీసులు నిందితుడి కోసం వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నారని 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పిటిఐకి తెలిపారు.

దర్యాప్తు అధికారులు అతని కాల్ డేటా వంటి సాంకేతిక వివరాలను విశ్లేషించారు, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. హత్యలకు



ఒక రోజు ముందు నిందితుడు అద్దెకు తీసుకున్న కారును గుర్తించారు. రాజ్‌కుమార్ తన భార్య ఫోన్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు చేసి ఒక ట్రాన్స్‌పోర్టర్ నుండి ఆ కారును అద్దెకు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఇంధనం అయిపోవడంతో, నిందితుడు నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే పట్టాల దగ్గర కారును వదిలిపెట్టాడు. హైదరాబాద్‌లోని లాడ్జీలు, రోడ్డు పక్కన ఉండే దాబాలు, రైల్వే స్టేషన్లు, బంధువుల ఇళ్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో కూడా పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారని ఆ అధికారి తెలిపారు. రాజ్‌కుమార్‌ను పట్టుకోవడానికి దోహదపడే విశ్వసనీయ సమాచారం అందించిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించారు.

# నరమేధం అత్యంత విషాదకరం

### హంతకుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి
### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా షా బాద్ మండలంలో చిన్నారులతో సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనపై సిపిఐ(ఎం) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘట న పోలీసుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంద ని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. పాశవిక హత్యలకు పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితుడికి బెయిల్ లభించకుండా ప్రభుత్వం, పోలీసులు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. ఘటన జరిగి సమయం గడుస్తున్నా, ప్రజలు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. హంతకుడు ఇంకా అరెస్టు కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర మానసిక వేదనలో ఉన్నారన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, వారికి పూర్తి భద్రత కల్పించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# విద్యుత్ కష్టాలకు చెక్ పెడతారా?

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** మెరుగైన సేవలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. విద్యుత్ వినియోగదారుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా.. ఏకంగా సిఎండీ క్షేత్రస్థాయిలోకి వస్తున్నా.. పరిస్థితిలో ఆశించిన ఫలితాలు ఎందుకు రావడం లేదు? అనేది ఇప్పుడు విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.విద్యుత్ కష్టాల విషయంలో ప్ర భుత్వ ప్రమేయం ఎంత మాత్రం లేదని.. ప్రభుత్వం ని యమించిన డైరెక్టర్లు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు విద్యుత్ వినియోగదారుల పాలిట శాపంగా మా రుతున్నాయనే చర్చ జరుగుతోంది. గతంలో ఒక భవన నిర్మాణం జరుగుతున్న సమయంలో నిర్మాణం కోసం తాత్కాలిక పద్ధతిలో విద్యుత్ కనెక్షన్ తీసుకునే వారు. ప ని పూర్తయిన తర్వాత తనకున్న విద్యుత్ కనెక్షన్ క్యాటగి రి మార్చేందుకు ఒక్క దరఖాస్తు (లేదంటే మెయిల్) పె ట్టుకుంటే రెండు, మూడు రోజుల్లో క్యాటగిరి మార్చేవా రు. అయితే క్యాటగిరి మార్చేందుకు వినియోగదారుడు కార్పొరేట్ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తే గానీ రె ండు, మూడు నెలలకు క్యాటగిరి మారుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇందుకు ప్రధానంగా డైరెక్టర్ల అ నాలోచిత నిర్ణయాలతో విద్యుత్ వి నియోగదారులకు క ష్టాలు కొనసాగుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. డైరెక్టర్ల నియమించక ముందు విద్యుత్ సీనియర్ అధికారుల సలహాలు తీసుకుంటు నిర్ణయాలు తీసుకున్న సీఎం డీ ముషారఫ్ ఫరూఖీ ఆ తర్వాత డైరెక్టర్ల జోక్యంతో సం వత్సరాల తరబడి ఉన్న రూల్స్, నిబంధనలను మార్చి విద్యుత్ వినియోగదారులపై ఆర్థిక భారం వేయడమే కాకుండా, కొన్ని సందర్భాలలో కార్యాలయాలకు చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితిని కల్పించారనే విమర్శలు వస్తున్నాయి.

**ఓ డైరెక్టర్ కారణమా?**

ఈ క్రమంలోనే ఓ డైరెక్టర్ తీసుకు వస్తున్న రూల్స్ విద్యుత్ వినియోగదారులకు గుదిబండగా మారుతున్నాయనే చర్చజరుగుతోంది. విద్యుత్ వినియోగదారులు, మరో వైపు కాంట్రాక్టర్లు, ఇంకో వైపు విద్యుత్ ఉద్యోగులు టిజిఎస్‌పిడిసిఎల్ యాజమాన్యంపై క్రమంగా ఆగ్రహం పెంచుకుంటున్నారు. ఉద్యోగులు రెండు సంవత్సరాల తర్వాత రోడ్డెక్కాల్సిన పరిస్థితిని యాజమాన్యం కల్పించిందని.. విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాతో ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రభావం కాస్తా సీఎండీని బదిలీ చేసే వరకు వచ్చిందని.. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సిఎండి జితేష్ పాటిల్ అప్రమత్తమైనా ఆశించిన ఫలితాలు రావాలంటే సమయం పడుతుందని చెప్పవచ్చు. ముఖ్యంగా ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ నిబంధనతో హైదరాబాద్ మహానగరంలో నాలుగు లక్షలకు పైగా గృహాలు ఎందుకు అంధకారంలో ఉన్నాయంటే దీనికి బాధ్యత ఎవరిది? అంటే సమాధానమే దొరకడం లేదు. వాస్తవానికి జీహెచ్ఎంసీలో ఎలాంటి నిబంధనలు ఉంటాయి? వేటికి ఓసీ ఇస్తారు? ఎన్ని గజాల వరకు అనుమతులు అవసరం ఉండవనే నిబంధనలు ఉండగా.. కనీసం వాటిని తెలుసుకోలేని డైరెక్టర్లు మురికివాడల్లోని 50, 60 చదరపు గజాల్లో నిర్మించిన పేద ప్రజల ఇళ్లకు కరెంట్ ఇవ్వక పోవడంతో ప్రజల ఆగ్రహానికి కారణంగా మారుతోంది. ఇక ఉద్యోగుల బదిలీల్లో రెండు సంవత్సరాలకే బదిలీ నిబంధన మార్చి వారు రోడ్డెక్కె పరిస్థితిని కల్పించారని ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు నియమించిన డైరెక్టర్లలో ఒకరికి టెక్నికల్ అవగాహన లేక పోగా, మరొకరు తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం పరోక్షంగా ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని విద్యుత్ ఉద్యోగులు మధనపడతున్నారు. ఇకనైనా డైరెక్టర్ల ఆదేశాల అమలు సాధ్యమేనా? అనే విషయాన్ని సిఎండీ సమీక్షించాలనే డిమాండ్ పెరుగుతోంది.

# కాంగ్రెస్ బలోపేతానికి నూతన అధ్యక్షులు కృషి

### ఇబ్రహింపట్నం శాసన సభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి...



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖలు అధ్యక్షులు కృషి చేయాలని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం తోర్రూర్ క్యాంపు కార్యాలయంలో నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం గారి అధ్వర్యంలో ఎంఎల్ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మిదుగా అంద జేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన పేదలందరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరంటు, గ్యాస్ సప్సిడి, వంటి పథకాలను ఇంటింటికి వెళ్ళి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన అధ్యక్షులు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. తాడిపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు గా నీలం రాములు, అయ్యవారిగూడ గ్రామ అధ్యక్షులుగా నక్క లక్ష్మ య్య యాదవ్, మల్కిజ్‌గూడ గ్రామ శాఖ అధ్యక్షులుగా వరికుప్ప యాదయ్యలకు నియామక పత్రాలు అంద జేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి తన సహకారం ఎలప్పుడు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి రాచర్ల వేంకటేశ్వర్లు, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడుముత్యాల వేంకట్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మేన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు దెంది రాంరెడ్డి, కేషమోని రాజు, పిఎసిఎస్ మాజీ వేస్ చైర్మేన్ శ్రీనివాస్‌రెడ్డి,వెంకట నర్సింహ్మారెడ్డి, జిల్లా యువజన విభాగం ప్రధానకార్యదర్శి రామకృష్ణ యాదవ్,మండల యువజన కాంగ్రేస్ అధ్యక్షులు పాశం జయప్రకాశ్, మధర్‌రెడ్డి డైరెక్టర్ మండలి జంగయ్య, మాజీ సర్పంచ్ దూస రమేష్ ,మంజుల పాల్గొన్నారు.

# యువత హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలు

### ఎఐవైఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** యువత హక్కుల సాధనకై రాజీలేని పోరాటాలు చేయాలి అనిఏఐవైఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్ అన్నారు.సిపిఐ హయత్‌నగర్ మండల కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య మండల నిర్మాణ మహాసభ నిర్వహించారు. మండల అధ్యక్షుడు శాగంటి వీరన్న అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్ ,సిపిఐ ఎల్ బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్ గారు సంఘం జెండాను ఆవిష్కరించి మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం నాయకులు యువతను ఉద్దేశించి ప్రసంగించారు. సమాజంలో నేటి యువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగం తదితర సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ పక్షాన భవిష్యత్తులో రాజీలేని పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు.యువత హక్కుల సాధనకు,సామాజిక మార్పుకు ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో మండల స్థాయిలో యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యలపై ముందుండి పోరాడాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ మహాసభల్లో హయత్‌నగర్ మండల నూతన కమిటీని నాయకులు ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు.

# ముగిసిన 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ స్థాయి వరకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని చేరవేసి రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) నిర్వహించిన 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' కార్యక్రమం మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ముగిసింది. గచ్చిబౌలి స్టేడియంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పిటి ఉష ప్రారంభించిన ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో కొనసాగింది. జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు , సీనియర్ క్రీడాకారులు, స్పోర్ట్స్ అథారిటీ అకాడమీ క్రీడాకారులు, కోచ్‌లు పెద్ద ఎత్తున హాజరై విశేష స్పందన తెలిపారు. ప్రతి మొబైల్ బృందంలో ముగ్గురు కోచ్‌లు, ఒక ఫిజియోథెరపిస్టు, ముగ్గురు సీనియర్ క్రీడాకారులు, ఒక ప్రత్యేక అధికారి పాల్గొని శాస్త్రీయ క్రీడా శిక్షణ, ఆధునిక కోచింగ్ పద్ధతులు, గాయాల నివారణ, పునరావాసం, హైడ్రేషన్, క్రీడా పోషకాహారం, ఒత్తిడి నిర్వహణ, క్రీడాకారుల మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమం కోసం ప్రత్యేక శిక్షణ కిట్లను కూడా అందించారు.అలాగే కోచ్‌లు, పిఇటిలు, పిడిలు, క్రీడాకారులకు రిఫ్రెషర్ శిక్షణ అందించి, వారు తమ పరిధిలోని గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ఈ విజ్ఞానాన్ని చేరవేసేలా తీర్చిదిద్దారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం, జిల్లాకు శాస్త్రీయ క్రీడా విజ్ఞానాన్ని తీసుకెళ్లడం, కోచింగ్ ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతిభావంతులైన



క్రీడాకారులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాలను హైదరాబాద్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు నిరంతరం సమన్వయం చేస్తూ పలు జిల్లాల్లో స్వయంగా పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, తొలి విడతలో అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, త్వరలోనే దీనిని ముఖ్యమైన నియోజకవర్గ కేంద్రాలు, క్రీడల్లో చురుకుగా ఉన్న ప్రాంతాలకు విస్తరించి మరింత మంది క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణ అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

# డాన్సర్స్ అసోసియేషన్‌లో వివాదం

### * జానీ మాస్టర్ వర్సెస్ శేఖర్ మాస్టర్ * కొట్టుకునే స్థాయికి వెళ్లిన డ్యాన్సర్లు
### * పోలీసుల రంగ ప్రవేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు సినిమా డాన్సర్స్‌అండ్ డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ లో పెత్తనం కోసం రెండు వర్గాలు కొట్టుకునే స్థాయిలో గొడవ పడ్డారు. ప్రస్తుతం అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్న జానీ మాస్టర్ భార్య సుమలత వర్గం శేఖర్ మాస్టర్ వర్గం గొడవకు దిగారు. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పెద్ద గొడవ జరగకుండా ఆపేశారు. ఒక దశలో జానీ మాస్టర్ కు చెందిన కొందరు డ్యాన్సర్స్ పోలీసులు ఎందుకొచ్చారంటూ వాగ్వాదానికి దిగారు. అసోసియేషన్ గొడవల్లో సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జోక్యం చేసుకోవద్దని జానీ మాస్టర్‌తో సహా అతని వర్గీయులు ఆందోళనకు దిగారు. జానీ మాస్టర్ భార్య సుమలత డాన్సర్స్ అసోసియేషన్ లో అధ్యక్షురాలిగా గెలిచిన తరువాత జానీ మాస్టర్ దంపతుల ఏక పక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని డ్యాన్సర్లు ఆరోపిస్తున్నారు. తెలుగు క్యాన్సర్లను ఉపయోగించకుండా ముంబాయి డ్యాన్సర్లను ఎక్కువగా తెచ్చుకుని తెలుగు డ్యాన్సర్లకు జానీ మాస్టర్ అన్యాయం చేస్తున్నారని ఇతర డ్యాన్సర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జానీ , సుమలత ఏకపక్ష ధోరణిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ 10 మంది కమిటీ సభ్యులు రాజీనామా చేశారు. జానీ మాస్టర్, భార్య సుమలత ఆగడాలు భరించలేక ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేసి మళ్లీ ఎలక్షన్స్ కి వెళ్దాం అంటు ఫెడరేషన్ కు లేబర్ కమిషన్ కు వినతి పత్రం కూడా ఇచ్చారు. అసోసియేషన్స్ బ్యాన్ చేసినా 5 కోట్లు ఫ్రాడ్ చేసిన వ్యకిని మళ్లీ జానీ మాస్టర్ తీసుకొని వర్క్ పర్మిషన్ ఇవ్వడంతో అసలు గొడవ మొదలైంది. తెలుగు డాన్సర్స్ పొట్ట కొడుతున్న జానీ మాస్టర్ పై డాన్సర్స్ తిరుగుబాటు చేశారు. పెద్ది సినిమాలో సాంగ్ కు బొంబాయి డాన్సర్లతో చేయించిన తెలుగు వాల్లకు అన్యాయం చేశారని, ఈ విషయం అసోసియేషన్ లో ఫిర్యాదు చేసినా సుమలత పట్టించుకోలేదని డ్యాన్సర్లు ఆందోళనకు దిగారు. బొంబాయి డాన్సర్స్ తో చేయిస్తే ఒకరి మీద 5 వేలు 100 మందితో చేయిస్తే రోజుకి 5 లక్షలు పైనే జానీ మాస్టర్ జేబులోకి వెళ్తున్నాయని డ్యాన్సర్లు ఆరోపించారు. ఫెడరేషన్ ను సర్ది చెప్పే ప్రయత్నం చేసినా జానీ మాస్టర్ భార్య సుమలత ఫెడరేషన్ ను సైతం లెక్క చేయడం లేదని అంటున్నారు. ఆదివారం జరిగిన సమావేశం రసభాసాగా మారడంతో సమావేశం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి తో సహా అన్ని పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని డ్యాన్సర్లు కోరుతున్నారు.

## శాశ్వత తొలగింపు వద్దు

# ‘సస్పెన్షన్’ మాత్రమే చేయాలి


- 30రోజులపాటు నిర్బంధంలో ఉన్న పిఎం, సిఎంల పదవి విషయంలో పార్లమెంటరీ కమిటీ సిఫార్సు



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష పార్టీలు వ్యక్తం చేసిన ఆందోళ నల నేపథ్యంలో తీవ్రమైన నేరారోపణలపై ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులను వరుసగా 30 రోజులపాటు నిర్బంధిస్తే, వారిని పదవుల నుంచి శాశ్వతంగా తొలగించకుండా సస్పెండ్ చేయాలని ఒక పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. అలాంటి వ్యక్తులు నిర్దోషులుగా విడుదలైనా లేదా నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ ముందుకు సాగకపోయినా, ఈ నిర్ణయాన్ని స్వయంచాలకంగా రద్దు చేసే నిబంధనను కూడా పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించింది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంట్ సంయుక్త కమిటీ రెండు నిర్దిష్ట, మూడు సాధారణ సిఫారసులను చేసింది. గత ఆగస్టులో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రకారం ప్రధానమంత్రి, మంత్రులు లేదా ముఖ్యమంత్రులు స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలగని పక్షంలో వారిని నిర్బంధించిన 31వ రోజున స్వయంచాలకంగా పదవి నుంచి తొలగించవచ్చు. తాము నడుపుతున్న ప్రభుత్వాలను అస్థిరపరిచే సాధనంగా ఈ బిల్లును ప్రతిపక్షాలు అభివర్ణించాయి. చాలా ప్రతిపక్ష పార్టీలు బిల్లును పరిశీలిస్తున్న సంయుక్త కమిటీ నుండి వైదొలిగాయి. ఈ వారం ఆమోదం పొందే అవకాశం ఉన్న తన నివేదికలో తొలగింపు అనే పదాన్ని ‘సస్పెన్షన్’తో భర్తీ చేయాలని ప్యానెల్ ప్రతిపాదించింది. అంటే, నిర్దిష్ట క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులను, న్యాయపరమైన విచారణల ఫలితం వెలువడే వరకూ శాశ్వతంగా తొలగించకుండా, సస్పెండ్ చేయాలి. గరిష్ఠంగా 5సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడే నేరాలను ఈ పదం సూచించాలని పేర్కొంటూ, ‘తీవ్రమైన నేరపూరిత నేరాలు’ అనే పదాన్ని కూడా ఇది నిర్వచించింది. ఒక సన్‌సెట్ లేదా ‘ఆటోమేటిక్ రివర్సల్ క్లాజ్’ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదిస్తూ, మంత్రి నిర్దోషిగా విడుదలైనా లేదా నిర్దిష్టకాలంలోగా విచారణ ముందుకు సాగకపోయినా సస్పెన్షన్ స్వయంచాలకంగా ముగిసిపోవాలని అది పేర్కొంది. కోర్టులచే నిర్దోషులుగా తేలిన వారికి ఈ రక్షణచర్య పున: నియామకాన్ని నిర్ధారిస్తుందని, అలాగే సస్పెన్షన్ శాశ్వతం కాదని పార్లమెంట్ సంయుక్త కమిటీ తెలియజేసింది. సుప్రీంకోర్టుకు అనుగుణంగా ఉన్నతస్థాయి రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి సంబంధించిన కేసులను ఫాస్ట్ ట్రాక్ లేదా ప్రత్యేక కోర్టులలో విచారించాలని సంయుక్త కమిటీ సిఫార్సు చేసింది. ప్రతిపాదిత చట్టంలో 5సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జైలు శిక్ష విధించబడే నేరాలను జాబితా చేసే ప్రత్యేక షెడ్యూల్‌ను చేర్చాలి. సస్పెన్షన్‌కు దారితీసే నేరాలను స్పష్టంగా గుర్తించాలని ప్యానెల్ పేర్కొంది. ప్రభుత్వాలు జైలు నుండి నడపబడకుండా చూసే లక్ష్యంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. సిఫార్సులు ఆమోదం పొందితే, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదిత సవరణలతో కేంద్ర మంత్రివర్గాన్ని సంప్రదించి, ఆ తర్వాత లోక్‌సభలో అధికారిక సవరణలను ప్రవేశపెడుతుంది.

# కీలక పదవులన్నీ ఒకే పార్టీ చేతిలో ఉండొద్దు

కేరళలో ప్రతిపక్ష ఉపనేత పదవిని మాకు ఇవ్వాల్సిందే : సిపిఐ



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడు పదవి కోసం చేస్తున్న డిమాండ్ విషయంలో సిపిఐ పట్టుదలతో ఉంది. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ కూటమిలో కీలక పదవులన్నీ ఒకే పార్టీ చేతిలో ఉండకూడదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం స్పష్టం చేశారు. ఎల్‌డిఎఫ్‌లో సిపిఐ(ఎం) తర్వాత సిపిఐ రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షం. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఓటమి తర్వాత నుంచి ఆ పార్టీ ఈ డిప్యూటీ ప్రతిపక్ష నాయకుడి పదవిని కోరుతోంది. ఆదివారం తిరువనంతపురంలో జరిగిన పి.కె. వాసుదేవన్ నాయర్ స్మారక సభలో బినోయ్ విశ్వం మాట్లాడుతూ ప్రతిపక్ష ఉపనాయకుడి విషయంలో సిపిఐలో ఎటువంటి వివాదం గానీ, సందేహం గానీ లేదని అన్నారు. ఆ పదవికి సిపిఐకి పూర్తి హక్కు ఉందని విశ్వం పేర్కొన్నారు. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య బాధ్యతల సమాన పంపిణీని నిర్ధారించడం ద్వారా ఎల్‌డిఎఫ్‌ను బలహీనపరచడం కాకుండా, మరింత బలోపేతం చేయడమే తమ పార్టీ డిమాండ్ ఉద్దేశమని విశ్వం తెలిపారు. ‘గత సంప్రదాయాలను సాకుగా చూపి ఎవరూ దీని నుండి తప్పించుకోలేరు. ఒకవేళ సంప్రదాయాలను మార్చాల్సి వస్తే, వాటిని మార్చాల్సిందే. సంప్రదాయం ముఖ్యం కాదు, రాజకీయాలే ముఖ్యం. సంప్రదాయం ముఖ్యం కాదు, ఎల్‌డిఎఫ్ ముఖ్యం. ఎల్‌డిఎఫ్ ఒక నిజమైన కూటమిగా ముందుకు సాగాలి’ అని ఆయన అన్నారు. సిబ్బంది, జీతం, వాహనం లేదా అధికారిక నివాసం వంటి సౌకర్యాలు లేదా ఆ పదవికి ఉండే హోదా కోసం తాము ఈ పదవిని కోరడం లేదని ఆయన చెప్పారు. ‘ఇది పదవి హోదాకు సంబంధించిన విషయం కాదు. గతంలో సిపిఐ ముఖ్యమంత్రి పదవిని కూడా పంచుకుంది. కాబట్టి, కేవలం హోదా కోసం మేము డిప్యూటీ ప్రతిపక్ష నాయకుడి పదవిని కోరడం లేదు. కీలక పదవులన్నీ ఒకే పార్టీ వద్ద ఉండకూడదనే సూత్రమే ఇక్కడ ముఖ్యం’ అని ఆయన అన్నారు. ప్రస్తుతం, సిపిఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఎల్‌డిఎఫ్‌లోని ముఖ్యమైన పదవులు, బాధ్యతలను కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య పంచుకోవాలని విశ్వం అన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తిన విధానం గురించి ప్రస్తావిస్తూ, కూటమిలో చర్చించకుండానే సిపిఐ బహిరంగంగా ఈ విషయాన్ని ప్రస్తావించిందన్న వాదనలను విశ్వం తోసిపుచ్చారు. సిపిఐ మొదట ఈ విషయాన్ని బహిరంగంగా లేవనెత్తలేదని, ముందుగా ఎల్‌డిఎఫ్ అంతర్గత సమావేశాల్లో దీనిపై చర్చ జరిగిందన్నారు. తాము అధికారికంగా లేఖ పంపాము, దానికి సమాధానం కూడా వచ్చిందని చెప్పారు. ఆ తర్వాతే ఈ అంశం బహిరంగ చర్చకు వచ్చిందని, కేవలం బహిరంగంగా మాట్లాడటం వల్లే సిపిఐ ఈ డిమాండ్ చేస్తోందని అనడం సరికాదని పేర్కొన్నారు.కూటమిలోనూ, బహిరంగంగానూ సమస్యలను ఎప్పుడు, ఎలా లేవనెత్తాలో సిపిఐకి తెలుసునని ఆయన అన్నారు. పి.కె. వాసుదేవన్ నాయర్, అచ్యుత మీనన్, ఎం.ఎన్. గోవిందన్ నాయర్ వంటి నాయకుల నుంచి తమకు సంక్రమించిన రాజకీయ సంప్రదాయం ఇదేనని ఆయన వివరించారు. అంతకుముందు, ప్రతిపక్ష ఉప నాయకుడి నియామకానికి సంబంధించిన అంశం ‘ముగిసిన అధ్యాయం’ అని విజయన్ పేర్కొన్నారు, అంటే దీనిపై ఇకపై ఎటువంటి చర్చ అవసరం లేదని ఆయన సూచించారు.

## మోదీ అండదండలతో విశ్వాస ద్రోహం

రామాలయం విరాళాల చోరీపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌పై కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉండడం ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ విశ్వాస ద్రోహానికి బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లను దేశం ఎప్పటికీ క్షమించదని మండిపడింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్, జవాబుదారీతనం నిర్ధారించడం, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న తమ పార్టీ డిమాండ్లను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పునరుద్ఘాటించారు. ‘విరాళాల దొంగతనం: విశ్వాస ద్రోహం. శ్రీరామ మందిరంలో విరాళాల దొంగతనం వెలుగులోకి వచ్చి నెల రోజులు గడిచినా, ప్రతీదానికీ తానే ఘనత దక్కించుకునే ప్రధానమంత్రి మోదీ, జవాబుదారీతనం విషయానికి వస్తే మౌనంగా ఉన్నారు. రామ మందిర అంశాన్ని రాజకీయం చేసిన వారిని ప్రతిరోజూ కొత్త వాస్తవాలు బట్టబయలు చేస్తున్నాయి’ అని రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా, ప్రతిరోజూ లక్షల రూపాయల కానుకలు మాయమవుతున్నాయని అంగీకరించక తప్పలేదని రమేశ్ అన్నారు. ‘శ్రీరామ ఆలయంలో విరాళాల దొంగతనం కేవలం కొద్దిమంది ఉద్యోగులకే పరిమితం కాదు; అయినప్పటికీ, రాముడి ఆశయానికి వ్యతిరేకంగా ఉన్న ఈ ప్రభుత్వం అసలు దోషులను కాపాడాలని చూస్తోంది’ అని ఆయన ఆరోపించారు. సిట్, ఎఫ్ఐఆర్, రాజీనామాలు కేవలం దేశాన్ని మోసం చేసే ప్రయత్నాలేనని కాంగ్రెస్ నిలకడగా చెబుతోందని రమేశ్ అన్నారు. ఈ విషయాన్ని అణచివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, చంపత్ రాయ్, ఇతర ఆలయ ట్రస్టీలు లోతైన రహస్యాలను దాచిపెట్టారని స్పష్టం చేస్తున్నాయని, అందుకే మోదీ ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, వారి ప్రభావం చెక్కుచెదరకుండా ఉందని రమేశ్ ఆరోపించారు. ‘సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత దర్యాప్తు; ఫోరెన్సిక్ ఆడిట్; జవాబుదారీతనం నిర్ధారణ; దోషులపై కఠిన చర్యలు’ వంటి వాటిని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. ‘ప్రధానమంత్రి గారూ, దేశం తెలుసుకోవాలనుకుంటోంది: ఈ మౌనం ఎందుకు? మోదీ అండతో పథకం ప్రకారం జరిపిన ఈ విశ్వాస ద్రోహానికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను దేశం ఎన్నటికీ క్షమించదు‘ అని రమేశ్ ఆరోపించారు. కాగా, కాంగ్రెస్ నాయకులు దేశవ్యాప్తంగా 26 చోట్ల విలేకరుల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలలో వారు, విరాళాల చోరీపై సిట్ నివేదిక మంచుకొండలో ఒక చిన్న భాగం మాత్రమే అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పెద్ద చేపలు స్వేచ్ఛగా తిరుగుతున్న తీరు చూస్తుంటే, వారికి ‘ప్రధానమంత్రి మోదీ పూర్తి రక్షణ, ఆశీస్సులు ఉన్నాయని తెలుస్తోందన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రత్యర్థుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న బిజెపి, విరాళాల దొంగతనం కేసులో తప్పు చేసినట్లు రుజువైన వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. రామమందిర నిర్మాణానికి ఎన్నడూ మద్దతు ఇవ్వని ప్రతిపక్ష పార్టీలు, హిందువులను విభజించడానికి ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని ఆరోపించింది.

## సిఇఒ అధికారాల నిర్ణయం రామాలయ ట్రస్టుదే

సిఇఒ పనితీరులో ఎటువంటి ప్రభుత్వ జోక్యం ఉండదని: మిశ్రా





**అయోధ్య :** అయోధ్య ఆలయానికి నియమితులయ్యే మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) బాధ్యతలు, అధికారాలను ఆలయ ట్రస్ట్ నిర్ణయిస్తుందని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ట్రస్ట్ పట్ల భక్తులకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటమే సిఇఒ ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొత్త సిఇఒ ఆర్థిక వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తారు అని అయోధ్యలో జరిగిన విలేకరుల సమావేశంలో మిశ్రా చెప్పారు. ట్రస్ట్ లేదా సిఇఒ పనితీరులో ఎటువంటి ప్రభుత్వ జోక్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యను సందర్శించే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం, ఆలయం పట్ల వారి నమ్మకాన్ని నిలబెట్టడం వంటివి కొత్త సిఇఒ ప్రాథమిక బాధ్యతలలో ఉంటాయని మిశ్రా తెలిపారు. ఒక రకంగా చెప్పాలంటే, ప్రభుత్వ జోక్యం లేకుండా సిఇఒ ట్రస్ట్‌కు సహాయకారిగా పనిచేస్తారు అని మిశ్రా అన్నారు. సిఇఒ పదవికి తగిన అభ్యర్థులను ట్రస్ట్‌కు సిఫార్సు చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చివరికి, సిఇఒకు ఎంత అధికారం అప్పగించాలనేది ట్రస్ట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, మొత్తం వ్యవహారాలు ట్రస్ట్ పరిధిలోనే ఉంటాయని, అయితే సిఇఒ తన సిబ్బందిని స్వయంగా ఏర్పాటు చేసుకునే బాధ్యత కలిగి ఉంటారని మిశ్రా వివరించారు. సిఇఒ పదవికి అభ్యర్థులను పరిశీలించడానికి రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, మాజీ ఎన్ఐటి రాయ్‌పూర్ చైర్‌పర్సన్ సురేష్ హవారేలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ట్రస్ట్ ఈనెల 6న ప్రకటించింది. రామమందిర ట్రస్ట్‌లో ఏవైనా మార్పులు ఉండే అవకాశం ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, ‘నా సమక్షంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు’ అని మిశ్రా పేర్కొన్నారు. 6న జరిగిన ట్రస్ట్ సమావేశానికి తాను హాజరుకాలేదని కూడా ఆయన స్పష్టం చేశారు. 22న జరగనున్న సమావేశానికి హాజరవుతారా అని అడిగినప్పుడు మిశ్రా స్పందిస్తూ సమావేశం 22న ఉంది, కానీ దాని ఎజెండా (అజెండా) నాకు తెలియదని, ఒకవేళ ఆ విషయం నిర్మాణానికి సంబంధించినదైతే, తప్పక హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఎజెండా తెలిసిన తర్వాత, సమావేశానికి హాజరవ్వాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానన్నారు. 22 నాటి సమావేశంలో ఏయే అంశాలపై చర్చ జరగవచ్చనే దాని గురించి ప్రస్తావించినప్పుడు, ఆ విషయాన్ని ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిని అడిగి తెలుసుకోవాలని మిశ్రా సూచించారు.

రామాలయ విరాళాల చోరీ...

## దోషులపై కఠిన చర్యలు

ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్, దేశవ్యాప్త సంతకాల సేకరణ ప్రారంభం

**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) డిమాండ్ చేసింది. ఆదివారం దేశవ్యాప్త సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం, రోహిణిలోని జపనీస్ పార్కులో ఆ పార్టీ ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హనుమంతుని ఆశీస్సులతో ప్రారంభిస్తున్నామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. మందిరంలో జరిగిన ఈ ‘చందాచోరీ’కి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలపై సంతకాలు చేసి, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో భాగంగా, ప్రజలు తమ ఇళ్లలో, నివాస సముదాయాలలో, ఇతర ప్రాంతాలలో హనుమాన్ చాలీసా పారాయణాలు, హనుమాన్ హారతి నిర్వహించి, భక్తులను సమీకరించి, ప్రధానమంత్రికి రాసిన లేఖపై సంతకాలు చేసేలా వారిని ప్రోత్సహించాలని కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందని, ఇది కేవలం ఆప్ కార్యకర్తలకు మాత్రమే పరిమితం కాదని ఆయన పేర్కొన్నారు. రామ భక్తులు, ఆరోపించబడిన పరిణామాల వల్ల బాధపడిన ప్రజలు ఈ ప్రచారంలో పాల్గొంటారని, సంతకాలతో కూడిన లేఖలను తర్వాత ప్రధానమంత్రికి పంపుతారని కూడా ఆయన అన్నారు. రామ మందిరానికి సంబంధించిన ఆరోపిత దుష్ప్రవర్తనకు బాధ్యులైన వారిని జవాబుదారీతనం నుండి కాపాడుతున్నారని కేజ్రీవాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వారికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఆప్ చర్యను ఢిల్లీ బిజెపి విమర్శించింది. కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్తును పునరుద్ధరించడానికే సుందరకాండ పారాయణాలను నిర్వహించడం ఒక ‘రాజకీయ జిమ్మిక్కు’ అని ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేజ్రీవాల్ మతపరమైన కార్యక్రమాలను వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 2024లో ఆప్ ప్రభుత్వం ప్రకటించిన సుందరకాండ పారాయణ కార్యక్రమాలను ఎందుకు కొనసాగించలేదని ప్రశ్నించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోని ఓటర్లను ప్రభావితం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని కూడా ఆయన ఆరోపించారు. రామమందిరం అంశంపై కేజ్రీవాల్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఆయన హనుమంతుడు, సుందరకాండ పాఠం పేరుతో ‘కపట భక్తి’ని ప్రదర్శిస్తున్నారని బిజెపి నాయకుడు ఆరోపించారు.



### శాంతిభద్రతలు పూర్తిగా విఫలం

మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ ఇబోబి సింగ్ ధ్వజం

**ఇంఫాల్ :** వచ్చే ఏడాది ప్రారంభంలో జరుగనున్న మణిపూర్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో చాలా కీలకమని మణిపూర్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ ఇబోబి సింగ్ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని ఆయన ఆరోపించారు. శనివారం ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని కాంటో సబల్ వద్ద దాదాపు 600మందితో కూడిన అల్లరిమూక కనీసం మూడు పాడుబడిన ఇళ్లకు నిప్పుపెట్టిన ఘటనను సింగ్ ఖండించారు. ఆదివారం ఇక్కడి కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇబోబి సింగ్ మాట్లాడుతూ ‘నిన్న కాంటో సబల్‌లో జరిగిన సంఘటన మాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అయితే ఇలాంటి చర్యలు కొత్తేమీ కాదు. రాష్ట్రంలో అప్పుడప్పుడు దురదృష్టమైన, అవాంఛనీయ సంఘటనలు జరుగుతూనే ఉంటాయి’ అని చెప్పారు. కాంటో సబల్ ఒక సైనిక శిబిరానికి పక్కనే ఉందని, ఆ ప్రాంతంలో పెద్దయెత్తున కేంద్ర బలగాలను కూడా మోహరిస్తున్నారని తెలియజేశారు. పాడుబడిన ఇళ్లను తగులబెడుతున్నప్పుడు రాష్ట్ర బలగాలను, అగ్నిమాపక వాహనాలను కూడా ఆ ప్రాంతంలోకి అనుమతించడం లేదని సింగ్ ఆరోపించారు. మూడు సార్లు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ‘రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కొనసాగుతోందా? లేదా? అని మేం వాస్తవానికి ప్రశ్నించాలని అనుకుంటున్నాం’ అని అన్నారు.

# ఢిల్లీలో కాకుండా మరెక్కడ చేయాలి?

- బిజెపి వ్యాఖ్యలపై మండిపడ్డ జమ్ముకశ్మీర్ సిఎం అబ్దుల్లా
- ఈనెల 20న జంతర్‌మంతర్‌లో ఎన్‌సి నిరసనలు




**జమ్ము :** కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించడంలో జరుగుతున్న అస్పష్టమైన జాప్యంపై, ఢిల్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా ఈనెల 20 నుండి కొత్త దశ నిరసనలు చేపట్టనున్నట్లు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. ఆదివారం జమ్ములో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తుందనే ఆశతో తమ పార్టీ రెండేళ్లు వేచి చూసిందని అబ్దుల్లా పేర్కొన్నారు.
‘మేము కేంద్ర ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చాము. దాదాపు రెండేళ్లపాటు రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం చర్చలు జరిపాము. ఇప్పుడు మేము కొత్త వ్యూహాన్ని అనుసరిస్తాము’ అని అబ్దుల్లా అన్నారు. రాష్ట్ర హోదా కల్పనను కేంద్రం పదేపదే సరైన సమయం వరకు వాయిదా వేస్తుండటాన్ని ప్రశ్నించిన ముఖ్యమంత్రి, అసలు ఆ సరైన సమయం అంటే ఏమిటని, అంటే జమ్ము కశ్మీర్‌లో బిజెపి అధికారంలోకి రావడమేనా అని నిలదీశారు. ‘జంతర్ మంతర్ వద్ద ఎన్‌సీ (నేషనల్ కాన్ఫరెన్స్) చేపట్టిన నిరసనపై బిజెపి నాయకులు వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు, ఇలాంటి నిరసనల వల్ల రాష్ట్ర హోదా రాదని అంటున్నారు... మరి ఢిల్లీలో కాకపోతే ఇంకెక్కడ నిరసన తెలపాలి? అని ఆయన ప్రశ్నించారు. ‘మన దేశంలోని ఒక ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాలను మన జాతీయ రాజధానిలోనే తీసుకోలేకపోతే, మరి ఎక్కడ తీసుకోవాలి? అని ఆయన జోడించారు. జమ్ము కశ్మీర్‌లోనూ, అసెంబ్లీలోనూ రాష్ట్ర హోదా కోసం తాము చేసిన ప్రయత్నాలను బిజెపి నిరంతరం నీరుగార్చిందని, ఇప్పుడు దేశ రాజధానిలో చేస్తున్న నిరసన విషయంలోనూ అదే చేస్తోందని అబ్దుల్లా అన్నారు. ‘అయితే మేము ఏం చేయాలని వారు ఆశిస్తున్నారు? జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా కోసం అమెరికా వెళ్లి వైట్ హౌస్ బయట నిరసన తెలపాలా? మా దేశంలో ఇచ్చిన హామీని మా దేశ రాజధానిలోనే నెరవేర్చాలని మాత్రమే మేము కోరుతున్నాము’ అని ఆయన అన్నారు. రాజ్యాంగపరమైన హామీని నెరవేర్చడానికి బదులుగా, రాష్ట్ర హోదాను ఒక రాజకీయ అస్త్రంగా వాడుకోవడానికి బిజెపి దానిని ఎరగా ఉపయోగిస్తోందని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఆరోపించారు. ‘ఒకవేళ అది కత్రా గడ్డపై మోదీ ఇచ్చిన హామీ అయితే, దానిని కచ్చితంగా నెరవేర్చాలి‘ అని రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించి ప్రధానమంత్రి చేసిన హామీని ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత వీలైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కూడా అబ్దుల్లా గుర్తుచేశారు. రాష్ట్ర హోదాను నిలిపివేయడం ద్వారా కేంద్రం జమ్ముకశ్మీర్ ప్రజలను శిక్షిస్తోందని ఆయన ఆరోపించారు. ‘దేశం సవాళ్లను ఎదుర్కొన్నప్పుడల్లా జమ్ము ప్రజలు దేశానికి అండగా నిలిచారు. సరిహద్దు జిల్లాలు షెల్లింగ్ తీవ్రతను భరించాయి, ఉగ్రవాదం వల్ల నిరాశ్రయులైన వారికి జమ్ము తన ద్వారాలను తెరిచింది. ప్రజలు చేసిన నేరం ఏమిటి, వారికి ఇప్పటికీ రాష్ట్ర హోదాను నిరాకరిస్తున్నారా?’ అని అబ్దుల్లా అన్నారు. మహాత్మా గాంధీని స్మరించుకుంటూ, దేశ విభజన అనంతర హింసాకాండ సమయంలో జాతిపిత జమ్ముకశ్మీర్‌ను మత సామరస్యానికి ప్రతీకగా అభివర్ణించారని అబ్దుల్లా అన్నారు. హిందూ–ముస్లిం–సిక్కు ఐక్యత ఆదర్శాలను నిలబెట్టినందుకు ఇప్పుడు ఆ ప్రాంతాన్ని శిక్షిస్తున్నారా అని కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా తిరిగి లభించే వరకు నేషనల్ కాన్ఫరెన్స్ ప్రజాస్వామ్య, శాంతియుత మార్గాల ద్వారా తన పోరాటాన్ని కొనసాగిస్తుందని అబ్దుల్లా అన్నారు. ‘మేము మా సొంత దేశ రాజధాని తలుపులు తడుతూనే ఉంటాము. జమ్ముకశ్మీర్ ప్రజలకు చేసిన వాగ్దానాలను దేశ నాయకత్వానికి గుర్తు చేస్తూనే ఉంటాము. ఆ వాగ్దానాలను నిలబెట్టుకోవాలని మాత్రమే మేము కోరుతున్నాము’ అని ఆయన అన్నారు. రోడ్డు మార్గంలో జమ్ము చేరుకున్న ముఖ్యమంత్రి, ఢిల్లీలో నిరసన ప్రదర్శన కోసం ప్రజల అనుమతి కోరేందుకు తాను ఉదయం 6 గంటలకే శ్రీనగర్ నుండి బయలుదేరినట్లు తెలిపారు. ‘చర్చలు విఫలమవడంతో మేము రోడ్లపైకి రాక తప్పలేదు. మా డిమాండ్‌కు మద్దతుగా ఈనెల 20న జరిగే నిరసన మా ఆందోళనకు నాంది పలుకుతుంది’ అని అబ్దుల్లా అన్నారు.

‘ఉపా’ కేసులో

## ముగ్గురి అరెస్టు..

తీవ్రవాదులను కీర్తిస్తూ పుస్తకం ప్రచురించారని ఆరోపణ..

**జమ్ము :** ‘ఉపా’ కేసులో ముగ్గురు నిందితులను జమ్ము కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ (సిఐజె) అరెస్టు చేసింది. ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ అనే పుస్తకం ప్రచురణ, పంపిణీకి సంబంధించి ముగ్గురు ప్రచురణకర్తలను సిఐజె అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ పుస్తకం తీవ్రవాదులు, వేర్పాటువాదులను కీర్తిస్తూ అతివాద భావజాలాన్ని ప్రచారం చేస్తోందని సిఐజె ఆరోపిస్తోంది. అరెస్టయిన నిందితుల్లో ఇద్దరు ఢిల్లీకి చెందినవారు కాగా.. మరొకరు జమ్ముకు చెందిన వ్యక్తిగా కేసు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఢిల్లీకి చెందిన నిందితుల్లో ఒకరు పుస్తకం ప్రచురణకు సంబంధించిన డిజిటల్ రికార్డులను తొలగించి సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారని అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తులో భాగంగా కీలకమైన ఆ డేటాను తిరిగి పొందినట్లు వెల్లడించారు. కాగా, ఢిల్లీ, జమ్ములోని ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ ప్రచురణ సంస్థలపై కొన్ని రోజుల కిందట సిఐజె బృందాలు దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా పుస్తకం ముద్రణ, సరఫరా, పంపిణీకి సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురిని అరెస్టు చేశారు. మరోవైపు పుస్తక రచయితల కోసం అధికారులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. రచయితల్లో ఒకరైన సంతోశ్ మీనాను ప్రశ్నించేందుకు సిఐజె బృందం ఇప్పటికే రాజస్థాన్‌కు చేరుకుంది. అయితే, రెండో రచయితైన హిలాల్ అహ్మద్ ఆచూకీ ఇంకా లభించలేదని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఈ కేసులో ఇప్పటికే విద్యాశాఖకు చెందిన ఎనిమిది మంది అధికారులను సస్పెండ్ చేశారు. పుస్తక ప్రచురణకు ఆమోదం తెలిపిన సమగ్ర శిక్షా డైరెక్టరేట్‌పైనా కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్ దాడులు నిర్వహించింది. కాగా, ‘పర్సనాలిటీస్ అండ్ లెజెండ్స్ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్’ పుస్తకంలో పలువురు ఉగ్రవాదులు, వేర్పాటువాదులను జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ వ్యక్తులుగా చిత్రీకరించే అధ్యాయాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 1984లో బర్మింగ్‌హామ్‌లో భారత దౌత్యవేత్త అయిన రవీంద్ర మహాత్రేను హత్య చేసిన మక్బూల్ భట్‌ను గ్లోరిఫై చేసేలా ఈ పుస్తకంలో ఉందని అధికారులు తెలిపారు. అలాగే సయ్యద్ అలీ షా గీలనీ, మస్రత్ ఆలం, మీర్వైజ్ ఉమర్ ఫరూఖ్‌తో సహా వేర్పాటువాదులను జమ్ముకశ్మీర్ గొప్ప వ్యక్తులుగా అభివర్ణించారని అధికారులు ఆరోపిస్తున్నారు.

‘రేపు’ సనత్‌నగర్ ఇఎస్ఐసి హాస్పిటల్ నుంచి...

# 7 బీమా ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లు షురూ

వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న కేంద్రమంత్రి మాండవీయ

**న్యూఢిల్లీ :** కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం తెలంగాణలోని సనత్‌నగర్ ఇఎస్ఐసి హాస్పిటల్ నుంచి దేశ వ్యాప్తంగా ఏడు ఉద్యోగుల రాష్ట్ర బీమా ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లను ప్రారంభించనున్నారు. దాదాపు రూ.668 కోట్ల విలువైన ఈ వైద్య సౌకర్యాలు దేశ వ్యాప్తంగా సుమారు 53లక్షల మంది లబ్ధిదారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీరుస్తున్నాయని కార్మిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి అయిన మన్‌సుఖ్ మాండవీయ సనత్‌నగర్‌లోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) హాస్పిటల్ నూతన ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపిడి) బ్లాక్‌ను స్వయంగా ప్రారంభించనున్నారు. అప్‌గ్రేడ్‌చేయబడిన అస్సాంలోని బెల్‌తోలా 200 పడకల ఇఎస్ఐసి హాస్పిటల్ , తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్‌లో ఉన్న 100 పడకల ఇఎస్ఐసి హాస్పిటల్, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలోని ఎస్ఐఎస్ హాస్పిటల్, గుజరాత్ సురేందర్ నగర్‌లోని ఇఎస్ఐ డిస్పెన్సరీ, బ్రాంచి కార్యాలయం, రాజస్థాన్‌లోని భవానీ మండి ఇఎస్ఐ డిస్పెన్సరీ, కోటాలోని ఉద్యోగ్‌నగర్‌లోని బ్రాంచి ఆఫీస్ ఈ ఆరు పాజెక్ట్‌ల్లో ఉన్నాయి. ఈ ఆరు ప్రాజెక్ట్‌లను కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించబోతున్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరాంద్‌లాజే కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలోని భాగంగా తెలంగాణలోని సనత్‌నగర్ ఆసుపత్రిలో ఓపిడి బ్లాక్ అభివృద్ధికి సహకరించిన కార్మికులను, దేశానికి వారు అందించిన సేవకు గుర్తింపుగా కేంద్ర మంత్రి మాండవీయ వారిని సత్కరిస్తారు. కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఆయన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను కూడా పంపిణీ చేస్తారు. సనత్‌నగర్‌లోని ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఓపిడి బ్లాక్ ఒక మైలురాయి వంటి ఆరోగ్య సంరక్షణ కేంద్రం. ఇది హైదరాబాద్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో సహా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12, 30, 183 మంది బీమా దారులకు, లబ్ధిదారులకు సమగ్రమైన ఔట్ పేషెంట్ సేవలను అందిస్తుంది. ఈ ప్రారంభోత్సవం రాష్ట్రంలోని విస్తృతమైన ఇఎస్ఐ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాల్లో అమలు చేశారు.



బెల్‌టోలా లోని ఇఎస్ఐ హాస్పిటల్ అస్సాం, మేఘాలయలోని 47 జిల్లాలకు, అలాగే త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్‌లోని 41 జిల్లాలకు సేవలు అందిస్తుంది. ఈ సౌకర్యం ద్వారా 3.42 లక్షల మంది బీమా చేయబడిన వ్యక్తులు , మొత్తం సుమారు 13.27లక్షల మంది లబ్ధిదారులు లబ్ధి పొందుతారని అంచనా.

# బంగ్లాదేశ్‌లో వరద విలయం: 43 మంది మృతి

•నీట మునిగిన అనేక ప్రాంతాలు,మానవతాసంక్షోభం •14,296 హెక్టార్లలో పంటలు ధ్వంసం •10 లక్షలమందిపై వరద ప్రభావం •నీట మునిగిన గిడ్డంగులు •ఓడరేవుల్లో దిగుమతి సరుకు నష్టం



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో అనేక రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు,ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. దీంతో 43 మంది మర ణించారు. లక్షలమంది వరదనీటిలో చిక్కుకుపోయారు. పలు ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆటుపోట్లు, ప్రజలు నీటి మునిగిపోవడం వంటి అనేక ఘటనల్లో మరో 39 మంది గాయపడ్డారు. అనేక ప్రాంతాలలో ఇళ్ళు పూర్తిగా నీట మునిగిపోయాయి. పలు మట్టి ఇళ్ళు కూలిపోయాయి. తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో దాదాపు 10 లక్షలమంది పైగా ప్రజలు తీవ్ర ప్రభావానికి గురయ్యారు. 14,296 హెక్టార్లలో పంటలు ధ్వంసమయ్యాయి. చాలా ఇళ్ళల్లో నడుములోతు నీరు నిలిచిపోవడంతో వంట చేసుకునే అవకాశం కూడా లేకుండాపోయింది. రెండు రోజులు గడచినాగానీ ప్రజలకు ప్రభుత్వ అధికారుల నుండి సహాయం లభించలేదు. దీం తో మానవతా సంక్షోభం తలెత్తింది. ప్రజలు నిరాశ్రయులై ప్రభు త్వం సమకూర్చిన తాత్కాలిక షెల్టర్లలో తలదాచుకుంటున్నా రు. దీంతో ఐదు రోజులుగా పాఠశాలలు మూసివేశారు. హెచ్‌ఎస్‌సి పరీక్షలు వాయిదా వేశారు. రైల్వే సేవలు నిలిచిపోయా యి. వారం రోజుల తర్వాత ఆదివారంనాడు ఈ ప్రాంతంలో ట్రాకులకు మర్మమతులు చేసి రైల్వే సేవలు పునరుద్ధరించారు.కాగా రాజధాని ఢాకాను భారీ వర్షాలు ముంచెత్తియి. నగరవీధులు నదులను తలపించాయి.. జనజీవనం అస్తవ్యస్తం గా మారింది. ఇప్పటివరకూ 37 వేలమంది ప్రజలు ప్రభుత్వ షెల్టర్లలో తలదాచుకున్నారు.బాధిత ప్రజలకోసం 1,727 సహాయ కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు.చట్టోగ్రామ్ ప్రాంతం లో తీవ్రనష్టం వాటిల్లింది. అక్కడ జల విలయం సంభవించింది. ఇళ్ళన్నీ నీట మునిగాయి. చిట్టాగాంగ్,సిల్హెట్ ప్రాంతాలను వరదలు కకావికలం చేశాయి. చట్టోగ్రామ్‌తో పాటు కాక్స్‌బజార్,రంగమతి,బందర్బన్,ఖగ్రాచారి ప్రాంతాలలో 8,66,000 మంది ప్రజలు వరదలవల్ల తీవ్రంగా నష్టపోయా రు. బన్స్‌ఖాలి ప్రాంతంలో 60,000 మంది ప్రజలు వరదనీటి బారిన పడ్డారు. చిట్టాగాంగ్‌లోని బంష్‌ఖలి,సత్కానియా,లోహగారా, చందనైష్ ,అన్వారా ఉపజిల్లాలు ముంపునకు గురయ్యాయి. నా 48 ఏళ్ళ జీవితంలో ఇంతటి ప్రకృతి విలయాన్ని, వరద బీభత్సాన్ని చూడలేదని బంష్‌ఖాలి ప్రాంత ఈస్ట్‌ల్వా గ్రామపౌరుడు రుహుల్ అమీన్ వ్యాఖ్యానించారు. ఈ వరద విలయంవల్ల మరణించినవారి అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా అవకాశం లేకుండాపోయిందని,శ్మశాన వాటికలు నిలువెత్తు నీటిలో మునిగి ఉన్నాయని చెప్పారు. బుధవారం నుండి ఈ ఉపజిల్లాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొబైల్‌ఫోన్ టవర్లు కూడా పనిచేయడం మానేశాయి. ఫోన్ రీచార్జింగ్‌కు అవకాశం లేకపోవడంతో సెల్‌ఫోన్ల సహాయం కూడా బాధితులకు లేదు. బెన్‌పోల్ ఓడరేవులో పలు గిడ్డంగులు నీట మునిగాయి. దిగుమతి చేసుకున్న వస్తువులన్నీ తీవ్రనష్టానికి గురయ్యాయి. 1,091టన్నుల బియ్యం, ,34,470 పొడి ఆహారం ప్యాకెట్లు, మరో ,91,10 రూపాయలు నగదు ప్రజలకు పంపిణీ చేసినట్లు చట్టోగ్రామ్ డివిజనల్ కమిషనర్ మహ్మద్ జియావుద్దీన్ చెప్పారు. ఋతుపవనాల ప్రభావం,వరదలు,కొండవాగులవల్ల సంభవించిన ఆకస్మిక వరదలు జనజీవనాన్ని అతలాకుతం చేశాయని ఆయన చెప్పారు. బాధిత ప్రాంతాలకు వైద్య సహాయ బృందాలను తరలించాలని,నీటిశుద్ధి మాత్రలను ప్రతి ప్రాంతంలో సరఫరా చేయాలని వైద్యశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయం సమీక్షా సమావేశంలో ఆదేశించింది. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందువల్ల ఆదివారం నుండి తెరిపివచ్చి కొంత పరిస్థితి కుదుటపడే అవకాశాలు ఉన్నాయని జియావుద్దీన్ చెప్పారు.

## హోర్ముజ్‌పై పరాకాష్ఠకు చేరిన ఆధిపత్యపోరు

### జలసంధి మూసేశాం: ఇరాన్ పెత్తనం లేదు

### ఇరాన్– సెంట్‌కామ్ పరస్పర ప్రకటనలు



**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యంకోసం అమెరికా–ఇరాన్ మధ్య పోరు తారాస్థాయియి చేరింది. జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించగా, జలసంధిపై ఇ రాన్ పెత్తనం లేదని, వాణిజ్య నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని అమెరికా సైనిక విభాగం సెంట్‌కామ్ ప్రకటించింది. మూడో విడత దాడుల తర్వాత సెంట్‌కామ్ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేస్తూ అన్ని వాణిజ్య నౌకలూ చట్టబద్ధంగా రాకపోకలు సాగించేందుకు జలసంధి తెరచే ఉంటుందని స్పష్టం చేసింది. జలసంధిలో చట్టబద్ధంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా తమ బలగాలను మోహరించి ఉంచామని, నౌకలపై దాడులు జరగకుండా రక్షిస్తామని, ఇరాన్ దురాక్రమణ,వేధింపులు,బెదిరింపు లు, ఏకపక్ష ప్రకటనలు ఉన్నప్పటికీ ఈ జలసంధిపై ఇరా న్ పెత్తనం లేదని సెంట్‌కామ్ అధికారులు ప్రకటించారు. ఇస్లామాబాద్ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించినందువల్ల, హోర్ముజ్‌లో అక్రమ మార్గాలను ప్రోత్సహిస్తున్నందువల్ల జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ఆదివారం తెల్లవారకముందుగానే ప్రకటన జారీ చేసింది. తమ అదేశాలకు విరుద్ధంగా ఒక వాణిజ్య నౌక ప్రయాణం చేసిందని, దానిని అడ్డుకున్నామని, హోర్ముజ్ తదుపరి తాము ఆదేశాలు జారీ చేసేవరకూ జలసంధి తెరుచుకోదని కూడా ఐఆర్‌జిసి ప్రకటించింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా ఒక వాణిజ్య నౌక అక్రమ మార్గంలో ప్రయాణం చేసి వెళుతోందని దానిని అడ్డుకున్నామని ఐఆర్‌జిసి పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ప్రస్తుత వివాదానికి హోర్ముజ్ జ లసంధిలో కొత్త జలమార్గాలే ప్రధాన సమస్యగా మా రాయి. తమ ప్రాదేశిక జలాలలో తాము నిర్దేశించిన విధ ంగా తమ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతినౌకా ప్ర యాణం చేయాలని ఇరాన్ పట్టు పడుతుండగా, ఇరాన్ ని ర్దేశిత మార్గాలకు భిన్నంగా ప్రత్యామ్నాయ మార్గాలను వాణిజ్య నౌకలకు అమెరికా సూచిస్తోంది. తను కాదన, వేరే మార్గాలలో నౌకలు ప్రయాణం చేస్తే దాడులు తప్పవని, ఆ నౌకలకు ఎంత మాత్రం రక్షణ ఉండదని ఇరాన్ ఐఆర్‌జిసి హెచ్చరిక చేస్తున్నది. ఈ వివాదం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన కొద్ది గంటలకే అమెరికా మూడో విడత భారీస్థాయిలో ఇరాన్‌పై దాడులు చేసింది.

## అమెరికా సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఆకస్మిక మృతి

**వాషింగ్టన్:** అమెరికా కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సీనియర్ సెనేటర్, అధ్యక్షుడు ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం ఆకస్మికంగా మరణించారు. ఆయన వయసు 71 సంవత్సరాలు. కొద్దిపాటి ఆకస్మిక అనారోగ్యం కారణంగా మరణించినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. సౌత్ కరోలినాకు చెందిన రాజకీయవేత్త లిండ్సే 2002లో మొదటిసారి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. విదేశాంగ విధానంపై ఆయన చాలా శక్తిమంతంగా తన వాదనలను వినిపించేవారు. గ్రాహం లిండ్సే మొదట్లో ట్రంప్‌తో విభేదించారు. 2015లో ఆయన సిఎన్‌ఎన్‌తో మాట్లాడుతూ, ట్రంప్ జాతి విద్వేషాన్ని రెచ్చగొట్టే, విదేశీయులను ద్వేషించే మత ఛాందసవాది అని ఘాటుగా విమర్శించారు. ట్రంప్‌ను అధ్యక్ష పదవి అభ్యర్థిగా నామినేట్ చేస్తే మనం నాశనమైపోతాం అని కూడా ఆయన 2016లో లిండ్సే సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. తర్వాత మిత్రుడయ్యారు. గడచిన శుక్రవారం ఆయన ఉక్రేన్‌లో పర్యటించారు. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. దేశానికి తిరిగి వచ్చాక కూడా ఆయనలో ఎలాంటి అనారోగ్య సమస్యలూ కనిపించలేదు. తర్వాత ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణం పట్ల ట్రంప్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. లిండ్సే నిజమైన దేశభక్తుడని అభివర్ణించారు.

## అణుబాంబులకంటే హోర్ముజ్ జలసంధే ముఖ్యం

### మొజ్తాబా ఖమేనీ సలహాదారు రెజాయి



**టెహ్రాన్:** డజన్లకొద్దీ అణుబాంబుల కంటే హోర్ము జ్ జలసంధే ఇరాన్‌కు ఎంతో ముఖ్యమైనదని, దా నిని కాపాడుకుంటామని ఆ దేశ సర్వాధినేత మొ జ్తాబా ఖమేనీ సలహాదారుడు మొహ్సెన్ రెజాయి ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని ఇరాన్ ప్రకటించగా, అమెరికా తిరస్కరించిం ది. ఈ నేపథ్యంలో రెజాయి ప్రకటన విడుదలైం ది. ఈ ప్రకటనల పోరుతో యుద్ధం ఎటువెళుతు ంది? ఎంఓయు ఒప్పందం భవిష్యత్తు ఏమిటి? అ నే ప్రశ్నలు యావత్ ప్రపంచాన్ని వేధిస్తున్న తరుణంలో అమెరికా–ఇరాన్ మధ్య తుది ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధనకు హోర్ముజ్ జలసంధి పెద్ద అడ్డంకిగా మారింది. కాగా, ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లిందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్, అమెరికాతో శాంతి చర్చల్లో ప్రధాన అనుసంధానకర్త మొహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ అమెరికాకు మరోసారి హెచ్చరిక చేశారు.''మేం మీకు ముందుగానే చెప్పాం, మీరు ఇచ్చినమాట నిలబెట్టుకోండి, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోండి, వాస్తవిక పరిస్థితులు ఇప్పుడు మీ తలుపు తడుతున్నాయి, శత్రువులకు శిక్ష తప్పదు'' అని సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. దీనిపై అమెరికా కూడా ఘాటుగా స్పం దించింది. ''ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది, దానికి ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది'' అని అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్టి ంగ్ రాశారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రాదేశిక జలాల ను తప్పించుకుని వెళ్ళేందుకు ప్రత్యామ్నాయ మా ర్గంలో వెళుతున్న మూడు చమురు ట్యాంకర్లపై ఇరాన్ దాడులు చేసి ఒప్పందాన్ని ఉల్లంఘించడంవల్లే గడచిన ఐదురోజుల్లో మూడు విడతలుగా దాడులు చేసినట్లు పేర్కొన్నారు.కాగా గల్ఫ్ అరబ్ దేశాలపై ఆదివారం ఇరాన్ చేసిన దాడులను మధ్యవర్తిదేశం ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఖ తార్ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి ఎదురు దాడులు చేసే హక్కు కూడా తమకు ఉం దని హెచ్చరించింది.

## హసీనా దేశంలో కాలుపెట్టగానే అరెస్ట్ చేస్తాం

### కోర్టులో లొంగుబాటు సాధ్యంకాదు

### వీలైతే దౌత్యమార్గంలో అరెస్టుచేసి తీసుకొస్తాం

### ట్రిబ్యునల్ ప్రాసిక్యూటర్ ఇస్లాం ప్రకటన



**ఢాకా:** అంతర్జాతీయ నేరస్థుల ఒప్పందంలో భాగంగా షేక్ హసీనా (పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి)కు లొంగిపోయే అవకాశం లేదని, ఆమె దేశంలోకి అడుగుపెట్టగానే అరెస్టు చేసి జైలులో బంధిస్తామని, తదుపరి విచారణ కొనసాగుతుందని ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ప్రధాన ప్రాసిక్యూటర్ అమీనుల్ ఇస్లాం చెప్పారు. తాను బంగ్లాదేశ్ వెళతానని, చావుకు భయపడబోనని, ఈ ఏడాది డిసెంబరులోపు తన జన్మభూమికి తిరిగి వెళతానని భారత్‌లో తలచుకుంటున్న షేక్ హసీనా ఇటీవల రెండుసార్లు ప్రకటనలు చేసిన పూర్వరంగంలో ట్రిబ్యునల్ ప్రాసిక్యూటర్ ఇస్లాం ఆదివారం మీడియా సమావేశంలో పైవిధంగా స్పందించారు. ''ఆమె ప్రస్తుతం భారత ప్రభుత్వ నియంత్రణలో ప్రవాసంలో ఉన్నారు, కానీ ఆమె ఇప్పుడు తన ఇష్టానుసారం ఒక సాధారణ పౌరురాలు హోదాలో దేశానికి తిరిగి రాలేరు, లొంగిపోయేందుకు వీలుకాదు,వెంటనే అరెస్టు చేస్తాం'' అన్నారు. గడచిన గురువారం షేక్‌హసీనా అవామీ లీగ్ నాయకులతో టెలిఫోన్‌లో గంటసేపు మాట్లాడారు. తాను దేశానికి వస్తానని, కోర్టులో లొంగిపోతానని చెప్పారు. బంగ్లాదేశ్‌లో 2024 జులైలో జరిగిన చరిత్రాత్మక తిరుగుబాటు తర్వాత ఆమె ప్రత్యేక విమానంలో భారత్‌కు వెళ్ళి అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల రాయిటర్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ఆమె స్వదేశానికి వెళ్ళిపోతానని చెప్పారు.
దీనిపై ఇస్లాం స్పందిస్తూ,షేక్ హసీనా తన పార్టీ కార్యకర్తలు, నాయకుల కార్యకలాపాల ద్వారా దేశాన్ని అస్థిరపరచేందుకే ఇలాంటి ప్రకటన చేశారన్నారు. ఆమెను తనంతట తానుగా దేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నారని, దీనికి బదులుగా తమ ప్రభుత్వం ఆమెను దౌత్యమార్గాల ద్వారా దేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆమె కోర్టుకు హాజరుకాకపోయినాగానీ, న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. మరణశిక్ష పడిన పరారీలో ఉన్న నేరస్థురాలికి బెయిలు వచ్చే అవకాశం లేదని, ఆమె దేశంలోకి రాగానే అరెస్టు చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.తీర్పు చెప్పిన 30 రోజుల్లో ఆమె లొంగిపోవాల్సి ఉందని, కానీ నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోనందువల్ల అప్పీలు చేసుకునే హక్కును కూడా ఆమె కోల్పోయారని చెప్పా రు. ఆమె ఆస్తులను జప్తు చేయాలని న్యాయస్థానం తీర్పు చెప్పినందువల్ల ఆమె వాటిని అనుభవించే హక్కు లేదన్నారు. 2024 తిరుగుబాటు సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిణ అణచివేత నేరాలు సహా ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న పది ప్రధాన కేసుల దర్యాప్తు కూడా తుదిదశకు వచ్చిందని చెప్పారు.

## ఏడిపిస్తున్న ఎల్‌నినో

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎకరాల్లో (అంటే కేవలం 6.40 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో నీరు లేక వేసిన నారుమడులు ఎండిపోతున్నాయి. మరోవైపు తొలకరి జల్లులు చూసి రైతులు ముందస్తుగా వేసిన పత్తి, మొక్కజొన్న, కంది వంటి అరుతడి పంటల మొలకలు ఎండ తీవ్రతకు, తేమ లేక ఎండి పోతున్నాయి. దీంతో చాలా మంది రైతులు విత్తనాలు మొలకెత్తక రెండు, మూడు సార్లు విత్తనాలు వేయాల్సి రావడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చాలా గ్రామాల్లో పశువులకు పచ్చిమేత దొరకడం కూడా గగనమైపోయింది.

**వట్టి పోతున్న సాగునీటి ప్రాజెక్టు**

ఎల్‌నినో దెబ్బకు వర్షాలు లేకపోవడంతో కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులు వట్టిపోతున్నాయి.రెండు ప్రధాన బేసిన్లలో సాధారణంగా ఈ సమయానికి రిజర్వాయర్లలో 522.31 టిఎంసిల నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 333.34 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో అధిక శాతం వ్యవసాయం బోరు బావులపై ఆధారపడి ఉండగా, వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు భారీగా క్షీణించాయి. వ్యవసాయ బోర్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు 1000 అడుగులు వేసినా చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది. వర్షకాలంలో ఈ పరిస్థితి ఉంటే రబీ సీజన్‌లో ఎలా ఉండనుందోనని అందోళన చెందుతున్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏ ప్రాజెక్టులోనూ నీరు లేదు**

వర్షం కాలం సగం ముగిసిన సరైన వర్షం కురవక పోవడంతో జలవనరులు వట్టిపోతున్నాయి. నాగార్జున సాగర్ పరివాహక ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలలో కొద్ది కొద్దిగా నీరు కనపడుతుంది తప్ప మిగిలిన ప్రాంతాల్లో జలవనరులు ఎండిన బీళ్లను తలపిస్తున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులలో కూడా నీరు లేదు. రెండు రోజుల నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా మధ్యతరహా ప్రాజెక్టులోకి గోదావరి నీరు చేరుతుంది. ఎన్ని రోజులకు వైరా చెరువు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుతుందో స్పష్టత లేదు. వైరా, పాలేరు, లంకా సాగర్ మొదలైన మధ్యతరహా ప్రాజెక్టులను మినహాయిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రాజెక్టులోనూ నీరు లేదు. వర్షాలు లేక పోవడంతో సాగునీటిని అందించడం సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జీవనది లాంటి మున్నేరుకు ఇంత వరకు కొత్త నీరు రాకపోవడంతో నీటి కదలిక లేదు. వైరా, కిన్నెరసాని, కట్టలేరు, పెద్దవాగు, ముక మామిడి మొదలైన ప్రాజెక్టుల క్రింద ఉన్న లక్షలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

**శాపమైన జాప్యం :** సాగునీట ప్రాజెక్టుల పట్ల పాలకుల నిర్లక్ష్యం రైతాంగానికి శాపంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పంటల భూములకు సాగునీటిని అందించేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు కానీ ఎకరానికి కూడా నీటిని అందించ లేదు. ప్రతి ఏడాది సుమారు 750 టిఎంసిల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి. గోదావరి నీటిని పొలాలకు మళ్లించాలన్న సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2004లో జలయజ్ఞం ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోసేందుకు రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ల పేరుతో రెండు ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2,100 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్ మరణం, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత 2016లో సీతారామ ప్రాజెక్టు పేరుతో గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2019 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టుకు బిఆర్‌ఎస్ తొమ్మిదివేల కోట్లు ఖర్చు చేసింది. ప్రధాన కాలువల్లో అధిక భాగం పంపు హౌజ్‌లు పూర్తి చేశారు. కాంగ్రెస్ సీతారామను కాదనకపోయినా సరిపడ నిధులు కేటాయించకపోవడంతో అంచనాలు పెరిగి ఎప్పటికీ పూర్తవుతుందో చెప్పలేని స్థితి. ఎల్‌నినోలో కూడా గోదావరికి కొత్త నీరు చేరుతుందన్న సందర్భంలో ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండేది కాదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యమే ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం పాలిట శాపంగా మారి ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## 22 కొత్త రేడియల్ రోడ్‌లు

(మొదటి పేజీ తరువాయి)



ట్రాఫిక్ రద్దీ, నగర విస్తరణ, శివారు ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న నివాస, పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ రేడియల్ రోడ్లను ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా నగర కేంద్రం నుంచి శివారు ప్రాంతాలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు జాతీయ, రాష్ట్ర రహదారుల మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడనుంది. ప్రతిపాదిత రహదారులు పటాన్‌చెరు, శంషాబాద్, షామీర్‌పేట్, ఘట్‌కేసర్, యాచారం, చేవెళ్ల, మెడ్చల్, కీసర, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలను కలుపుతూ అభివృద్ధి చేయనున్నట్లు ప్రణాళికలో పొందుపర్చారు. ఆయా మార్గాల ప్రాధాన్యాన్ని బట్టి 24 మీటర్ల నుంచి 60 మీటర్ల వరకు వెడల్పు నిర్ణయించారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన ఈ రహదారులు అమల్లోకి వస్తే నగర పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ప్రతిపాదిత రహదారుల పరిధిలోకి వచ్చే భూములు, నిర్మాణాలపై భవిష్యత్‌లో ప్రణాళికా నిబంధనలు వర్తించే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల భూ యజమానుల్లో ఆసక్తి నెలకొంది. హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్‌కు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించిన అనంతరం తుది రూపు ఇవ్వనున్నారు. అనంతరం దశలవారీగా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. నగర భవిష్యత్ రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో ఈ 22 రేడియల్ రోడ్లు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు అంటున్నారు.

**భూసేకరణ, ఆస్తుల నష్టపరిహారానికి ప్రాధాన్యత**

రోడ్ల విస్తరణలో భాగంగా భూములు, ఆస్తులు కోల్పోయే బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. నష్టపరిహారం చెల్లింపు, పునరావాస చర్యలు సజావుగా సాగేలా ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయనున్నాయి. రహదారుల నిర్మాణంతో పాటు ఫుట్‌పాత్‌లు, సైనేజీలు, డ్రైనేజీ వ్యవస్థలను ఈ ప్రతిపాదనల్లో చేర్చారు.
భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా 'హైమొబిలిటీ' కారిడార్లు గచ్చిబౌలి, కోకాపేట, శంషాబాద్, మేడ్చల్ వంటి కీలక వృద్ధి కేంద్రాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ 22 రహదారుల విస్తరణ పూర్తయితే, రాబోయే రెండు దశాబ్దాల పాటు మహానగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందని హెచ్‌ఎండిఏ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ మార్గాలను 'గ్రీన్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' కనెక్టివిటీకి లైఫ్‌లైన్‌గా మార్చనున్నారు.

### విస్తరించనున్న 22 ప్రధాన రహదారులు..

| రోడ్డు మార్గం | కారిడార్ | ప్రతిపాదిత వెడల్పు |
|---|---|---|
| పీర్జాదిగూడ టీజంక్షన్ | బోడుప్పల్ టీజంక్షన్ | 30 నుండి 45 మీటర్లు |
| ఉప్పల్ ఖల్సా ఘట్‌కేసర్ ఖల్సా | (పీర్జాదిగూడ, మేడిపల్లి మీదుగా) | 60 మీటర్లు |
| చెంగిచెర్ల ఎక్స్ రోడ్డు | (ఉప్పల్) చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా | 12 నుండి 24 మీటర్లు |
| గుండ్లపోచంపల్లి ఖల్సా | కండ్లకోయ, దూలపల్లి, ఘట్‌కేసర్ | 60 మీటర్లు |
| బాచుపల్లి నిజాంపేట్ | ప్రగతి నగర్ ఖల్సా | 30 మీటర్లు |
| మియాపూర్ జంక్షన్ | అమీన్పూర్ సుల్తాన్‌పూర్ ఔటర్ రింగ్ రోడ్డు | 30 నుండి 36 మీటర్లు |
| తెల్లాపూర్ గచ్చిబౌలి | నార్సింగి | 24 నుండి 60 మీటర్లు |
| కోకాపేట ఖల్సా | నార్సింగి మంచిరేవుల | 60 మీటర్లు |
| నార్సింగి విలేజ్ టీజంక్షన్ | మంచిరేవుల | 45 మీటర్లు |
| ఇబ్రహీంపట్నం ఖల్సా | ఔటర్ రింగ్ రోడ్డు టీజంక్షన్ | 35 నుండి 60 మీటర్లు |
| గచ్చిబౌలి | నార్సింగి, కోకాపేట | 60 మీటర్లు |
| షేక్‌పేట్, మణికొండ బౌండరీ | పుప్పాలగూడ మీదుగా నార్సింగి | 60 మీటర్లు |
| కిస్మత్‌పూర్ | బండ్లగూడ జాగీర్, చేవెళ్ల హైవే | 60 మీటర్లు |
| బుద్వేల్ విలేజ్ ఖల్సా (రాజేంద్రనగర్) | కిస్మత్‌పూర్ | 24 మీటర్లు |
| అప్పా జంక్షన్ హిమాయత్ సాగర్ | మొయినాబాద్ బౌండరీ | 24 మీటర్లు |
| శంషాబాద్ ఖల్సా | ఆదిభట్ల ఔటర్ రింగ్ రోడ్డు | 36 మీటర్లు |
| తూంకుంట | ఎన్‌హెచ్44 కారిడార్ | 24 మీటర్లు |
| ఎన్‌హెచ్44 | కొంపల్లి రోడ్డు నెట్‌వర్క్ | 24 మీటర్లు |
| మేడ్చల్ ఖల్సా | ఔటర్ రింగ్ రోడ్డు | 24 మీటర్లు |
| పెద్ద అంబర్‌పేట్ | పసుమాముల బౌండరీ | 30 మీటర్లు |
| మహేశ్వరం రోడ్డు | శ్రీశైలం హైవే | 30 మీటర్లు |
| బొంగుళూరు టీజంక్షన్ | కొంగర కలాన్ | 30 మీటర్లు |

## ఇరాన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసిందని, దీంతో మంటలు చెలరేగి నౌక స్తంభించిపోయిందని సెంట్‌కామ్ ఆదివారం ప్రకటించింది. ఈ ఘటన తర్వాత పై వర్గాల ఆదేశాల మేరకు సిబ్బంది నౌకను విడిచిపెట్టి లైఫ్‌బోటులోకి చేరారని, ప్రస్తుతం వారు లైఫ్‌బోటులోనే ఉన్నారని తెలియజేసింది. ఈ దాడి ఒమన్ తీరానికి పది కిలోమీటర్ల దూరంలో జరిగిందని బ్రిటన్ సముద్రయాన సంస్థ యుకెఎంటిఓ వర్గాలు తెలియజేశాయి. జులై ఏడో తేదీన ఖమేనీ అంతిమయాత్ర కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తుది ఒప్పందానికి రాకపోతే 'తమ పని పూర్తి చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించడంతో ఆ సాయంత్రం దాటిన తర్వాత హోర్ముజ్ జలసంధిలో మూడు అమెరికా చమురు ట్యాంకర్లపై ఐఆర్‌జిసి దాడులు చేసింది. దీంతో బుధవారం ఉదయమే అమెరికా యుద్ధం ప్రారంభించింది. కాల్పుల విరమణ రద్దుచేశామని ప్రకటించింది. దీనికి ప్రతిగా హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించి, అమెరికా స్థావరాలపై దాడులు ప్రారంభించింది. ఈ దాడుల్లో భాగంగా అమెరికా ఆదివారం తెల్లవారకముందే ముడోవిడత భీకరంగా గగనతల దాడులు కొనసాగించింది. మొత్తం 140 లక్ష్యాలపై దాడులు చేసినట్లు సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. మూడు విడతలుగా 315కు పైగా ఇరాన్ లక్ష్యాలను దెబ్బతీశామని పేర్కొంది. ఇరాన్‌లోని ఎనిమిది నగరాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి.ప్రధానంగా ఇరాన్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్,తీర ప్రాంతంలో ఉన్న స్థావరాలు,గస్తీ,నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు కొనసాగించింది. ఇంతకుముందు రెండు విడతల దాడులకంటే తీవ్రంగా క్షిపణి,డ్రోన్, ప్రయోగస్థావరాలు, మందుగుండు సామాగ్రి నిల్వ కేంద్రాలు,సమాచార ప్రసార పరికరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు పేర్కొంది. దక్షిణ ఇరాన్ రాష్ట్రం,టెహ్రాన్ సమీప ప్రాంతాలు సహా ఇరాన్ వ్యాప్తంగా పలుచోట్ల దాడులు జరిగాయి. దీంతో ఇరాన్ కూడా బహ్రైన్, కువైట్, ఖతార్, ఒమన్, జోర్డాన్ సహా పలు గల్ఫ్ అరబ్ దేశాలలో అమెరికా సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై దాడులు కొనసాగించినట్లు ఇరాన్ ఐఆర్‌జిసి ప్రకటన చేసింది.

ఖతార్, బహ్రైన్, ఒమన్‌లలో ఇరాన్ దాడులు చేసింది. ఒమన్‌పోర్టుపై భారీస్థాయిలో దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడులతో గల్ఫ్ అరబ్ దేశాలలో సర్వత్రా క్షిపణి,డ్రోన్ హెచ్చరికల మోత మోగింది. ఇరాన్ నుండి వస్తున్న కాల్పులను తాము అడ్డుకున్నామని, పొరుగున ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో కాల్పుల శబ్దాలు, పేలుడు శబ్దాలు వినిపించాయని ఖతార్ సైన్యం ప్రకటించింది. పేలుళ్ళు అడ్డుకునే క్రమంలో ఒక చిన్నారి సహా ముగ్గురు గాయపడ్డారని ఖతార్ హోంమంత్రి చెప్పారు. యుఎఇ సరిహద్దుల్లోకి క్షిపణులు ప్రవేశించలేదని, కానీ అప్రమత్తంగా సైరన్లు మోగించామని యుఎఇ ప్రకటించింది. గడచిన మే నెలలో యుఎఇలో ఇరాన్ తుది దాడులు జరిగాయి. జోర్డాన్ సహా పలు దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని ఖతార్ విదేశీమంత్రిత్వ శాఖ విమర్శించింది. ఈ దాడులపై ప్రతిస్పందించడానికి, సార్వభౌమాధికార భద్రత రక్షణకు తమకు పూర్తి హక్కులున్నాయని హెచ్చరించింది. ఈ దాడులను ప్రమాదకర ఉద్రిక్త పరిస్థితిగా అభివర్ణించింది.

## భారత్ ఖండన

(మొదటి పేజీ తరువాయి)



జలసంధి ప్రాంతంలో వాణిజ్య నౌకలు,పౌర సదుపాయాలను లక్ష్యాలుగా చేసుకుని ఎలాంటి దాడులు జరగకుండా చూడాలని, ఈ దాడులను తక్షణం నిలిపివేయాలని కోరింది. హోర్ముజ్ జలసంధిలోని ప్రధాన రవాణా మార్గం లోంచి ప్రయాణం చేస్తున్న సమయంలో సైప్రస్‌జెండాతో వెళుతున్న కంటైనర్ నౌక జిఎఫ్‌ఎస్ గెలాక్సీపై ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కోర్ సైనికులు అత్యంత క్రూరంగా దాడిచేశారని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు ఎక్స్ వేదికగా ఆదివారం ఉదయం ప్రకటించారు. ఈ దాడిలో నౌక ఇంజిన్ రూమ్ మంటల్లో దగ్ధమైందని, నావికుల సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యారని ప్రకటించింది. పదిమంది సిబ్బంది సురక్షితంగా లైఫ్‌బోటులోకి ఎక్కారని కూడా పేర్కొంది. అదేవిధంగా బ్రిటన్‌కు చెందిన సముద్ర వాణిజ్య కార్యకలాపాల సంస్థ (యుకెఎంటిఓ) మరో ప్రకటన చేస్తూ, జిఎఫ్‌ఎస్ గెలాక్సీ నౌకను ఆదివారం తెల్లవారుజామునే ఇరాన్ సైనికులు లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారిన, దీనివల్ల నౌక ఇంజన్ రూములో మంటలు చెలరేగాయని పేర్కొంది. భారత విదేశీ మంత్రిత్వశాఖ తన ప్రకటనలో పదిమంది భారతీయులను కాపాడామని, వారు సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. ఒమన్ దేశాధికారులతో తాము ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమన్వయంతో వ్యవహరిస్తున్నామని, వారి భద్రతకు జాగ్రత్తలు చేపట్టామని పేర్కొంది. తక్షణం ఉద్రిక్తతలకు స్వస్తిచెప్పాలని పునరుద్ఘాటిస్తున్నాం,శాంతి,స్థిరత్వాలను ఈ ప్రాంతంలో నెలకొల్పాలి'' అని పేర్కొంది. ఈ ప్రాంతంలో పౌర సదుపాయాలపై దాడులు నిలిపివేయాలి, నౌకాయాన స్వేచ్ఛ కొనసాగాలి,అంతర్జాతీయ చట్టాలను బలంగా అమలు చేయాలి అని కోరింది. మరోవైపు సెంట్‌కామ్ కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ, హోర్ముజ్‌లో శాంతి కాపాడేందుకు అమెరికా ప్రభుత్వం ఎంతో ఖర్చుచేస్తోందని,పౌర సదుపాయాలు,వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తూ ఈ ప్రాంతంలో స్థిరత్వం లేకుండా చేస్తోందని విమర్శించింది. గడచిన మంగళవారం(జులై 7) సాయంత్రం హోర్ముజ్ జలసంధిలో మూడు చమురు నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో ఆ మరునాటి నుండే అమెరికా దాడులు ప్రారంభించింది. బుధవారం ఇరాన్‌లోని 85 లక్ష్యాలపైన,గురువారం 90 లక్ష్యాలపైనా దాడులు చేసిన అమెరికా ఆదివారం మూడో విడత 140 లక్ష్యాలపై దాడులు చేసింది. ఇరాన్ డ్రోన్,క్షిపణి స్థావరాలు,యుద్ధ సామాగ్రి నిల్వకేంద్రాలపై ఈ దాడులు జరిగాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్‌వ్యాప్తంగా న్,కువైట్,జోర్డాన్,ఖతార్,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌దేశాలలో అమెరికా స్థావరాలపై దాడులు చేసింది

## సోనమ్ ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

సిజెపి పేర్కొంది. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్‌కు అనుబంధంగా ఉన్న 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్' (ఎఐఎస్‌ఎ) సభ్యులు నేహా, మనీష్, దీపక్ కుమార్ వర్మ, అమీన్ నిరసన స్థలంలోని వేరొక వేదికపై తమ నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు. కాగా, పరీక్షల అవకతవకల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిజెపి డిమాండ్ చేస్తోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభ రోజైన ఈనెల 20న పార్లమెంటుకు శాంతియుత ర్యాలీని కూడా ఆ సంస్థ ప్రకటించింది.

# టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్!



యస్తిక చిరస్మరణీయ శతకం

రెండో రోజే లార్డ్స్ టెస్టులో పట్టుబిగించిన భారత జట్టు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. యస్తికా భాటియా (113) చిరస్మరణీయ శతకంతో చెలరేగగా.. స్మృతి మంధాన(70), రీచా ఘోష్(50 నాటౌట్)లు అర్ధ శతకాలతో భారీ స్కోరందించారు. తొలి టెస్టు సెంచరీ కొట్టిన యస్తిక ఔటయ్యాక.. దూకుడుగా ఆడిన రీచా.. ఫిఫ్టీ పూర్తి చేసుకోగానే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 341/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్‌కు 457 పరుగుల కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఏకైక టెస్టులో భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. చరిత్రాత్మక మ్యాచులో టాపార్డర్ మెరుపులతో ఇంగ్లండ్కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ప్రత్యర్థిని 170కే పడగొట్టిన భారత్. రెండో ఇన్నింగ్స్‌లో రెచ్చిపోయింది. మూడోరోజు తొలి సెషన్‌లో యస్తికా భాటియా (113) సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలి శతకంతో మెరిసింది.

**250-4తో లంచ్‌కు**

మంధాన, భాటియా మెరుపులతో టీమిండియా ఆధిక్యం మూడొందలు దాటింది. అయితే.. మంధాన జెమీమా రోడ్రిగ్స్(3)లను ఔట్ చేసిన లారెన్ బెల్(2–27) ఆతిథ్య జట్టుకు బ్రేకిచ్చింది. కాసేపటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(16)ను ఎకిల్‌స్టోన్ (5–118) ఎల్బీగా వెనక్కి పంపింది. టపటపా మూడు వికెట్లు పడడంతో యస్తిక, దీప్తి శర్మ(10) లు ఆచితూచి ఆడారు. దాంతో, 250–4తో లంచ్‌కు వెళ్లింది టీమిండియా. అప్పటికి 91 పరుగులతో ఉన్న యస్తికా.. ఇసీ వాంగ్ ఓవర్‌లో సింగిల్‌తో టెస్టుల్లో మొదటిసారి మూడంకెల స్కోరందుకుంది. క్రీజునంటుకున్న దీప్తి, యస్తికలను వెనక్కి పంపిన ఎకిల్‌స్టోన్.. స్నేహ్ రానా(1)ను ఔట్ చేసి ఐదో వికెట్ సాధించింది. అనంతరం రీచా ఘోష్(52 నాటౌట్), సయాలీ సత్ఘరే(18 నాటౌట్)లు దూకుడుగా ఆడారు. 52 బంతుల్లో రీచా అర్ధ శతకం పూర్తి చేసుకోగానే కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ బాల్కనీ నుంచి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 115 పరుగుల ఆధిక్యం.. రెండో ఇన్నింగ్స్‌లో 341 రన్స్ కలిపి.. ప్రత్యర్థికి 457 రన్స్ లక్ష్యంగా భారత్ నిర్దేశించింది.



# ఇంగ్లండ్ కోచ్ పదవికి మెక్కల్లమ్ రాజీనామా!



ఇంగ్లండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్కల్లమ్ ఆదివారం తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. కెప్టెన్‌గా బెన్ స్టోక్స్ వైదొలగడంతో.. 'ఇక నేను ఉండి ఏం లాభం' అనుకున్నాడేమో తాను కూడా ఇంగ్లండ్, వేల్స్ బోర్డుకు టాటా చెప్పేశాడు. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు మధ్యలోనే బెన్ స్టోక్స్ రిటైర్‌మెంట్ అనంతరం తదుపరి హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్కల్లమ్ రాజీనామానే బాకీ అనుకున్నారంతా. అందరూ ఊహించినట్టే విమర్శకులకు మరింతగా తిట్టిపోసే అవకాశమివ్వకుండా మెక్కల్లమ్ వైదొలిగాడు. 'బజ్ బాల్' ఆటతో టెస్టులకు కొత్త రూపునిచ్చిన మెక్కల్లమ్‌ను ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాడ్ చేతిలో 12తో సిరీస్ కోల్పోవడం వంటివి బాధించాయి. విఫల కోచ్‌గా ఉండడం కంటే బాధ్యతల నుంచి తప్పుకోవడమే సరైందని అతడు భావించాడు. ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆదివారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

**2022లో బాధ్యతలు..** న్యూజిలాండ్ ఓపెనర్‌గా మెక్కల్లమ్ ఎన్నో విధ్వంసక ఇన్నింగ్సులు ఆడాడు. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లోనే శతకం బాదిన అతను 2022లో క్రిస్ సిల్వర్వుడ్ అనంతరం ఇంగ్లండ్ ప్రధాన కోచ్గా బాధ్యతలు చేపట్టాడు. ఆ సమయానికి ఆ జట్టు టెస్టుల్లో వరుస ఓటములను చవిచూస్తోంది. అలాంటి జట్టును ఒక్క ఏడాదిలోనే మెక్కల్లమ్ మార్చేశాడు. తన స్టయిల్ విధ్వంసక ఆటను జట్టుకు ఒంటబట్టించాడు. స్ట్రోక్ ప్లేతో అలరించే బెన్ స్టోక్స్ కెప్టెన్ అయ్యాక అతడి పని మరింత సులువైంది. మెక్కల్లమ్‌ను అభిమానులు ముద్దుగా 'బాజ్' అని పిలుస్తారు. దాంతో, అతను నేర్పిన ఆటకు 'బజ్‌బాల్' అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. గత ఏడాది నుంచి ఇంగ్లండ్ టెస్టుల్లో అదరగొడుతోంది. పాకిస్థాన్ పర్యటనలో స్టోక్స్ సేన మూడు టెస్టులు నెగ్గి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత స్వదేశంలో ఐర్లాండ్‌తో జరిగిన ఏకైక టెస్టులోనూ సంచలన విజయం సాధించింది.

## ఆరోగ్యం

### యవ్వనంలోనే హైబిపి..

● ముందస్తు పరీక్షలే రక్షణ కవచం

భారతదేశంలో ఒకప్పుడు కేవలం వృద్ధులలో మాత్రమే కనిపించే రక్తపోటు (హైపర్ టెన్షన్) సమస్య, ఇప్పుడు యువతలో వేగంగా పెరుగుతోంది. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి, జంక్ ఫుడ్స్ అలవాటు వంటి జీవన శైలి మార్పులే దీనికి ప్రధాన కారణాలని గుండె వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి ఎన్‌ఎఫ్‌హెచ్ఎస్–6 గణాంకాల ప్రకారం.. దేశంలో 15 ఏళ్లు పైబడిన వారిలో 19.4 శాతం మహిళలు, 22.1 శాతం పురుషులు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. హైబిపికి ప్రాథమికంగా ఎలాంటి లక్షణాలు ఉండవు. అందుకే దీనిని 'సైలెంట్ కిల్లర్' అంటారు. ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ అభిప్రాయాన్ని అనుసరించి, పదేళ్ల క్రితం 40 ఏళ్లలోపు వారిలో బిపి అరుదుగా కనిపించేది. కానీ ఇప్పుడు రోజూ చూస్తున్నాం. సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఉద్యోగుల్లో సుదీర్ఘ గంటల కూర్చునే అలవాటు, నిద్రలేమి, ఒత్తిడి వల్ల రక్తనాళాలు చిన్న వయసులోనే బలహీనపడుతున్నాయి. హార్ట్ లంగ్స్ డిసీజెస్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ రాహుల్ చందోలా ప్రకారం.. చాలామంది యువకులు తాము ఆరోగ్యంగా ఉన్నామనే అనుకుంటారు. వేరే ఇతర పరీక్షలు లేదా గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లోనే ఇది బయటపడుతుంది. ఆసుపత్రిలో ఒకసారి చూసే రీడింగ్ కంటే, ఇంట్లోనే డిజిటల్ పరికరాల ద్వారా క్రమంగా బిపిని పర్యవేక్షించడం ఉత్తమం.

భారతీయులలో ఉప్పు వినియోగం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నిర్దేశించిన 5 గ్రాముల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని తగ్గించడం తక్షణ అవసరం. వారానికి కనీసం 150 నిమిషాల వ్యాయామం లేదా నడక తప్పనిసరి. ఆహారంలో పండ్లు, కూరగాయలు పెంచి, ప్రాసెస్ చేసిన ఆహారాలను, ఉప్పును తగ్గించాలి. బరువును అదుపులో ఉంచుకుంటూ, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి. తగినంత నిద్ర, మానసిక ఒత్తిడి నిర్వహణ ముఖ్యం. బిపి అనేది వృద్ధాప్య జబ్బు అనే అపోహ వీడాలి. శరీర బరువు, షుగర్ లెవెల్స్ లాగే రక్తపోటును కూడా క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ వ్యాధుల ముప్పును ముందుగానే అడ్డుకోవచ్చు.




### పెరుగుతున్న కేన్సర్ కేసులు




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2.06 కోట్ల కొత్తకేన్సర్ కేసులు నమోదవుతుండగా, దాదాపు ఒక కోటి మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. రోజుకు సగటున 26 వేల మందికిపైగాకేన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2050 నాటికి ప్రతి ఏడాది నమోదయ్యే కొత్తకేన్సర్ కేసుల సంఖ్య దాదాపు 3.5 కోట్లకు చేరుకుంటుందని డబ్ల్యుహెచ్‌ఒ అంచనా వేసింది. గుండె సంబంధిత వ్యాధుల తర్వాత ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న రెండో ప్రధాన వ్యాధిగా కేన్సర్ కొనసాగుతోంది. డబ్ల్యుహెచ్‌ఒ, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్‌కేన్సర్ సంయుక్తంగా రూపొందించిన 'గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ కేన్సర్–2026' ప్రకారం, అనేక దేశాలు కేన్సర్ నివారణ, అవగాహన, చికిత్స రంగాల్లో కొంత పురోగతి సాధించినప్పటికీ, ధనిక, పేద దేశాల మధ్య ఆరోగ్య సేవలలో తీవ్రమైన అసమానతలు కొనసాగుతున్నాయి. కేన్సర్‌ను ముందుగానే గుర్తించడం, ఖచ్చితమైన నిర్ధారణ, నాణ్యమైన చికిత్స, చికిత్స అనంతర సంరక్షణ వంటి సేవలు ప్రపంచంలోని లక్షలాది మందికి ఇంకా అందుబాటులో లేవు. ఈ అసమానతలకు రొమ్ము కేన్సర్ చికిత్స ఒక స్పష్టమైన ఉదాహరణ. అధిక ఆదాయ దేశాల్లో రొమ్ము కేన్సర్ బారినపడిన మహిళల్లో సుమారు 87 శాతం మంది ఐదేళ్లకు పైగా జీవిస్తుండగా, తక్కువ ఆదాయ దేశాల్లో ఈ శాతం కేవలం 42 మాత్రమే. ప్రపంచ దేశాల్లో మూడింట ఒక వంతు కన్నా తక్కువ దేశాలు మాత్రమే తమ సార్వత్రిక ఆరోగ్య సేవల పథకాలలో కేన్సర్ చికిత్సను పూర్తిగా చేర్చాయి. ఫలితంగా అనేక కుటుంబాలు అవసరమైన వైద్య సేవలను పొందలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేన్సర్ ప్రభావం కేవలం ఆరోగ్యానికే పరిమితం కాదని డబ్ల్యుహెచ్‌ఒ పేర్కొంది. ఈ వ్యాధి కుటుంబాల ఆర్థిక స్థితిని, మానసిక ఆరోగ్యాన్ని, సామాజిక జీవితాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. కేన్సర్ బాధితులపై నిర్వహించిన తొలి ప్రపంచ సర్వేలో కనీసం 45 శాతం మంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. సగానికి పైగా బాధితులు మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను ఎదుర్కొంటుండగా, రోగులను చూసుకునే కుటుంబ సభ్యుల్లో దాదాపు అందరూ ఉచిత సేవలు అందించడం, ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం, సామాజిక ఒంటరితనం వంటి భారాలను అనుభవిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి కేన్సర్ నియంత్రణను సార్వత్రిక ఆరోగ్య సేవలలో భాగంగా చేర్చడం, వైద్య సిబ్బంది సామర్థ్యాన్ని పెంచడం, ప్రజలకు సమానంగా నాణ్యమైన చికిత్స అందించడం, బాధితులకు సామాజిక భద్రత కల్పించడం, ప్రజారోగ్య అవసరాలకు అనుగుణంగా పరిశోధన, సాంకేతికతను అభివృద్ధి చేయడం అత్యవసరమని డబ్ల్యుహెచ్‌ఒ సూచించింది. కేన్సర్ నుంచి ఒక వ్యక్తి ప్రాణాలతో బయటపడతాడా లేదా అనేది అతను ఏ దేశంలో పుట్టాడన్నది లేదా అతని ఆదాయం ఎంత అన్న దానిపై ఆధారపడకూడదని, ప్రపంచ దేశాలు సమిష్టిగా చర్యలు తీసుకుంటే ఈ అసమానతలను గణనీయంగా తగ్గించవచ్చని సంస్థ పిలుపునిచ్చింది.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు




● ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని హక్కుల సాధనే లక్ష్యంగా ఎఐటియుసి నిరంతర పోరాటం చేస్తుందని కనీస వేతనాల బోర్డు మెంబర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల నేపథ్యంలో ఎఐటియుసి 22వ మహాసభలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఆదివారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ఎఐటియుసి 22వ జిల్లా మహాసభలను మొదటి రోజు అట్టహాసంగా ప్రారంభించి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, ఉపప్రధాన కార్యదర్శి నర్సింహ, సుధాకర్, భూమయ్య పాల్గొని కార్మిక నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని మండిపడ్డారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి ప్రకటించి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించేలా ఒత్తిడి తేవటం ఎఐటియుసి ముఖ్య కర్తవ్యమన్నారు. జిల్లాలోని స్థానిక కార్మికులకే మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాడుతామన్నారు. మహాసభలలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్, వివిధ కార్మిక సంఘాల నేతలు, జిల్లా నలుమూలాల నుండి తరలివచ్చిన వందలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేశారు. 22వ జిల్లా మహాసభలలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం

● అంగన్‌వాడీలను కట్టుబానిసల్లా చూస్తున్న ప్రభుత్వం

● చాలీచాలని వేతనాలతో బతుకులు దుర్భరం

● అంగన్‌వాడీల పాదయాత్రను ప్రారంభించిన సాబీర్ పాషా, మేయర్ గణేష్




**ప్రజాపక్షం/భద్రాచలం :** అంగన్‌వాడీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలే శరణ్యమని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో బతుకు భారం ఈడుస్తున్న అంగన్‌వాడీలకు మోయలేని పనిభారం పడుతోందని ప్రభుత్వం వారిని కట్టు బానిసలుగా చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి సచివాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎఐటియుసి అనుబంధ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను పాషా ఆదివారం భద్రాచలంలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్యంవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం ఏఐటియూసి అరుణపతాకాలు చేతబూని అంగన్ వాడీలు, ఏఐటియూసి నాయకులు కదం తొక్కారు. ఎర్రజెండాలతో భద్రాచలం పట్టణంతో పాటు పాదయాత్ర సాగిన దారులు అరుణ వర్ణమయ్యాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో రెడ్డి అరుణ, గోనె మణి అధ్యక్షతన జరిగిన సభలో పాషా మాట్లాడుతూ అంగన్వాడీల సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. వారిపై అదనపు విధులు మోపడం వెట్టి చాకిరీ చేయించడమే అన్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, మరోవైపు అధిక పనిభారంతో అంగన్‌వాడీల జీవితాలను ప్రభుత్వం దుర్భరంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని, ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు గుర్తు చేస్తూనే ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించి పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేదే లేదని పాషా హెచ్చరించారు. అంగన్‌వాడీల పోరాటానికి సిపిఐ, ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు. హక్కులు సాధించే వరకు ఉద్యమ జెండా దించేదే లేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే వేలాది మంది అంగన్‌వాడీలతో సచివాలయాన్ని ముట్టడించి తమ సత్తా చాటుతామని పాషా హెచ్చరించారు. ఐసిడిఎస్‌కు సరిపడా నిధులను ప్రభుత్వం కేటాయించాలని, నెలకు రూ.18వేల వేతన హామీని నిలుపుకోవాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బిఎల్‌ఓ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని, పదవీ విరమణ పొందిన వారి బకాయిలు చెల్లించాలని కోరారు. పాదయాత్రకు దారిపొడవునా ఘన స్వాగతం లభించింది. వివిధ ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలు సంఘీభావం ప్రకటించారు. అరుణపతాకాలు, నినాదాలతో భద్రాచలం వీధులు మార్మోగాయి. అంగన్‌వాడీల ఐక్యతా పోరాట స్ఫూర్తితో పాదయాత్ర ఉత్సాహభరితంగా కొనసాగింది. రెండు రోజుల పాటు సాగే పాదయాత్ర తొలిరోజు భద్రాచలం మీదుగా సారపాక, బూర్గంపాడు మండలాలతో పాటు పాల్వంచ మండలంలోని జగన్నాథపురం వరకు సాగింది. సారపాకలో ఎఐటియుసి కార్మిక సంఘాల నాయకులు హరిప్రసాద్, పోటు రంగారావు, నాగభూషణం తదితరులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. రెండోరోజు పాదయాత్ర సోమవారం జగన్నాథపురంలోని పెద్దమ్మ తల్లి ఆలయం నుండి మొదలై పాల్వంచ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకుంటుంది. కలెక్టరేట్ ముందు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, కార్యదర్శి నండూరి కరుణకుమారి, రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ సీతా మహాలక్ష్మీ, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు శింగు నర్సింహారావు, నరాటి ప్రసాద్, సిపిఐ ఎఐటియుసి మహిళా సమాఖ్య నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మువ్వా వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీ కుమారి, వేల్పుల మల్లికార్జున్, అన్నారపు వెంకటేశ్వర్లు, మీసాల భాస్కర్ రావు, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్వీఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, కంభంమెట్టు శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, రామిరెడ్డి అశోక్, సత్తినేడు సాయిరామ్, రుద్ర బ్రదర్స్, చింతల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి




● ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం

● ఘనంగా ఎఐటియుసి 4వ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, బిల్డింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పైలట్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఎఐటియుసి జిల్లా 4వ మహాసభలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులు మోట పలుకుల రమేష్, అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, బిల్డింగ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, సింగరేణి కాలోరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొరిమి రాజ్‌కుమార్, మహాసభ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలోవారు మాట్లాడారు.

**కేంద్ర విధానాలపై విమర్శలు**

కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా మార్చిందని నాయకులు ఆరోపించారు. ఈ 4 కోడ్‌లు కార్మికులను బానిసలుగా చేస్తాయని, కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమని అన్నారు. సమ్మెను నేరంగా పరిగణించి కార్మికులను జైలుకు పంపే చట్టాలు తెస్తున్నారని దుయ్యబట్టారు. 1920 నుండి కార్మికుల సమస్యలపై సంపూర్ణ అవగాహనతో పోరాడుతున్న సంఘం ఏఐటీయూసీ అని, జిల్లాలోని కార్మికులంతా ఏకమై పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**పెద్ద ఎత్తున కార్మికుల హాజరు**

ఈ మహాసభకు జెన్కో, ఆర్‌టిసి, మున్సిపల్, గ్రామపంచాయతీ, బిల్డింగ్ రంగం, మధ్యాహ్న భోజన కార్మికులు, సింగరేణి వర్కర్స్, కాంట్రాక్ట్ కార్మికులు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, హమాలీ, సివిల్ సప్లై హమాలీ కార్మికులతో పాటు వివిధ రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహాసభలో 14 తీర్మానాలు ఆమోదించారు. 4 లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, కార్మిక హక్కుల పరిరక్షణ తదితర అంశాలు తీర్మానాల్లో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి క్యాతారాజు సతీష్, నాయకులు వెంకటేష్, తాళ్ల పోశం, శీను, సుగుణ, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా సమితి సభ్యులు శ్రీకాంత్, జోసెఫ్, గులాం నబి, పెంట రవి, రాజయ్య పాల్గొన్నారు.

# స్కావెంజర్లకు రూ.26 వేల కనీసవేతనం




● ఎఐటియుసి వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్ డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ :** స్కావెంజర్లకు కనీస వేతనం 26వేలు ఇచ్చి పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు పనాస ప్రసాద్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెర భవన్‌లో పోలేపల్లి అధ్యక్షతన నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలలో పని చేసే పారిశుద్ధ కార్మికుల స్కావెంజర్స్ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పనాస ప్రసాద్ మాట్లాడుతూ కనీస వేతనం 26వేల అందించి స్కావెంజర్లందర్నీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా శ్రమ దోపిడీకి గురి అయ్యి తన రక్తాన్ని చెంటగా మార్చే ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్లందరినీ ఈ రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని తక్షణమే గ్రామ సమైక్య వివోలతోని సంబంధం లేకుంటే నేరుగా స్కావెంజర్ల అకౌంట్లోకి నెలసరి వేతనాలను అందించాలని, నెలకు మూడు రోజులు సెలవులు ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి జాన్ పాల్, స్కావెంజర్స్ సముద్రాల పాపయ్య, కొలకనూరు మేరీ సునీత, కోమల, జగ్రిపోతుల విజయ, అరుణ, రాధమ్మ, లాసాని, రామారావు, ఎండి బాబు, కాసగాని విజయ, మేకల కవిత, పసునూరి సునీత, జ్యోతి, స్వరూప, సహజ్ బేగం, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు

- ఫారం సమర్పించకపోతే జాబితా నుంచి పేరు తొలగింపు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి,



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అర్హత కలిగిన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా విస్తృత చర్యలు చేపట్టాలని,ఫారం సమర్పించకపోతే భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, అన్నారు.ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి తో కలిసి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలోని గుల్మోహర్ పార్క్ కాలనీ,మై హోమ్ మంగళ గేటెడ్ కమ్యూనిటీ,ఎల్‌బి నగర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని శ్రీ సాయిరాం కాలనీ (బిఎన్‌రెడ్డి),సాహెబ్‌నగర్ కళ్యాణ మండపంలను సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు (ఇఆర్‌ఒ లు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు(ఎఇఆర్‌ఒలు), బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఒ లు), సూపర్‌వైజర్లతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఫారాలను పూర్తిగా నింపించి నిర్దేశిత గడువులోగా తిరిగి స్వీకరించేలా విస్తృత ప్రజా అవగాహన కల్పించాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, అందిన ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్ 2026) కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి నిర్దేశిత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌ఒ లు) తప్పనిసరిగా సమర్పించాలని ఫారం సమర్పించని పక్షంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడం, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడమే ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్ 2026) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ,ఆన్‌లైన్ డిజిటైజేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకతతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించేలా సమగ్రంగా ఎన్యూమరేషన్ నిర్వహించాలని సూచించారు.అలాగే,ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR2026) కార్యక్రమాన్ని జిల్లాలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా విస్తృత చర్యలు చేపట్టామని,పంపిణీ చేసిన ఫారాలను పూర్తి వివరాలతో నింపి నిర్దేశిత గడువులోగా సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌ఒ లు) తప్పనిసరిగా సమర్పించాలని ప్రజలను కోరారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని,అందిన ఎన్యూమరేషన్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి డిజిటైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా సమగ్రంగా ఎన్యూమరేషన్ నిర్వహించాలని సూచించారు. అలాగే, ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని పక్షంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో సంబంధిత జోనల్ కమిషనర్లు,ఎన్నికల నమోదు అధికారులు (ఇఆర్‌ఒ లు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఎఇఆర్‌ఒ లు),బూత్ స్థాయి అధికారులు(బిఎల్‌ఒ లు),బిఎల్‌ఒ సూపర్‌వైజర్లు,ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

---

## ఆర్‌అండ్‌బి శాఖను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి కోమటిరెడ్డి

- రూ.76 కోట్లతో నార్కట్‌పల్లి-మునుగోడు రైల్వే ఓవర్‌బ్రిడ్జికి శంకుస్థాపన
- 2028 నాటికి ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేసి నార్కట్‌పల్లి ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** తెలంగాణ ఆర్‌అండ్‌బి శాఖను దేశంలోనే ఆదర్శ శాఖగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి మండల కేంద్రంలో రూ.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నార్కట్‌పల్లి మునుగోడు సేతుబంధు (సీఆర్‌ఐఎఫ్) రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెరుగైన రహదారులు, వంతెనలు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నల్లగొండ జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రహదారులు, సాగునీరు,వ్యవసాయం తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి చేసే జిల్లా నల్లగొండేనని పేర్కొన్న మంత్రి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నార్కట్‌పల్లిమునుగోడు రహదారి అభివృద్ధి పనుల్లో రైతుల భూములకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నార్కట్‌పల్లి మండలంలో రూ.600 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులు, రాష్ట్రవ్యాప్తంగా రూ.4,000 కోట్లతో రహదారుల అభివృద్ధి చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే 2028 నాటికి ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తి చేసి నార్కట్‌పల్లి మండల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజల చిరకాల కోరికగా ఉన్న నార్కట్‌పల్లి మునుగోడు రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంతో ప్రజల రవాణా సమస్యలు పరిష్కారమై ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అన్నారు.ఈ రైల్వే గేటు వద్ద ఏర్పడే ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు మరియు ప్రయాణికులు ఎంతో ప్రయోజనం పొందుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సేతుబంధు సీఆర్‌ఐఎఫ్ చీఫ్ వసంత నాయక్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ శ్రీధర్‌రెడ్డి,ఆర్‌డివో అశోక్‌రెడ్డికాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్, జెర్రిపోతుల భరత్ గౌడ్,శిరిష,గాయం శ్యాంసుందర్ రెడ్డి,పాశం శ్రీనివాస్ రెడ్డి, పబ్బతరెడ్డి వెంకట్ రెడ్డి, పుల్లెంల అచ్చాలు గౌడ్, ఇరుకుల్ల సంపత్, గ్రామ సర్పంచులు, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

## కాళేశ్వరం పునరుద్ధరణలో కాంగ్రెస్ ఘోర వైఫల్యం

### సిఎం రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు బహిరంగ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) 2023 నవంబర్, 2024 మే, 2025 ఏప్రిల్ నెలల్లో వరుసగా నివేదికలు సమర్పించి సాంకేతిక పరీక్షలు, పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్పష్టంగా సూచించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ పాత్ర కేవలం సాంకేతిక మార్గదర్శకత్వానికేనని, పనుల అమలు బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇప్పుడు కేంద్ర కమిటీపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ కమిటీ సమర్పించిన నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో కూడా ప్రభుత్వం హైకోర్టులో సమర్థంగా వాదించలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ రాజీ ధోరణి అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాంచందర్ రావు తన బహిరంగ లేఖలో కోరారు.

---

## దక్షిణ చైనా సముద్రంపై చారిత్రక హక్కులు

- చట్టవిరుద్ధ మధ్యవర్తిత్వ తీర్పు చెల్లుబాటు కాదు
- అమెరికా, యూరప్, ఆసియా దేశాల ప్రకటనకు చైనా ఖండన

**బీజింగ్:** దక్షిణ చైనా సముద్రంపై చైనాకు చారిత్రక హక్కులు ఉన్నాయని చైనా ప్రకటించింది. అమెరికా,బ్రిటన్ సహా పలు దేశాలు సంయుక్తంగా, వేరువేరుగా చేసిన రెండు ప్రకటనలను చైనా విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. 2016లో దక్షిణ చైనా సముద్రంపై ప్రకటించిన మధ్యవర్తిత్వ తీర్పు చెల్లుబాటు కాబోదని స్పష్టం చేసింది. దక్షిణచైనా సముద్రం ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన నౌకా రవాణా మార్గమని, విమాననాయ స్వేచ్ఛ విషయంలో కూడా ఏనాడూ వివాదాలు రాలేదని గుర్తుచేసింది. దక్షిణ చైనా సముద్రంపై తమ ప్రాదేశిక హక్కులను బలంగా కాపాడుకుంటామని ప్రకటించింది. దక్షిణ చైనా ప్రాంతంలో చైనా సార్వభౌమాధికారం, సముద్ర ప్రాదేశిక హక్కులు, ప్రయోజనాలు ఈ చట్టవిరుద్ధమైన తీర్పు ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనే చెక్కుచెదరవని, ఈ తీర్పు ఎలాంటి ప్రభావం తమపై చూపించబోదని చైనా స్పష్టం చేసింది. దక్షిణ చైనా సముద్రంలో ద్వీపాలపై చైనాకు చారిత్రక హక్కులున్నాయని ఉద్ఘాటించింది. ఈ మధ్యవర్తిత్వ తీర్పును చట్టవిరుద్ధమైనదిగా పేర్కొంది. దక్షిణ చైనా సముద్రంపై ఆ దేశం చేస్తున్న విస్తృతమైన వాదనలు 2016 నాటి తీర్పు ప్రకారం చట్టవిరుద్ధమని, తాము తిరస్కరిస్తున్నామని అమెరికా,బ్రిటన్ సహా మరో 12 పాశ్చాత్య–ఆసియా దేశాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. దీనికితోడు 27 యూరప్ దేశాలు కూడా విడిగా మరో ప్రకటన చేశాయి. వివాదాల శాంతియుత పరిష్కారంలో ఈ మధ్యవర్తిత్వ తీర్పు మైలురాయి వంటిదని పేర్కొన్నాయి. ప్రాంతీయ స్థిరత్వానికి చైనా వైఖరి ముప్పు కలిగిస్తోందని, ఈ అస్థిర చర్యలను తాము తిరస్కరిస్తున్నామని ఈ దేశాలు ప్రకటించగా, చైనా కూడా ఈ దేశాలను తీవ్రంగా ప్రతిఘటించి తన హక్కులను పునరుద్ఘాటించింది. ఈ మధ్యవర్తిత్వ తీర్పు వెలువడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 41 దేశాలు విడివిడిగా రెండు ప్రకటనలు చేశాయి. దీనిపై చైనా తీవ్రంగా స్పందించింది. ఐక్యరాజ్యసమితి సముద్ర చట్ట కన్వెన్షన్‌పై హేగ్‌లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ 2016 జులై 12న చైనా హక్కులను తిరస్కరిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును ఆనాడే చైనా వ్యతిరేకించింది.

---

## సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు గుంటూరులో వైసిపి నేత అరెస్ట్

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఓ టీవీ చర్చా కార్యక్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం ప్రకారం, గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయన నివాసానికి వెళ్లిన తెలంగాణ పోలీసులు నాగార్జున యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తదుపరి న్యాయ ప్రక్రియ కోసం తెలంగాణకు తరలించినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని కుటుంబ సభ్యులకు అధికారులు వివరించినట్లు తెలుస్తోంది. వైసిపి వర్గాలు మాత్రం తమ పార్టీ అధికార ప్రతినిధిని తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకెళ్లారని ధృవీకరించాయి. ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

---

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటమి భయం

### - కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని.. రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారని.. ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకుందని.. ఈ పరిస్థితుల్లో జిహెచ్‌ఎంసి ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం లేదని... కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి.. ప్రతి శని, ఆది రెండు రోజులపాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు సికింద్రాబాద్, సనత్‌నగర్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలలో పాదయాత్రలు పూర్తయినట్లు చెప్పారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటిస్తానని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడ, గోల్నాక, అంబర్‌పేట్, బాగ్ అంబర్‌పేట్, నల్లకుంట డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో కేంద్రమంత్రి పార్టీ నాయకులు కార్యకర్తలుతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. పర్యటనలో భాగంగా డివిజన్లోని వివిధ కాలనీలలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానిక కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కాలనీ ప్రముఖులు కలిసి తమ ప్రాంతాల్లో ఉన్న పౌర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి ఇతర స్థానిక ఇబ్బందుల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన ఆయన పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని, కాలనీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాదయాత్ర అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కనీస వసతులు కరువై నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుద్ధ్యం పడకేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాదయాత్రలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్‌రావు, సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడెల్లి అజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు కన్నె ఉమ యాదవ్, అమృత, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## కాళేశ్వరం అంశంపై బిఆర్‌ఎస్ నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాల కారణంగా రాష్ట్రానికి భారీ నష్టం జరిగిందని, దీనిపై మాజీ సిఎం చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) సూచించిన విధంగానే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్‌డిఎస్‌ఎ వద్దకు కలిసి వెళ్లాలన్న ప్రతిపాదనకు హరీశ్‌రావు స్పందించడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడం వల్ల ప్రజాధనానికి భారీ నష్టం వాటిల్లిందని, దీనికి బాధ్యులైన కెసిఆర్, హరీశ్ రావు ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ అంశంపై మాట్లాడాలని అన్నారు. బిజెపి నాయకుడు ఈటల రాజేందర్ అప్పట్లో ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసినందున కాళేశ్వరం వ్యవహారంలో వాస్తవాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, కెసిఆర్, హరీశ్‌రావులను కూడా కేంద్రం వద్దకు తీసుకెళ్లి వాస్తవాలు చెప్పేలా చూడాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యువతను రెచ్చగొట్టే విధంగా బిఆర్‌ఎస్ నాయకత్వం వ్యవహరించిందని, హింసాత్మక రాజకీయాలకు కెసిఆర్ కుటుంబమే కేంద్రబిందువుగా మారిందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ రాజకీయ సంస్కృతి అని, బిఆర్‌ఎస్ రాజకీయ తీరు అందుకు పూర్తి భిన్నమని విమర్శించారు. తుంగతుర్తి పరిస్థితులపై సమీక్ష జరుగుతోంది తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంతర్గత వ్యవహారాలు, అక్కడి పరిస్థితులపై సమీక్ష జరుగుతోందని, అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత నివేదికను పార్టీ అధిష్టానానికి సమర్పిస్తామని జయప్రకాష్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు సహజమేనని, వాటిని పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరిస్తుందని ఆయన చెప్పారు.

---

## వియత్నాం నుండి త్వరలోనే భారత టూరిస్టుల మృతదేహాలు తరలింపు

**హనోయ్:** వియత్నాంలో జరిగిన స్పీడ్ బోటు ప్రమాదంలో మరణించిన 15 మంది భారతదేశ పర్యాటకుల మృతదేహాలను త్వరలో తీసుకువచ్చి వారి బంధువులకు స్వాధీనం చేస్తారు హనోయ్‌లోని భారత దౌత్యకార్యాలయం ఆదివారం ఈ విషయం వెల్లడించింది. మృతదేహాలను స్వాధీనం చేయడానికి కొన్ని అధికారిక,పాలనాపరమైన సాధారణ చర్యలు ఉన్నందువల్ల వాటిని రెండు దేశాలు సత్వరం పూర్తిచేస్తున్నాయని తెలియజేసింది. ఈ చర్యలు పూర్తయిన తర్వాత హోచిమిన్ నుండి ఈ మృతదేహాలను భారత్‌కు తరలిస్తారని తెలియజేసింది. వియత్నాం అధికారులతో చాలా సన్నిహిత సమన్వయంతో వ్యవహరిస్తూ త్వరగా ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. విహారయాత్రకు వెళ్ళి మరణించినవారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నల్లపేట ఆదిశేషయ్య రవితేజ, శ్రీధర్ ముడియం, జయలక్ష్మి గెల్లా ఉన్నారు. అదేవిధంగా తమిళనాడుకు చెందిన పది మంది మరణించినవారిలో ఉండగా కేరళకు చెందిన ఇద్దరు మహిళలు ఉన్నారు. హోన్ మీరుట్ ద్వీపం నుండి ఆన్‌థోయ్ పోర్టుకు ప్రయాణిస్తున్న పడవ సముద్రంలో 400 కి.మీ లోతుకు వెళ్ళిన తర్వాత ఫూ కాక్ ద్వీపం సమీపంలో స్పీడు బోటు తలక్రిందులైంది. వీరంతా లావా మొబైల్ కంపెనీకి చెందిన ఉద్యోగులు. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో సజీవంగా బయటపడిన 17 మందిలో 16 మందికి చికిత్సలు చేసి పంపేశారు. వారంతా భారత్‌కు బయలుదేరారు. ఫూకాక్ అనే ద్వీపం వియత్నాంలో అతి పెద్ద పర్యాటక విహారయాత్రా ప్రదేశం.

---

## రష్యాకు చమురు ఆదాయాలు తగ్గినా దిగుమతుల్లో మనదే రికార్డుః సిఆర్‌ఇఎ నివేదిక

**న్యూఢిల్లీ:** రష్యా నుండి భారత్ జూన్ నెలలో రికార్డుస్థాయిలో ముడి చమురు దిగుమతులు చేసుకుంది. ఒకవైపు రష్యా మొత్తం ఎగుమతుల్లో చమురు ఆదాయాలు గణనీయంగా క్షీణించినప్పటికీ గతనెలలో మనదేశానికి ముడి చమురు దిగుమతులు మే నెలకంటే 34 శాతం మేరకు వృద్ధి సాధించి రికార్డు సృష్టించాయి. సిఆర్‌ఇఎ (ఇంధనం, శుద్ధవాయు పరిశోధనాకేంద్రం) ఈ నివేదికను ఆదివారం ప్రకటించింది. యూరప్ దేశాలు రష్యా నుండి ప్రత్యక్ష చమురు దిగుమతులు తగ్గించుకున్నప్పటికీ, భారత్ నుండి మాత్రం జూన్ నెలలో శుద్ధిచేసిన చమురు ఉత్పత్తులు యూరప్‌కు ఎగుమతయ్యాయి.

జూన్ నెలలో భారతదేశం 4.5 బిలియన్ యూరోల విలువైన రష్యా ముడిచమురు దిగుమతి చేసుకుంది. ఇది మొత్తం 5.5 బిలియన్ల యూరోల విలువైన రష్యా శిలాజ ఇంధన దిగుమతుల్లో 83 శాతంగా నమోదైంది. చైనా తర్వాత రష్యా నుండి హైడ్రోకార్బన్స్‌ను కొనుగోలు చేసే అతిపెద్ద దేశంగా భారత్ నిలిచిందని నివేదిక పేర్కొంది. గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే ఈ ఏడాది జూన్ నెలలో రష్యా నుండి భారత్ మొత్తం ముడిచమురు దిగుమతులు 5.4 శాతానికి పెరిగాయి. దీంతో భారత్‌లో కీలకమైన రిఫైనరీలు మంచి లాభాలు పొందాయి. భారత్ జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఈ సరఫరాలు మే నెల నుండి 150 శాతం పెరిగాయి. అదేసమయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పారదీప్ రిఫైనరీకి కూడా దిగుమతులు 126 శాతం మేరకు పెరిగాయి. కోచీలో ఉన్న బిపిసిఎల్ రిఫైనరీ, నయారాఎనర్జీస్‌కు చెందిన వదినార్ రిఫైనరీలకు కూడా రికార్డుస్థాయిలో దిగుమతులు పెరిగాయి. బిసిసిఎల్ రిఫైనరీకి 83 శాతం, వదినార్ రిఫైనరీకి 45 శాతం దిగుమతులు వృద్ధి చెందాయి. రష్యా నుండి భారతదేశ ముడిచమురు దిగుమతులు భారీగా పెరుగుదల సాధించడంవల్ల రష్యా ముడిచమురు ఎగుమతులు విలువ జూన్ నెలలో 14 శాతం పెరిగింది. గత ఏడాది జూన్ నెలలో రష్యా మొత్తం ఎగుమతుల విలువ ఈ ఏడాది జూన్ నెలలో ఎగుమతులతో పోల్చిచూస్తే ఎనిమిది శాతానికి తగ్గాయి. వీటిని ధనం రూపేణా చూస్తే రోజుకు 348 మిలియన్ యూరోలుగా నమోదైంది.తక్కువ ధరలకు ఈ ఎగుమతులు జరుగుతాయి. రష్యాలో శిలాజ ఇంధనాల ఎగుమతులు ఒకశాతం తగ్గాయి. వీటి విలువ రోజుకు 734 మిలియన్ యూరోలు. ఎగుమతులు విలువ ఏడుశాతం పెరిగినాగానీ ఈ ఆదాయం తగ్గింది. 2026వ సంవత్సరం జూన్ నెలలో భారతదేశం రష్యా నుండి శిలాజ ఇంధనం దిగుమతి చేసుకోవడంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద కొనుగోలుదారు స్థానాన్ని పొందింది. రష్యా నుండి మొత్తం 5.5 బిలియన్ యూరోల హైడ్రోకార్బన్స్‌ను దిగుమతి చేసుకుంది. ఐతే చైనా 7.3 బిలియన్ యూరోల దిగుమతులతో ప్రథమస్థానంలో నిలిచింది.

---

### హైదరాబాద్‌లో విదేశీయులకు సులభంగా ఇండియన్ పాస్‌పోర్టులు?

## అవార్డులు ఒకవైపు... అక్రమ పాస్‌పోర్టుల కలకలం మరోవైపు!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోనే అత్యుత్తమ పాస్‌పోర్టు పోలీసు వెరిఫికేషన్ సేవలు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ పోలీసులకు ఇటీవల కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. డిజిపి సివి ఆనంద్ ఢిల్లీలో ఈ అవార్డును అందుకున్నారు. 202526లో 8.67 లక్షలకు పైగా పాస్‌పోర్టు దరఖాస్తులను 99 శాతం విజయవంతంగా, సగటున 57 రోజుల్లో పరిశీలించినందుకు ఈ గుర్తింపు లభించింది. అయితే, ఈ ప్రశంసల మధ్యే హైదరాబాద్‌లో విదేశీయులు నకిలీ పత్రాలతో భారతీయ పాస్‌పోర్టులు పొందుతున్న ఘటనలు వరుసగా వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వేరువేరు ఘటనలో ముగ్గురు విదేశీయులు భారతీయ పాస్‌పోర్టులతో విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో పట్టుబడ్డారరు. ఇ ఈ ఉదనంతంపై హైదరాబాద్ సిసిఎస్ పోలీస్ లు ధర్యాప్తు చేస్తున్నారు.దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్న కీలక అంశాల్లో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ఫీల్డ్ వెరిఫికేషన్‌లో లోపాలున్నాయా? స్థానిక చిరునామాలు, నివాస ధ్రువీకరణ, పౌరసత్వ వివరాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు ఉన్నాయి. ఇది కొత్త సమస్య కాదు 2021లో వెలుగుచూసిన భారీ నకిలీ పాస్‌పోర్టు రాకెట్‌లో బంగ్లాదేశ్ పౌరులకు ఒకే చిరునామాలతో డజన్ల కొద్దీ భారతీయ పాస్‌పోర్టులు జారీ అయినట్లు దర్యాప్తులో బయటపడింది. ఆ కేసులో పోలీసు సిబ్బందిపై కూడా చర్యలు తీసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల భౌతిక వెరిఫికేషన్ కేవలం పేరుకే జరుగుతోందా?,నకిలీ ఆధార్, ఓటర్ ఐడీ, ఇతర పత్రాలతోనే పాస్‌పోర్టులు పొందుతున్నారా?,మధ్యవర్తుల నెట్‌వర్క్ ఇంకా కొనసాగుతోందా?, విదేశీయులు భారతీయులుగా మారి విదేశాలకు వెళ్లడం జాతీయ భద్రతకు ముప్పుగా మారుతోందా?

పాస్‌పోర్టు అనేది కేవలం ప్రయాణ పత్రం మాత్రమే కాదు, భారత పౌరుల మాదిరిగా అన్ని ప్రభుత్వ సేవలు పొందే అత్యంత కీలక గుర్తింపు పత్రాల్లో ఒకటి. అలాంటి పత్రం నకిలీ ఆధారాలతో విదేశీయుల చేతికి వెళ్తే అది జాతీయ భద్రతకే సవాలుగా మారుతుందని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**శ్రీలంక మహిళకు భారత పాస్‌పోర్టు..**

ఇటీవల శంషాబాద్ విమానాశ్రయంలో తనిఖీ చేయగా శ్రీలంకలోని కొలంబోకు వెళ్లేందుకు వచ్చిన పుష్ప కుమారి అంగ్లూరి అనే మహిళ వద్ద భారత పాస్‌పోర్టుతో పాటు హలియావత్తలగే పుష్ప కుమారి పేరిట జారీ అయిన శ్రీలంక పాస్‌పోర్టు కూడా లభించింది. విచారణలో ఆమె 2009లో శ్రీలంక పాస్‌పోర్టుతో భారతదేశానికి వచ్చి తిరిగి వెళ్లకుండా ఇక్కడే ఉండి, తన అసలు గుర్తింపును మార్చుకుని మోసపూరితంగా భారత పాస్‌పోర్టు పొందినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

**అఫ్గాన్ పౌరుడికి భారత పాస్‌పోర్టు..**

అఫ్గానిస్థాన్‌కు చెందిన సామియుల్లా షా అనే వ్యక్తి భారత పాస్‌పోర్టు (నం. Y5778942)తో ఎమిరేట్స్ విమానం ద్వారా దుబాయ్ వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చాడు. ప్రయాణ పత్రాలను పరిశీలించిన ఇమ్మిగ్రేషన్ అధికారులకు డేటాబేస్‌లో అబ్దుల్లా దాద్ మహ్మద్ అనే అఫ్గానిస్థాన్ పౌరుడి వివరాలు కనిపించాయి. 2020లో మెడికల్ వీసాపై భారత్‌కు వచ్చిన ఆ వ్యక్తి ఇప్పటికీ దేశం విడిచి వెళ్లలేదని రికార్డులు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో నకిలీ పత్రాలు రూపొందించడం, భారత పాస్‌పోర్టు పొందేందుకు సహకరించిన ఏజెంట్ల ప్రమేయంపై లోతుగా సిసిఐ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**నకిలీ గుర్తింపు పత్రాలతో మహిళకు పాస్‌పోర్టు..**

దుబాయ్ నుంచి విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్న దొండపాటి సుజేవను ఇమిగ్రేషన్ అధికారులు తనిఖీ చేశారు. విచారణలో ఆమె తన అసలు పేరు పట్టా మేరీ రాజ్యలక్ష్మి అని, అయితే దొండపాటి సుజేవ పేరుతో నకిలీ గుర్తింపు పత్రాల ఆధారంగా భారత పాస్‌పోర్టు పొందినట్లు అంగీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పాస్‌పోర్టు పొందేందుకు కువైట్‌లో ఉన్న రమేష్ దొండపాటి సహకరించినట్లు కూడా ఆమె వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో నకిలీ పత్రాల తయారీ, పాస్‌పోర్టు పొందేందుకు సహకరించిన వ్యక్తులు, అంతర్జాతీయ నెట్‌వర్క్ ప్రమేయం ఉందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** పోక్సో కేసులో యువకుడిని రిమాండ్‌కు తరలించిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలో ఇంటర్మీడియేట్ చదువుతున్న విద్యార్థిని కాలేజీకి వెళ్తానని చెప్పగా కళాశాలకు విద్యార్థిని హాజరు కాలేదని యాజమాన్యం సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పరిసరా ప్రాంతాల్లో, స్నేహితుల ఇంటి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆరా తీయగా ఆమె బంధువైన మరోక అమ్మాయి కూడా ఇంటి నుండి వెళ్లి కనిపించకుండా పోయినట్టు గుర్తించారు. వారికి బంధువైన ఉప్పాల అజయ్ కూడా విధులకు వెళ్లి ఇంటికి రాకపోవడం ఫోన్ స్విచాఫ్‌లో ఉన్నట్లు గుర్తించి అజయ్ మోటర్‌సైకిల్ కుషాయిగూడ పరిధిలోని ఓ జూనియర్ కాలేజీ వెనుక పార్క్ చేసి ఉండటాన్ని గుర్తించి అతను ఇద్దరు బాలికలతో వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడి ఫోన్ నంబర్ ద్వారా లోకేషన్ ఆధారంగా గుర్తించి కేసును ఛేదించి అదృశ్యమైన బాలికల స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితున్ని పోక్సో కేసు కింద రిమాండ్‌కు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

## ఇద్దరు బైకు దొంగల అరెస్టు



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఇద్దరు బైకు దొంగలను అరెస్టు చేసిన ఉప్పల్ పోలీసులు చోరీ చేసిన ఆరు బైకులను స్వాధీనం చేసుకొన్నారు. కొద్ది రోజుల క్రితం బైకు చోరీకి గురైందంటూ సోమా అజయ్ అనే విద్యార్థి ఫిర్యాదుతో అప్రమత్తమైన ఉప్పల్ పోలీసులు శనివారం ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బైకుపై సంచరిస్తున్న షేక్ అవైజ్ అలియాస్ ఫహాద్ (20), మహ్మద్ ఫర్హాన్ ఖురేషి (21)లను అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా ఇటీవలి కాలంలో వారు చోరీ చేసిన ఆరు బైకులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## సర్వే చేయించి ప్లాటును కాపాడాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** ప్రభుత్వ అనుమతి పొందిన హుడా లేఅవుట్‌లో నిబంధల ప్రకారం ప్లాట్ కొన్నానని ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని చర్లపల్లికి చెందిన రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం చర్లపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1986 సంవత్సరంలో చర్లపల్లి డివిజన్ ఆఫీసర్స్ కాలనీ సర్వే నంబర్ 216–222లో హుడా లేఅవుట్ చేశారని ఇందులోని ప్లాటు నంబర్ 127,128 ప్లాటు తాను కొనుగోలు చేశానని ప్లాట్‌ను ఇటీవల చదును చేశానని ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారం చర్లపల్లి ఐలా అధికారులు సర్వే చేసి తన ప్లాటు హద్దులు నిర్ణయించాలని కోరారు. ఇరువురి సమక్షంలో సర్వే చేసేందుకు తాను సిద్ధమేనని అధికారులు స్పందించి సర్వే చేయించాలని కోరారు.

## అవకతవకలు జరగలేదు

### డిఎస్ జాన్‌వెస్లి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కేంద్రంలో ఉన్న మెథడిస్ట్ చర్చిలో ఎటువంటి అవకతవకలు జరుగలేవని బిషప్ డిఎస్ అన్నారు. ఆదివారం చర్చి ఆవరణంలో మీడియా సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడుతూ... చర్చి మెంబర్ కాని వ్యక్తులు చర్చిపై అరోపణలు చేయడం మంచి పద్దతి కాదని అన్నారు. అంతర్గతంగా జరిగే విషయలను మీడియా వరకు తీసుకుపోవడం మంచిపద్దతి కాదు అన్నారు. డాక్టర్ అవినాష్ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న 40 షెటర్స్‌ను అమ్ముకోవడం జరిగిందన్నారు. 2019 నుండి 2024వరకు అడిట్ చేయడం జరిగిందన్నారు. వారి దగ్గర ఉన్న ఆధారాలతో వస్తే ఎక్కడ జరిగిందే నిరూపించాలన్నారు. చర్చి నిర్మాణ సమయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. చర్చి మెంబర్ కాని వ్యాక్తులు చర్చి విషయంలో అనవసరమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని సంఘస్తులు తెలిపారు. అవినాష్ డాక్టర్ సేవ పేరుతో పేదల వద్ద ముక్కుపిండి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఉచిత సేవ చేయాల్సిన అవినాష్ డబ్బులు అలవటు పడి ఆసుపత్రికి ఉన్న మంచి పేరును చెడగొట్టాడన్నారు. చర్చి ఉన్న ఆస్తులపై కన్నుపడి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. మెథడిస్ట్ చర్చి 2019నుండి ట్రాస్టుగా ఏర్పడిందని, ప్రతిది కమిటి ఆధ్వర్యంలోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతర్గత ఆడిట్ పూర్తియిందన్నారు. ఆసుపత్రి, డాక్టర్ అవినాష్‌పై హైకోర్టులో కేసు ఉన్నందువలన ఇలాంటి చర్యలు పాల్పడుతున్నారని తెలిపారు. కోర్టు తీర్పు తర్వత అన్ని విషయలు బయటకు వస్తాయన్నారు. ఈ సమావేశంలో సంజయ్‌కుమార్, అనిల్, సమ్‌సన్, కృష్ణ, నవిన్ పాల్గొన్నారు.

## 24లోపు దరఖాస్తులు సమర్పించాలి

### ఎమ్మార్వో చంద్రశేఖర్


**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబిత సవరణ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన దరఖాస్తు ఫారాల స్వీకరణ ప్రారంభమైనట్లు ఘట్‌కేసర్ తహసీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు.ఇప్పటికే బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లకు ఫారాలు అందజేశారని చేప్పారు.ఫారాలను పూర్తిగా ఎలాంటి సొరపాట్లు లేకుండా నింపి ఈ నెల 24వ తేదీలోగా బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులు తేదా స్వచ్ఛంద సేవకులకు అందజేయాలని దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు, పేరు జన్మతేదీ, చిరునామా, ఆధార్ సంఖ్య, మొబైల్ నంబర్ తదితర వివరాలను సరైన ఆధారాలతో నమోదు చేయాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని ప్రతి అర్హ ఓటరు ఈ ప్రకియలో భాగస్వామి కావాలని తహసీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ కోరారు.

## డంపింగ్ యార్డు వద్దని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** రాంపల్లి సర్వే నంబర్ 226లో కుమ్మరి,వడ్డరి,ఎరుకల వంటి పనిముట్ల కులాలకు గతంలో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. ప్రస్తుతం అదే స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేయడాన్ని గ్రామస్థులు,ఆయా కుల సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కీసర ఆర్‌డిఓకు ఎంపి ఫోన్ చేసి కుమ్మరి, వడ్డరి, ఎరుకల కులాలకు సంబంధించిన ప్రభుత్వ భూమి దగ్గరకు వెళ్లవద్దని కుల సంఘాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 30 లక్షల రూపాయలు మంజూరు చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌శర్మ, బుద్ది శ్రీనివాస్, చంద్రారెడ్డి, సురేష్, బుచ్చిరెడ్డి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాలతో ప్రజలు అయోమయం


### ‘సర్’ ప్రక్రియలో జాప్యం
### ఓటర్లలో అవగాహన కల్పించటంలో అధికారుల వైఫల్యం
### 2002 ఓటరు జాబితాకు ముడిపడి ఉండటంతో గందరగోళం
### కేవలం తెలుగు భాషలో ముద్రితమై ఉండటం మరో సమస్య




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సర్ ప్రక్రియలో భాగంగా మేడ్చల్ జిల్లాలో పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ పత్రాలను పూరించి తిరిగి ఇవ్వటంలో ఓటర్లలో గందరగోళం సృష్టిస్తోంది. ఈ ఫారాలలో ప్రస్తుత వివరాలతో పాటు 2002 ఓటరు జాబితాకు ముడిపడి ఉండటమే కాకుండా ఆ ఫారాలతో పాటు పుట్టిన తేదీ ధృవీకరణపత్రాలు, పాస్‌పోర్టు ఫొటోలు జతపరచాలన్న నిబంధన మరింత అయోమయానికి గురి చేస్తోంది. పత్రాలను పూరించటంలో ఎలాంటి తప్పులు దొర్లకూడదంటూ బిఎల్‌ఓలు హెచ్చరికగా చెబుతుండటంతో ఏ మాత్రం పొరపాటు జరిగినా తమ ఓటు హక్కు ఎక్కడ పోతుందేమనన్న భయంతో వాటిని పూరించటానికే వెనుక ముందవుతున్నారు. దీనికి తోడు ఎన్యుమరేషన్ ఫారాల్లో అంశాలన్నీ చిన్న అక్షరాలతో కనపడీ కనపడని విధంగా కేవలం తెలుగు భాషలో మాత్రమే ముద్రించబడి ఉండటం మరో సమస్యగా మారింది. ఎన్యుమరేషన్ పత్రాలను పూరించటంలో పూర్తి అవగాహన కల్పించటంలో అధికారులు సరైన విధంగా చర్యలు తీసుకోకపోవటమే దీనికి కారణమవుతోంది. దీంతో తమకిచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పూరించి ఇవ్వటంలో ఓటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**2002 ఓటరు జాబితాతో ముడిపెట్టటంతో సందేహాలు**

బిఎల్‌ఓలు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాల్లో 2002లో ఓటరు జాబితాలో పేరు ఉంటే ఒకలా లేకుంటే మరోలా పూరించాలని, పత్రాలను పూరించటంలో వారి సంబంధీకుల వివరాలతో నింపాలని చెప్పటం ఓటర్లలో పలు అనుమానాలకు దారి తీస్తోంది. 2002 ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఉంటే ఎలా తెలుసుకోవాలో తెలియక కొంత మంది, నియోజకవర్గ పోలింగ్ బూత్ నంబర్ తెలియక మరి కొంత మంది పరిస్థితి అయోమయంగా తయారైంది. ఓ ఇంటి నుండి మరో ఇంటికి మారిన వారిలో చాలా మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు అందలేదు. కుటుంబంలో ఉన్న వారందరి వివరాలతో పాటు వారి పాస్‌పోర్టు ఫొటోలు సైతం జతపరచాలన్న నిబంధన వారి కుటుంబంలోని పిల్లల మరో రాష్ట్రంలోనో, మరో దేశంలోనో ఉద్యోగ రీత్యా వెళ్లిన వారి ఫొటోలను జతపరచే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరో పక్క పుట్టిన తేదీ ధృవపత్రాలు తప్పని సరిగా జతపరచాలన్న నిబంధన సీనియర్ సిటిజన్ల విషయంలో సమస్యగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఓటు ఉంటుందో పోతుందో అన్న ఆందోళన ఓటర్లలో నెలకొంది. వివాహమై అత్తగారింటికి వచ్చిన యువతి తమ పుట్టింట్లో ఉన్న ఓటును ఇక్కడ నమోదు చేవాలా లేక అక్కడే కొనసాగించాలా అన్న సందేహాలు సైతం నెలకొన్నాయి. విద్యావంతులే ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటే చదువుకోని వారి విషయం మరింత సమస్య అనే చెప్పవచ్చు.



## క్వాంటం టెక్నాలజీలో అనురాగ్ ముందంజ

### క్వాంటం టెక్నాలజీపై అధ్యాపకులకు ఆధునిక శిక్షణ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** భవిష్యత్ సాంకేతిక రంగంలో కీలకమైన క్వాంటం కంప్యూటింగ్ క్వాంటం సాంకేతికతలపై అధ్యాపకులు పరిశోధకులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో అనురాగ్ విశ్వవిద్యాలయం సమాచార సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. జూన్ 22 నుంచి 27 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ కుప్పుసామి, డాక్టర్ జిఎన్ వివేకానంద, సచిన్ నామ్‌దేవ్, విద్యాసాగర్ పల్లా, డాక్టర్ విఆర్ శర్మ ధూళిపాల క్వాంటం కంప్యూటింగ్ క్వాంటం అల్గోరిథమ్‌లు క్వాంటం గుప్తీకరణ పోస్ట్ క్వాంటం భద్రత ఆధునిక ఉపన్యాసాలు ఇచ్చారు. కార్యక్రమం విజయవంతానికి సమాచార సాంకేతిక విభాగాధిపతి డాక్టర్ నితీషా శర్మ మార్గదర్శకత్వం నిర్వాహకుడు శేఖర్ రెడ్డి, సమన్వయం, కన్వీనర్ డాక్టర్ జిఎల్ ఆనంద్‌బాబు కృషి విశేషంగా నిలిచింది. సాంకేతిక రంగాల్లో పరిశోధన ఆవిష్కరణలకు అనురాగ్‌విశ్వవిద్యాలయం తన ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పింది.



## పత్రాల సమర్పణలో వేగం పెంచాలి

### మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ పిలుపు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే ప్రతి ఓటరు తన గణన పత్రాన్ని ఎన్యూమరేషన్ ఫారం త్వరితగతిన పూర్తి చేసి సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేయాలని కొర్రెముల మాజీ సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్ కొర్రెముల పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ తనిఖీ అధికారి సాయిరాం, గ్రామ పంచాయతీ అధికారులు అన్నపూర్ణ, సత్యనారాయణ, బూత్ స్థాయి అధికారులతో కలిసి ఓరుగంటి వెంకటేష్ గౌడ్ గణన పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రతి కుటుంబం గణన పత్రాలను పూర్తిగా నింపి అందించాలని కోరారు. అనంతరం చౌదరిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు కేశపావుల వినోద్ కుమార్, మాజీ వార్డు సభ్యులు నర్సింగ్‌రావు ముదిరాజ్, భోజరెడ్డి, మంచాల సుధాకర్ తదితరులు పాల్గొని గణన పత్రాలపై అవగాహన కల్పిస్తూ సకాలంలో సమర్పించాలని కోరారు.

## సమర్ధవంతంగా వన్యప్రాణుల సంరక్షణ చట్టం

### నీల్‌గాయ్‌ని వేటాడి చంపిన కేసులో ముగ్గురు నిందితులు రిమాండ్
### వివరాలను వెల్లడించిన మల్కాజ్‌గిరి అదనపు డిసిపి రాంకుమార్




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వణ్యప్రాణులను వేటాడి చంపిన కేసులో ముగ్గురు నిందితులు రిమాండ్‌కు తరలించిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మల్కాజ్‌గిరి అదనపు డిసిపి రాంకుమార్ వివరాలను వెల్లడించారు. వేముల సునీల్ సల్మాన్ రాజ్, ఆలియాస్ సునీల్ (56), వేముల అఖిల్ (29) స్వస్థలం ఖమ్మం జిల్లాకు చెందిన వారు యాప్రాల్‌లో నివాసముంటున్నారు. బాలానగర్‌కు చెందిన కట్టా ఆదినారాయణ(46) ఈ ముగ్గురు కలిసి అదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సునీల్ టెలిస్కోప్‌ను అమర్చి తాను లైసెన్స్ పొందిన రైఫిల్‌ను ఉపయోగించి ఒక నీల్‌గాయ్‌ని వేటాడి ఆ జంతువును చంపారు. తర్వాత సునీల్ తన కొడుకు అఖిల్‌తో పాటు పనివాడు కట్టా ఆదినారాయణతో కలిసి నీల్‌గాయ్ చర్మాన్ని ఒలిచి మాంసాన్ని ముక్కలుగా కోసి సంచిలో వేసుకుని జవహర్‌నగర్‌లోని యాప్రాల్‌లో ఉన్న తమ ఇంటికి బొలేరో వాహనంలో బయల్దేరారు. ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు శామీర్‌పేట పోలీసులు, మల్కాజ్‌గిరి ఎస్ఓటి బృందం సంయుక్తంగా అంతాయిపల్లి బిట్స్ పిలాని జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మహేంద్రా బొలోరే (టిజి08డి0433) నెంబర్‌గల వాహనాన్ని తనిఖీ చేయగా ఆ వాహనంలో నీల్‌గాయ్ మాంసం మరియు నేరానికి సంబంధించిన ఇతర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే ముగ్గురు నిందితులను శామీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. రక్షిత వన్యప్రాణులను అక్రమంగా వేటాడటం తీవ్రమైన నేరమని వన్యప్రాణులకు పర్యావరణానికి పూడ్చలేని నష్టాన్ని కల్గిస్తుందన్నారు. వన్యప్రాణులు నేరాల్లో పాల్గొన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడానికి మరియు వన్యప్రాణుల సంరక్షణ చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయడానికి మల్కాజ్‌గిరి పోలీసులు కట్టుబడి ఉన్నారని అదనపు డిసిపి రాంకుమార్ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటి అదనపు డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి, జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, శామీర్‌పేట ఎస్‌హెచ్ఒ కొండ నర్సింహారెడ్డి, ఎస్ఓటి మల్కాజ్‌గిరి టిమ్2 ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ పిఎస్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్

### గంజాయి హాట్‌స్పాట్‌ల గుర్తింపు, వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం భారీస్థాయిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జవహర్‌నగర్ ఇన్స్‌పెక్టర్ సైదులు నేతృత్వంలో, డిఐ ఎం.శ్రీనివాస్, పీఎస్ సిబ్బంది ఏఆర్ సిబ్బందితో కలిసి ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు సాధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**గంజాయి హాట్‌స్పాట్‌ల గుర్తింపు**

రిజిస్ట్రేషన్ కాలనీ పరిధిలో విస్తృతంగా సోదాలు నిర్వహించి, 3 గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించారు. ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టి, సరైన పత్రాలు లేని 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తనిఖీల అనంతరం స్థానిక ప్రజలతో పోలీసులు ముఖాముఖి నిర్వహించి, పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లకు డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యల గురించి తల్లిదండ్రులకు వివరించారు. డ్రగ్స్, గంజాయి సేవించడం వల్ల జీవితాలు ఎలా నాశనమవుతాయో వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాలనీల్లో భద్రతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, కాలనీల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు.



## తొట్టెల ఊరేగింపులో ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కాప్రా :** హెచ్‌బి కాలనీ డివిజన్ కైలాసగిరి కాలనీలో ఆదివారం జరిగిన అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, గుండారపు శ్రీనివాసరెడ్డి, బిఆర్‌ఎస్ శ్రేణులు జంపాల్‌రెడ్డి, పూస రమేష్, శేఖర్ గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం




**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ సముదాయం లో బికె ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను టిపిసిసి ప్రోటోకాల్ కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి సౌకర్యాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావాలి గణేష్, సూరారం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, దొంతి మహేష్ ముదిరాజ్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఎ, బిఎల్ఓలు సమన్వయంతో ఓటర్లకు సహకారం



### బిఆర్‌ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బిఎల్ఎలు, బిఎల్ఓలు సమన్వయంతో ఓటర్లకు సహకరిస్తూ పనిచేయాలని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, సుభాష్ చంద్రబోస్ నగర్, చంద్రగిరి నగర్ లలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కెపి వివేకానంద పరిశీలించారు. బిఎల్ఎలు, బిఎల్ఓల పనితీరుని తెలుసుకున్నారు. అనంతరం బస్తీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రతిఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని, బిఎల్ఎలు, బిఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, బిఎల్ఓలు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

**శ్రీరామ్ నగర్‌లో సిమెంటు రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, చింతల్ సర్కిళ్ల నుండి రూ.కోటి పదకొండు లక్షల సిమెంటు రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులతో కలిసి పరిశీలించారు. గాజులరామారం సర్కిల్ శ్రీరామ్‌నగర్‌లో పర్యటించిన వివేక్ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే మాబలం, అభివృద్ధే మా లక్ష్యమని, ప్రతి కాలనీ, బస్తీల్లో నాణ్యమైన రహదారులను నిర్మించడమే బాధ్యతగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడమే తమ కర్తవ్యమని అన్నారు. స్థానికంగా గల ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో వివేక్ పూజలు చేశారు. కార్యక్రమంలో డీఈఈ అనురాగ్, వర్క్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, నాయకులు విజయరాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాల్ రాజ్, కమలాకర్, తెలంగాణ సాయి, ఇబ్రహీమ్ ఖాన్, మాజిద్, రమేశ్, భాస్కర్ రెడ్డి, మధుబాబు, అలివేలు, రుక్మిణి, జ్యోతి, అర్చన, పద్మ, కల్పన పాల్గొన్నారు.


## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి శంకుస్థాపన

### ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట :** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద గ్రామంలో ఛత్రపతి శివాజీ యువజన సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ స్థాపన పనులకు శుభారంభం చేశారు. అనంతరం మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీక అని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలో శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీధర్ రావు, గ్రామ పాలకవర్గ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, కందాడ నాగిరెడ్డి, గ్రామ పెద్దలు, ఛత్రపతి యువజన సంఘం సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అన్నదాన కార్యక్రమం నిర్వహించిన విష్ణువర్ధన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్**

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ యువజన సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, చేవెళ్ల బీజేపీ ఇంచార్జ్ కే.ఎస్.రత్నం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, స్వాభిమానం, హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. యువత శివాజీ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి, దేశ సేవకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిట్టిగిద్ద గ్రామంలో 18 అడుగుల ఎత్తైన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేయిస్తానని ఈ సందర్భంగా కే.ఎస్. రత్నం ప్రకటించారు. గ్రామ ప్రజలు, యువజన సంఘం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏర్పాటు కానున్న ఈ విగ్రహం యువతలో దేశభక్తి, ధైర్యం, ఐక్యత భావాలను పెంపొందించే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు విష్ణువర్ధన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద



సంఖ్యలో గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో, దేశభక్తి నినాదాల మధ్య ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ ఛత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు ,బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, శ్రీకాంత్ రెడ్డి, గాలయ్య, సారా జగన్, రామకృష్ణ రెడ్డి, గోపాల్ గౌడ్, రమేష్, విష్ణువర్ధన్ గౌడ్,చంద్రశేఖర్ రెడ్డి,బంధయ్య గౌడ్, శ్రీహరి, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
13-07-2026
www.prajapaksham.in

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా చెన్నై లవ్ స్టోరీ.

రీల్



## 24న 'చెన్నై లవ్ స్టోరీ' విడుదల

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా చెన్నై లవ్ స్టోరీ. అమృత ప్రొడక్షన్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్. సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్‌బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది.మెలోడీ బ్రహ్మ మణిశర్మ పుట్టినరోజు వేడుకల్ని 'చెన్నై లవ్ స్టోరీ' టీమ్ ఘనంగా నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, నిర్మాతలు ఎస్ కేఎన్, సాయి రాజేష్, సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మణిశర్మకు బర్త్ డే విశెస్ తెలిపారు. ఈ సినిమాకు మణిశర్మ కంపోజ్ చేసిన 'తొలి ప్రేమేం తొపు కాదే..', 'వదలనే..', 'జగితారా..', 'హాయిలా హాయిలా' పాటలన్నీ చాట్ బస్టర్స్ గా మ్యూజిక్ లవర్స్ ను అలరిస్తున్నాయి.ఈ చిత్రానికి ఆర్ట్ భాస్కర్ ముదావత్, ఎడిటర్ సంతోష్ నాయుడు, డీవోపీ విశ్వాస్ డేనియల్, పాటలు అనంత్ శ్రీరామ్, విశాల దాట్ల, లైన్ ప్రొడ్యూసర్ శ్యామ్ ప్రసాద్ మేక.

## 'హ్యాపీ జర్నీ' నుంచి 'ఆనందమే' పాట రిలీజ్



రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, మహిళల భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జీనీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు 'ఆనందమే' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసి, మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. ఈ పాట పూర్తిగా పాజిటివ్ ఎనర్జీ, ఫీల్‌గుడ్ వైబ్‌తో సాగుతుంది. వేర్వేరు వయసుల వారు కలిసి పారిస్ ట్రిప్‌లో ప్రతి క్షణాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారో ఈ పాటలో అందంగా చూపించారు. శేఖర్ చంద్ర అందించిన స్వరాలు ఉత్సాహాన్ని నింపేలా ఉన్నాయి. సురేష్ బనిసెట్టి రాసిన సాహిత్యం బంధాల నుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరే పక్షులలా మనసులోని ఆనందాన్ని పొంగుతూ ఎంతో అందంగా సాగింది. సత్య యామిని తన ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు.విజువల్‌గా కూడా ఈ పాట ఎంతో ఆకట్టుకుంటుంది. పారిస్ వీధులు, అందమైన లొకేషన్లు, పాట హృదయానికి దగ్గరైన భావోద్వేగాలను కూడా చూపించబోతోంది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఫోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. చిత్రానికి సహ నిర్మాత: తరుణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శైలేంద్ర కుమార్, డిఓపి : మణికందన్ సుబ్రమణియన్, ఎడిటర్: ఫోటా కె ప్రసాద్

## రూ.100 కోట్ల క్లబ్‌లో సమంత




లేడీ ఓరియంటెడ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' సినిమా ఇప్పుడు రూ.వంద కోట్ల క్లబ్ లో చేరిపోయింది. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా వంద కోట్లు వసూల్ చేసింది. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలసి ఈ సినిమాను నిర్మించారు. యాంకర్ శ్రీముఖి, గుల్షన్ దేవయ్య, చైతన్య కృష్ణ, మంజుశ్రీ ప్రధాన పాత్రలు పోషించారు. జూన్ 19వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా విజయవంతంగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో వంద కోట్లు సంపాదించిన నేపథ్యంలో సమంత వంద కోట్ల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ పోస్టర్ కు సంబంధించి ఒక వీడియోను కూడా సమంత రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సమంత ఆశ్చర్యంతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## 'చోర శిఖామణులు' షూటింగ్ షురూ



శ్రీకరివివాన్ సమర్పణలో శ్రీకరి క్రియేషన్స్ బ్యానర్ మీద బానూరు నాగరాజు నిర్మిస్తున్న చిత్రం 'చోర శికామణులు'. ఆనంద్ కుర్మా ఈ మూవీకి కథ, కథనం, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, క్రైమ్, కామెడీ జానర్లో రానున్న ఈ మూవీలో రామ్ తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, అజయ్ ఘోష్, సంపూర్ణేష్ బాబు, మురళీధర్ గౌడ్, అప్పు, కరణ్, జబర్దస్త్ సత్య శ్రీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించనున్నారు. చోర శికామణులు' చిత్ర ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలకు త్రినాథరావు నక్కిన, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, త్రినాథరావు నక్కిన స్క్రిప్ట్ అందించగా.. తొలి సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆనంద్ రాజావిక్రమ్ సంగీత దర్శకుడిగా, జగదీష్ కొమరి కెమెరామెన్గా, యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలను డ్రాగన్ ప్రకాష్ నిర్వహించనున్నారు. జూలై 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మంచి సాంగ్తో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ శ్రీకరివివాన్ బ్యానర్ శ్రీకరి క్రియేషన్స్, నిర్మాత బానూరు నాగరాజు, సంగీత దర్శకుడు ఆనంద్ రాజవిక్రమ్ ఎడిటర్ శ్రీకాంత్ (కేజీఎఫ్), ఫైట్స్ డ్రాగన్ ప్రకాష్.

## 'ఏపీ సీఎం లక్ష్మి ప్రణతి' పాత్రలో రమ్యకృష్ణ




ప్రముఖ సోషల్ మీడియా ఇనుఫ్లుఎన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తూ డైరెక్టర్ రతన్ రిషి 'క్వీన్' మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్ గా నటిస్తున్నారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఒక ఇంపార్టెంట్ అనౌన్స్ మెంట్ చేశారు. 'క్వీన్' చిత్రంలో ఒక పవర్ ఫుల్, స్ట్రాంగ్ క్యారెక్టర్ లో ప్రముఖ నటి రమ్యకృష్ణ నటిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ప్రణతి పాత్రలో రమ్యకృష్ణ తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. 'క్వీన్' చిత్రాన్ని వాస్తవ ఘటనల ఆధారంగా, రియల్ క్యారెక్టర్స్ ను స్ఫూర్తిగా తీసుకుని ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. 2006–2010 మధ్య కాలం నేపథ్యంగా ఈ చిత్ర కథ సాగనుంది. ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూడబోతున్నారు. 'క్వీన్' సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.యామినీ కాళకేయ ప్రభాకర్, డీవోపీ బాల ఎన్ సరస్వతి ( సరస్ ), మ్యూజిక్ భరత్. ఎం, ఎడిటింగ్ ఆర్ ఎం విశ్వనాథ్ కుచనాపల్లి.

## మంగ పాత్ర నా మనసుకు చాలా దగ్గరగా ఉంటుంది: హీరోయిన్ రాషా తడానీ



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాషా తడాని మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. గత ఏడాది జూలైలో ఈ కథ విన్నాను.ఆ ఎమోషన్ను నేను కూడా ఫీల్ అయ్యాను. ఇది చాలా అద్భుతమైన కథ. ఈ సినిమా కోసం దర్శకుడు అజయ్ భూపతి ప్రతి డైలాగ్, అందులోని ఎమోషన్ను దగ్గరుండి నేర్పించారు. ప్రతీ విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. నాకు తెలుగు తెలియదు. మొదట్లో డైలాగులు అర్థం చేసుకోవడానికి కాస్త కష్టపడ్డాను. కానీ దర్శకుడు అజయ్ భూపతి గారు నాకు చాలా హెల్ప్ చేశారు. తెలుగు, హిందీ కలిపి డైలాగుల అర్థం చెప్పేవారు. ఆయన వల్ల నా పని చాలా ఈజీ అయింది. పూర్తిగా ప్రిపేర్ అయిన తర్వాతే షూటింగ్ చేసేవాళ్లం. కావాల్సిన టైమ్ ఇచ్చేవారు. వైజయంతి మూవీస్ చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. ఆ సంస్థ నుంచి మహేష్ బాబుతో పాటు ఎంతో మంది స్టార్స్ పరిచయం అయ్యారు. నా జీవితంలో కలిసిన బెస్ట్ పర్సన్లలో అశ్వినీ దత్ ఒకరు. ఆయన నన్ను ఎప్పుడూ మనవరాలిలా చూసుకునేవారు. ఏది కావాలన్నా అడగమని చెప్పేవారు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో చాలా ఆరోగ్యకరమైన, ఆనందకరమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. శ్రీనివాస మంగాపురం లాంటి మంచి సినిమాతో తెలుగులో పరిచయం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను.అజయ్ భూపతి ఆర్ఎక్స్ 100 చూసినప్పుడు నేను చాలా ఇంప్రెస్ అయ్యాను. అలాగే మంగళవారం కూడా చాలా ప్రత్యేకమైన సినిమా. శ్రీనివాస మంగాపురం కూడా అద్భుతంగా వచ్చింది. దేవుడు, ప్రేక్షకుల ఆశీస్సులతో ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## ఆర్‌సి పురంలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

### ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన సినీ నటి రాశి ఖన్నా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది. ఈ క్రమంలో ఆర్ సి పురంలో ఆదివారం తన 31వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి రాశి ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.రిబ్బన్ కటింగ్ అనంతరం నటి రాశి ఖన్నా మాట్లాడుతూ ఆర్ సి పురం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంత మవుతుంది" అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ"ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యం" అని తెలిపారు."మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు .మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని, ఈ మాల్ ప్రారంభంతో ఆర్ సి పురం ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూ డా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు.దేశ వ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోందన్నారు.

ఆర్ సి పురం ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని డైరెక్టర్స్ కోరారు.

## వయనాడ్ కొండ చరియల విపత్తు మృతదేహం లభ్యం..

**వయనాడ్ (కేరళ):** కేరళలోని వయనాడ్ కల్లాడి టన్నెల్ ప్రాజెక్ట్ సమీపంలో జూలై 7న సంభవించిన భారీ కొండచరియల విరిగిపాటు ఘటనలో ఐదు రోజులుగా గల్లంతైన ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్‌గా విక్రమ్ రాణా (58) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన ఆయన మృతదేహాన్ని మీనాక్షి వంతెనకు దిగువన దాదాపు 350 మీటర్ల దూరంలో ఇనుప వ్యర్థాలు పేరుకుపోయిన చోట రెస్క్యూ బృందాలు కనుగొన్నాయి; దీనితో ఈ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ ఇఆర్ఎఫ్), స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ ఒజి), అగ్నిమాపక, అటవీ శాఖల సిబ్బందితో పాటు యువజన సంఘాలు సంయుక్తంగా చేపట్టిన ఈ ముమ్మర గాలింపు చర్యలను కేరళ వ్యవసాయ శాఖ మంత్రి టి. సిద్దిఖీ, రాష్ట్ర పోలీస్ చీఫ్ రవాడ ఎ. చంద్రశేఖర్ స్వయంగా సమీక్షించారు. సీసీటీవీ ఫుటేజ్, కార్మికుల సమాచారం ఆధారంగా నది పొడవునా ప్రత్యేక రంగాలుగా తెలిపింది.

## జల జగడాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మాధుర్యం తెలుస్తుందని, మనిషి మనుగడ కోసమే పుట్టిన సిద్ధాంతం కమ్యూనిజం అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండా పోరాట ఛాయలు ఉంటాయని దోపిడీ రహిత పేదల రాజ్యం స్థాపించడమే ఎర్ర జెండా లక్ష్యమన్నారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తుందని దాన్ని దాచి పెట్టేందుకు నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పట్టిస్తున్నారని, హిందుత్వ ఎజెండాతో ఓట్ల లబ్ధి పొందేందుకు, రాజ్యాంగ వ్యవస్థను తుంగలో తొక్కినందుకు రాజ్యాంగ పీఠికకు బిజెపి ఉరి తాళ్లు పేనుతోందన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమయ్యే విధానాలను అనుసరిస్తుందని, పేదల సంక్షేమ పథకాలను ఉచితాల పేరుతో ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని, అలాంటప్పుడు కార్పొరేటర్లకు బహుళ జాతీ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఉచిత పథకాలపై విష ప్రచారం చేస్తున్న కేంద్రం, కంపెనీలకు ఇస్తున్న లక్షల కోట్ల రాయితీపై ఎందుకు ప్రచారం చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, పేదల గుడిసెలను కూలిస్తే పాలకుల గుండెల్లో గుణపాలు దిగుతాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9 నుండి 16 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహిస్తున్నామని సెప్టెంబర్ 1న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఢిల్లీల్లో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలన్నారు. సిపిఐ నేత జితేందర్‌రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవోద్యమ చరిత్ర అంశంపై తరగతులు బోధించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహులు, వివిధ జిల్లాల నాయకులు రమేష్, సురేష్, శ్రీరామ్ , మోష శ్రీహరి, గోపాలకృష్ణ, రాబర్ట్ భాస్కర్, అబ్రహం, దంగు కుర్మయ్య, రవీందర్, వంక గోపాల్, కాకం బాలస్వామి, కృష్ణవేణి, గీత, శ్యామల, చెన్నమ్మ, లావణ్య, కురుమ లక్ష్మి , శ్రీ విద్యా పద్మావతి, భార్గవి, ఇందిరా, సంతోష్, శ్రీను, దేవానంద్, పెంటయ్య, లక్ష్మి పతి, నరసింహ శెట్టి, లక్ష్మి నారాయణ శెట్టి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సందర్శకుల సందడి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కరీంనగర్,పక్క రాష్ట్రమైన ఛత్తీస్గడ్ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడంతో జలపాతం వద్ద పర్యాటకులు కుటుంబ సభ్యులు, యువత, చిన్నారులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. చల్లని వాతావరణం, పచ్చని ప్రకృతి, జలపాతం నుంచి జాలువారుతున్న నీటి అందాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే జలపాతం వద్ద పర్యాటకులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా, హెచ్చరిక బోర్డులను గౌరవిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పరిశుభ్రతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో బొగత జలపాతం మరింత అందంగా మారడంతో రానున్న రోజుల్లో సందర్శకుల రద్దీ ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

## గుర్తింపు ఇవ్వండి..

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోనే తెలంగాణ రాజ్య సమితి, తెలంగాణ రక్షణ సమితి పేర్లతో రెండు పార్టీలకు గుర్తింపునిచ్చారని, వాటికి లేని అభ్యంతరాలు తెలంగాణ రక్షణ సేనపై ఎందుకు అని ప్రశ్నించారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు లేఖ రాశారు. కేవలం సాధారణ భౌగోళిక వర్ణనాత్మక ఉనికిని బట్టి, ఊహాజనిత సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టప్రకారం నిష్పాక్షికమైన, హేతుబద్ధమైన పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏమిటనేది కూడా పరిశీలించాలని, ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారమే ఇదంతా చేయించారా? అనేది కూడా తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుందని పేర్కొన్నారు. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకుని తాము సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని, ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలంటే అది తమకు తీవ్ర నష్టమని, అన్యాయం అవుతుందన్నారు.

'తెలంగాణ రక్షణ సేన' పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమాధానం ఇవ్వడానికి తమకు తగినంత సమయం ఇచ్చిన తర్వాతనే వ్యక్తిగత విచారణకు పిలవాలని విజ్ఞప్తి చేశారు.

## తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాది జూన్‌లో విడుదల చేసిన బిహార్ సర్‌లో ఈ ప్రకటనను చేర్చారు. కొత్త ఓటర్లు ఫారం 6తో పాటు ఈ ప్రకటనను కూడా దాఖలు చేయాల్సి ఉండేది. బిహార్ రోజువారీ సర్ బులెటిన్‌లలో ప్రకటనలతో పాటు నింపిన ఫారం కూడా చూపనట్లు ఇసి అధికారి తెలిపారు. ఈ ప్రకటనను ఆదేశాల ద్వారా చేర్చారని, ఫారం 6లో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. 'ఇది ఓటర్లను గుర్తించడంలో సహాయపడుతుంది. కొత్త ఓటర్లు దరఖాస్తుతో పాటు సమర్పించాల్సిన పత్రాలను తగ్గిస్తుంది' అని ఆ అధికారి తెలిపారు. ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ఫారం 6 నింపితే, ఆ ప్రకటనను నింపే వరకు వారు ముందుకు వెళ్లలేరు. మరోవైపు, ఎన్నికల అథారిటీ ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను సమర్థించుకుంది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు లేవనెత్తిన ఆందోళనలను తోసిపుచ్చుతూ, ఈ ప్రక్రియ పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా ఉందని, సుప్రీంకోర్టు ఆమోదం పొందిందని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన భారత పౌరులందరినీ చేర్చి, నకిలీ, మరణించిన, వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన, గైర్హాజరైన, విదేశీ ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడమే లక్ష్యమని ఇసి అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌తో సహా పలు ప్రాంతాల్లో మైనారిటీ ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారన్న ఆరోపణలపై స్పందిస్తూ, తొలగింపులను సవాలు చేసేందుకు ఓటర్లకు తగిన అవకాశాలు కల్పించామని, ఎలాంటి పక్షపాతం లేదని ఇసి అధికారులు ఖండించారు. ప్రభుత్వానికి ఇటీవల రాసిన లేఖలో, ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

## 'ఆరోగ్యశ్రీ'పై అసహనం

(మొదటి పేజీ తరువాయి)



చెబుతున్నారు.ఆరోగ్యశ్రీ పరిధిలో చికిత్స పొందుతున్నప్పటికీ, ముందస్తుగా కొంత మొత్తం చెల్లించాల్సిందేనని కొందరు వైద్యశాలల నిర్వాహకులు ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న రోగుల కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి డబ్బులు సమకూర్చుకోవాల్సి వస్తోంది. చెల్లింపులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా నేరుగా నగదు రూపంలోనే ఇవ్వాలని కోరుతున్నారనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**ప్రభుత్వ వైద్యశాలల్లో ఔషధాల కొరత**

మరోవైపు ప్రభుత్వ వైద్యశాలల్లోనూ అనేక సమస్యలు కనిపిస్తున్నాయి. నిర్మల్ పట్టణంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం, ప్రాంతీయ వైద్యశాలలు. ఇతర ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడం రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వైద్యులు సూచించిన మందులు ప్రభుత్వ నిల్వల్లో లేకపోవడంతో బయట ఉన్న మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.ఒక్కో కుటుంబం మందుల కోసమే వందల నుంచి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉచిత వైద్య సేవలు అందాల్సిన చోట మందుల కోసం బయటకు వెళ్లాల్సి రావడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలను బహిర్గతం చేస్తోంది.

**ఆకస్మిక తనిఖీలకు ప్రజల డిమాండ్**

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే కఠినమైన పర్యవేక్షణ, నిరంతర తనిఖీలు, పారదర్శక వ్యవస్థ అవసరం. నిర్మల్ జిల్లాలోని అన్ని ఆరోగ్యశ్రీ అనుబంధ వైద్యశాలలపై సమగ్ర పరిశీలన చేపట్టి, నిబంధనలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే ప్రభుత్వ వైద్యశాలల్లో అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే మహత్తర లక్ష్యంతో రూపొందించిన ఆరోగ్యశ్రీ పథకం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ :**

ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఏ ప్రైవేట్ ఆసుపత్రి అయినా అక్రమాలకు పాల్పడితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ స్పష్టం చేశారు. రోగులను ఆరోగ్యశ్రీ కింద చేర్చుకున్నాక, టెస్టుల పేరుతో అదనపు బిల్లులు వేసి డబ్బులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి ఆరోగ్యశ్రీ క్లెయిమ్ డబ్బులు మంజూరైన తర్వాత, ఆసుపత్రులు రోగుల నుండి అంతకుముందు తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వకపోతే అది తీవ్రమైన తప్పు అవుతుందని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ, ఏ ప్రైవేట్ ఆసుపత్రిలోనైనా ఆరోగ్యశ్రీ నిబంధనల విచారణ జరిపిస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో తప్పు రుజువైతే సదరు ఆసుపత్రులపై శాఖాపరంగా కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని డీఎంహెచ్ఓ భరోసా ఇచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com